

అక్టోబర్ '65
వెల 7 పై
జ్యోతి


దర్శకత్వం: K. హేమాంబరధరరావు
నిర్మాతలు: M.K. రెడ్డి... T.V.
ఆంధ్ర సీడెడ్ నైజాం
గౌతమి పిక్చర్స్... జయలక్ష్మీ పిక్చర్స్... వాణి




తొలిమాట

వచ్చేదే దీపావళి సంచిక; పండుగ (అక్టోబరు 24 వ తేదీ) కు ముందే మీ చేతిలో వుంటుంది. మామూలు సంచికకు రెట్టింపు సైజులో ఎక్కువ పేజీలతో వెలువడే ఈ సంచిక ప్రసిద్ధ రచయితల కథలు, గేయాలు, ఇతర రచనలు, కార్టూన్లు, సాధారణ శీర్షికలతోపాటు మరెన్నో ప్రత్యేకాకర్షణలను అలంకరించుకుని రానున్నది. వెల రూపాయిన్నర మాత్రమే.

• • •

క్రిందటి సంచికలో మేము ప్రకటించిన 'చిన్న చిన్న కథ' పోటీ చాలామందిని ఆకర్షించింది. దాన్ని హర్షిస్తూ అసంఖ్యాకంగా ఉత్తరాలు వస్తున్నాయి. అయితే ఆంధ్ర ప్రదేశ్‌లోని మూడు విశ్వవిద్యాలయాలకే దాన్ని పరిమితం చేసినందుకు పెక్కుమంది నొచ్చుకున్నట్టు తోస్తుంది; నాల్గవది (అగ్రికల్చరల్ యూనివర్సిటీ) కూడా వున్నదనే విషయాన్ని జ్ఞప్తికి చేస్తూ దానికి కూడా వర్తింప జేయాలని కొందరు, ఆంధ్రేతర ప్రాంత విశ్వవిద్యాలయాలకు కూడా వర్తింప జేయాలని మద్రాసు, కలకత్తా, బెంగుళూరు మొదలైన ప్రాంతాల తెలుగు విద్యార్థులు కోరుతున్నారు. మా ప్రధానాశయం అన్ని యూనివర్సిటీల, కళాశాలల విద్యార్థులకు దీన్ని వర్తింప జేయాలనే. కనుక, ఆంధ్ర, ఆంధ్రేతర విశ్వ విద్యాలయాల, వాటి అనుబంధ కళాశాలల ఆంధ్ర విద్యార్థులందరూ పోటీలో పాల్గొనవచ్చు. ఈ శీర్షిక దీపావళి (నవంబరు) సంచికలో ప్రారంభ మవుతుంది.




సచిత్ర మాసపత్రిక
బకింగ్‌హామ్‌పేట పోస్టు, విజయవాడ-2.
విడిప్రతి వెల : 75 పైసలు - ఏడాది చందా: 9 రూపాయలు
సంపుటి 3 అక్టోబరు 1965 సంచిక 10

ఇదీ వరస

ముఖచిత్రం : విజయవారి "సి. ఐ. డి." నుంచి

మేనేజింగ్ ఎడిటరు : వి. వి. రాఘవయ్య
ఆర్ట్ ఎడిటర్ ; బాపు
సంపాదక వర్గం :
నండూరి రామమోహనరావు, ముళ్ళపూడి వెంకటరమణ,
వి. ఎ. కె. రంగారావు, రావి కొండలరావు.

పోర్టోనోవో పరిశోధనా కేంద్రం



పోర్టోనోవో అంటే ఏ లాటిన్ అమెరికాలోదో అనుకోకండి. ఇండియాలోనిదే. మద్రాసుకు నూరుమైళ్ళ దూరాన, చిదంబరానికి పది మైళ్ళలో సముద్ర తీరాన వుంది.

అక్కడ ప్రపంచ ప్రసిద్ధిగన్న మెరైన్ బయలాజికల్ స్టేషన్ వుంది. సముద్ర జీవశాస్త్రంలో మౌలికమైన పరిశోధనకు అవకాశం కలిగించే విద్యాలయం ఇండియాలో అదొక్కటే. ఉష్ణమండల సముద్రాలకు చెందిన జలచరాల పరిశోధనకు అది అత్యుత్తమ మైనదని బ్రిటిష్ శాస్త్రజ్ఞులు ఎన్నిక చేశారు. అన్నామలై విశ్వ విద్యాలయం దాన్ని స్థాపించింది.

పోర్టోనోవోలో ఆ కేంద్రం స్థాపనకు ఒక ఆంధ్రుడు కారణమంటే మనకు ఆశ్చర్యం కలుగుతుంది. ఆయన ప్రొఫెసర్ ఆర్. వి. శేషయ్య. స్వస్థలం నెల్లూరు; జననం 1898; తిరుపతిలో చాలా కాలం టీచరు. ఇప్పుడాయన పోర్టోనోవో సంస్థ డైరెక్టరు. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. స్వయం కృషితో జ్ఞానార్జనచేసి పైకి వచ్చిన వ్యక్తి. ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌లో ఆయన ఫెలో. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, సి. ఎస్. ఐ. ఆర్., ఎ. ఇ. సి. లతో ఆయనకు సన్నిహిత సంబంధం వుంది. ప్రముఖ శాస్త్రవేత్త లందరితో ఆయనకు నిత్య సంబంధా లున్నాయి.

శ్రీ శేషయ్య మెరైన్ బయాలజీలో మౌలికమైన పరిశోధనలు చేశారు; చేస్తున్నారు; చేయిస్తున్నారు. ఆయనక్రింద శిక్షణ పొందిన ఎందరో పి హెచ్. డి. లు ప్రస్తుతం విదేశాలలో ఉన్నత విద్యార్జన చేస్తున్నారు. ఇప్పుడు పోర్టోనోవో సంస్థలోకి సెర్చి స్కాలర్లు పదిమంది వున్నారు. వారిలో నలుగురు ఆంధ్రులు. 22 మంది ఎమ్. ఎస్ సి. విద్యార్థులున్నారు. వారిలో అయిదుగురు ఆంధ్రులు.

చతుర్థ ప్రణాళికలో మన ప్రభుత్వం ఫిషరీస్ శాఖపై ఇతోధిక శ్రద్ధ తీసుకోనున్నది. ఆ శాఖను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వానికి సుశిక్షితులైన శాస్త్రజ్ఞుల సహాయం అవసరం. పోర్టోనోవోలోని మెరైన్ బయాలజీ కేంద్రం ఇందు కెంతైనా తోడ్పడగలదు. ఈ సదవకాశాన్ని ఆంధ్ర విద్యార్థులు కూడా వినియోగించుకో గలరని ఆశించవచ్చు.

— ఎన్. ఎస్.

ఉత్తరాయణం

12-9-65 మధ్యాహ్నం 12-45 కి మంచితనాన్ని మద్రాసులో చంపేశాడు భగవంతుడు.

నా అన్న వాళ్ళులేని నా వంటి వారికి నేనున్నానని అభయమిచ్చే హస్తం చెయ్యిదాటి పోయింది.

అడిగితే లేదనడము, ఇస్తానని ఇవ్వకపోవటము ఆయన ఎరగరు. 'జ్యోతి' తరపున శ్రీ రాఘవయ్య, బాపు, కొండలరావుగారలు దీపావళికి ప్రత్యేక సంచిక కొరకు కథ అడగడానికి వచ్చినప్పుడు పూజ్య మల్లాది రామకృష్ణశాస్త్రిగారి వద్ద నేను వుండడము జరిగింది. ఆయన ఇస్తానన్నారు. కాని ఆయన అరవయి సంవత్సరాల రెండు నెలల జీవితంలో మొదటి సారి మాట నిలువుకోలేక పోయారు.

ఆయనకు అత్యంత సన్నిహితులై, ఆయన చల్లని దీవనలో భవిష్యత్తును నిర్మించుకుంటోన్న అనేక మంది అమాయకులను దేవుడు దగా చేశాడు.

తాజీ ప్రసాద్, మద్రాస్.

శ్రీ భమిడిపాటి రామగోపాలం గారి 'గతి తప్పిన కరుణ' కథ నా హృదయంలో శాశ్వతంగా నిల్చిపోతుంది. ఇటువంటి ఉత్తమ కథను అందించిన మీకు, రచయితకు నా ధన్యవాదములు. ముప్పాళ రంగనాయకమ్మగారి 'ఆశ్చర్యం', రావి కొండలరావుగారి 'కంగారూ కనకంగారూ' కూడా చాలా బాగున్నాయి. ఈ నెల జ్యోతి సంతృప్తికరంగా వుంది.

శ్రీవిజయ, కాకినాడ.

గత నెల, రాజకీయ వార్తావరణంలో మా విద్యార్థుల సాధక బాధకాలను చర్చించి, విశ్వవిద్యాలయాల దుస్థితిని వేలుపెట్టి చూపించి, నిదురిస్తున్న ప్రభుత్వాన్ని తరణోపాయం చూపమని లేపిన సంపాదకులకు మా విద్యార్థుల తరపున కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

మీరు ప్రైవేట్లపై కనీసం విద్యార్థులైనా ఆందోళన లేవదీయక పోవడం శోచనీయం అని వివరించారు. కాని అలా చేయడం గోరుచుట్టుపై రోకలిపోటు వేసుకున్నట్టవుతుంది. కారణ మేమంటే అవుడే తెలుగు మీడియమ్ నించి కాలేజీలో అడుగుపెట్టిన విద్యార్థికి ఈ కాలేజీ చదువు అగమ్య గోచరంగా ఉంటుంది. లెక్కలేంత కోర్సును ఉపాధ్యాయులు రోజుకి గంటు చొప్పున పూర్తి చెయ్యలేరు. అందుచేత ఆరోజుకు ఛాప్టరు మాకు అర్థం కాకుండా వెళ్ళిపోతుంది. దీనివల్ల వేరే కోచింగ్ అవసరం కనుక, ఆ కోర్సు ఆ లెక్చరరే చెప్పగలరు కనుక ప్రైవేటు పెట్టక

తప్పదు. ప్రైవేట్లు లేకపోవడం మాకే నష్టం.

ఇంకా మీరు చర్చించని లోటుపాట్లు ఎన్నో ఉన్నాయి. రిజల్ట్సు ప్రకటించడంలోనూ, ప్రొఫెషనల్ కాలేజీ సీట్లులోనూ, స్కాలర్ షిప్పులు కేటాయించడంలోను, అవకతవకలు, స్వార్థాలు గోచరిస్తాయి. వీటిని గురించి విశ్వవిద్యాలయాలవారుగాని, ప్రభుత్వంవారుగాని పట్టించుకోవడం లేదు.

జె. వి. రమణారావు, ఏలూరు.

సెప్టెంబరు సంచికలో మీరు విశ్వవిద్యాలయ విద్యార్థులకు 'కథల పోటీ' ఏర్పాటు చేశారు. కాని ఈ కథల పోటీ కేవలం ఆంధ్ర ప్రదేశ్ విద్యార్థులకు పరిమితమైంది. ఆంధ్రేతర ప్రాంత విశ్వవిద్యాలయ విద్యార్థులు కూడా ఈ పోటీలో పాల్గొనే అవకాశము కల్పింపగలరని ఆశిస్తున్నాను.

డి. ఉదయభాస్కర్,
మద్రాసు.

భక్తులు ప్రతి ప్రముఖ వ్యక్తికీ వుంటారు. అది నేరం కాదేమో. 'అన్ని పుస్తకాలు రాసినప్పుడు వాటిలో ఒకటి రెండైనా మంచివి ఉండకపోతాయా' అనే వాక్యం తొందరపాటుతోనూ వుద్రేకంతోనూ రాశారు. కవి బ్రతికున్న కాలంలో అతని ప్రతీతప్పునీ, భూతద్దంతో పరీక్షించి అవహేళనకు గురిచెయ్యటం, మరణించగానే అతనిలో లేని సుగుణాలనుకూడా ఆయనకు ఆపాదించి-ఆయనతో ఒక శకం ముగిసిందని చెప్పుకోవటం ఆంధ్రుల కనాదిగా వున్న తెగులు. దయచేసి మా అభిమాన పత్రికనందు కతితం చేయాలని, యీ శీర్షికను నిలిపి వెయ్య వలసిందిగాను కోరుతున్నాను.

రాగమయి, విశాఖ.

విశ్వనాధ వారికి చరిత్ర మీద కోపమే కావచ్చు, ఆయన రాద్ధాంతాలు చేయవచ్చు. తిరోగమిస్తూ వుండవచ్చు. అంతమాత్రాన చరిత్రకుగాని, సంఘానికిగాని వాటిల్లిన నష్టమేమీ లేదు. అటువంటప్పుడు శ్రీ విశ్వనాథపై వ్యక్తిగత విమర్శకు దిగడం చరిత్రకు న్యాయం చేకూర్చడమా? అయనకు మంచిగా తోచినది ఆయన చెప్తున్నారు కానీ ఫలానా వ్యక్తివలన ఇటువంటి నష్టం జరుగుతోందని వ్యక్తిగతమైన దూషణకు దిగలేరు. ఒక వ్యక్తితో మరొక వ్యక్తి ఏకీభవించలేక పోవడం సహజం. అంతమాత్రాన ఆ మరొక వ్యక్తి తిరోగమిస్తున్నాడనటం కేవలం హాస్యాస్పదం.

ఎస్. వనజ, ఏలూరు.

ఆరిపోయిన చిరునవ్వు



నలభై ఏళ్ళకుపైగా నాట్యం చేసిన లేఖిని ఆగిపోయింది.

పాండీబజారు చెట్లనీడల్లో, పానగల్ పార్కులో మిత్రుల మధ్య ఛలోక్తులు విసురుతూ, సూక్తులు రువ్వుతూ, నవ్వుతూ, నవ్వించే వ్యక్తి వదనంపై నిర్మలంగా వెలిగే నిత్య మందహాసం ఆరిపోయింది.

మల్లాది రామకృష్ణశాస్త్రిగారి మరణం ఆయన అభిమానులకు, మిత్రులకు మర్మాఘాతంలా తగిలింది. ఆ దెబ్బనుంచి కోలుకోవడం కష్టం.

ఆయన మరణించినా, ఆయన అసంఖ్యాకంగా రచించిన కథలు ఆంధ్రభాషలో చిరస్థాయిగా నిలిచి పోతాయనే సంతృప్తి మటుకు మిగిలింది. ఆయన యౌవనదశ అంతా బందరులోనే గడచి పోయింది. ఆ రోజుల్లో వారి కలంనుంచి పుంఖాను పుంఖాలుగా కథలు వెలువడ్డాయి. ఆనాటి ఆంధ్ర వారపత్రికలు తిరగేస్తే ఆయన కథ కనబడని వారం వుండేది కాదేమో. ఎలాంటి కథలు? తెలుగు భాషలోని తీయదనాన్ని పుణికి పుచ్చుకుని చదువరిని పులకింపజేసే కథలు! తెలుగు జీవితపు మాధుర్యం తొణికిసలాడే కథలు! హాయి గొలిపి, ఆహా అనిపించే కథలు!

మద్రాసులో స్థిరపడిన తరువాత ఆయన సినిమా రచయితగానే కొత్తతరం వారికి పరిచితులయ్యారు. సంభాషణలు వ్రాసినా, పాటలు వ్రాసినా ఆయన ప్రత్యేకత, విలక్షణశైలి, ముద్ర ఎక్కడికి పోతాయి?

'మీరీ మధ్య వ్రాస్తున్న కథలకంటె మీ బందరు కథలే నాకు బావుంటాయండీ' అంటే ఆయన ఒక చిరునవ్వు, మరొక సిగరెట్టు వెలిగించి 'తెలుగు భాషను ఎంత సొగసుగా వ్రాయవచ్చునో చూపడానికే ఇవి వ్రాస్తున్నాను బాబూ' అనేవారు.

ఆయన కథలు గొప్పవా, వ్యక్తి గొప్పదా అనేది ఆయనతో ఏ మాత్రం పరిచయం వున్నవారికైనా తేలని ప్రశ్న. తెలుగు, సంస్కృతం, ఇంగ్లీషులలో ఆయన పాండిత్యం అపారమైనది. ఆయన ఎంత ఎక్కువగా చదివేవారో అంత తక్కువగా మాట్లాడేవారు. ఆ మాటల్లో కూడా తనపాండిత్య ప్రకర్ష మచ్చుకైనా రానిచ్చేవారు కాదు. ఎంతసేపూ ఛలోక్తులతోనే సరిపోయేది. ఆ ఛలోక్తు లిక వినబడవు!



రాజకీయ వాతావరణం

ధర్మా ధర్మాలమధ్య యుద్ధం

నిజమే. మనకు శాంతి కావాలి.

శాంతి కాముక దేశంగా మనం ఖ్యాతి తెచ్చుకున్నాము.

కాని, మనకు కావలసినది అధర్మానికి లొంగిపోగా సిద్ధించే శాంతికాదు. సౌభాగ్యంతో, సౌభ్రాత్రంతో, చైతన్యంతో ముఖ్యంగా ధర్మంతో, న్యాయంతో పరిపూర్ణత చెంది గంభీరంగా సాక్షాత్కరించే శాంతి కావాలి.

ప్రేమ, సహనం, సహకారం; కోట్లాది మానవులు చేతులు కలిపి విశ్వకళ్యాణానికి బాటలువేసేందుకు మహోజ్వల కృషిని సాగిస్తుంటే అందుకు దోహదం చేసే విశ్వశాంతి మనకు కావాలి.

ప్రజాస్వామ్యాన్ని వెలిగించాము.

మానవతపై కొత్త వెలుగులు ప్రసరిస్తున్నాము.

పశుత్వాన్ని మచ్చిక చేసుకుంటున్నాము.

ఈనాడు భారత దేశం యెదుర్కుంటున్న పరిస్థితి కేవలం భారతీయులకు మాత్రమే పరిమితమైంది కాదు.

మానవత్వాన్ని, సహనాన్ని, శాంతిని పశుత్వం పరిహసిస్తోంది.

దుమ్ముచల్లి కయ్యానికి దిగలాగింది.

మచ్చిక చేస్తే లొంగని పశువును దండ ప్రయోగంతోనే కట్టడి చెయ్యాలి.

వెలిగించిన ప్రజాస్వామ్యపు ఆశాజ్యోతి ఆరిపోగూడదు.

పశుత్వం ఆవహించి వెఱ్ఱులెత్తిన పాకిస్తాన్ నియంతకు భారతసైన్యం బుద్ధి చెబుతోంది.

ప్రజాస్వామ్య పరిరక్షణ భారతీయుల కర్తవ్యం.

ప్రతి భారతీయ సైనికుడు భండన భీముడై అసుర సేనలను చెండాడుతున్నాడు.

ఒక్క రోజులో మన సైనికులు డెభ్భైఅయిదుపాక్ టాంకులనునాశనం చేశారు. మరోరోజున నలభై టాంకులను చెక్కుచెదరకుండా బంధించారు;

యాభై టాంకులను రూపుమాపారు. ఇవన్నీ అభేద్యమని పేరు చెందిన అమెరికన్ 'పాటన్' టాంకులు.

అప్రతిహతం అనుకుని పాకిస్తాన్ తెచ్చుకున్న అమెరికా ఆయుధాలు, అస్త్రాలు భారతీయ సైనికుని యుద్ధ కౌశలంముందు ఆగలేక పోతున్నాయి.

మర తుపాకులు, ఫిరంగులు, టాంకులు, జెట్ విమానాలు, ఒకటేమిటి సర్వం ఆహుతై పోతున్నాయి.

ప్రతి రంగంలోనూ మన విజయ దుందుభి గర్జిస్తోంది. విజయ పరంపర వెంటాడి జబ్బ చరుస్తోంది.

విజయాలను వివరిస్తే దినపత్రికలు చదివిన మీకు చర్విత చర్వణం అనిపిస్తుంది.

ఇది వ్రాస్తున్న సమయానికి మన సైనికులు 'సియాల్‌కోట - జమ్ము' రంగంలో 'లక్ష్యాన్ని' సాధించారు. పోరాటం సాగుతున్న ఆరు రంగాలలోను వైరి బలాలను చెండాడుతున్నారు.

భారత వైమానిక దళం చూపిస్తున్న సాహస పటిమ అపారం, పాశ్చాత్య యుద్ధనిపుణులను ఆశ్చర్యపరుస్తోంది.

ఇది వ్రాస్తున్న సమయానికి 284 పాక్ టాంకులు ధ్వంసం కావడమో, మన వశం కావడమో జరిగింది; అనేక విమానాలు నేలకూలాయి.

ఈనాడు మనం యెదుర్కొంటున్న పరిస్థితి కేవలం మనకు మాత్రమే పరిమితమైంది కాదు. యావత్ప్రపంచానికి సంబంధించినది. ప్రజాస్వామ్య పరిరక్షణకోసం, శాంతిని రక్షించుకోటానికికోసం పాకిస్తాన్ నియంతలతో మనం సాగిస్తున్న పోరాటంలో కలిగే విజయం ప్రపంచప్రజాస్వామ్యానికేవిజయం.


● ● ●

ఇది ఇట్లా ఉండగా ఈనాడు మనం యుద్ధరంగంలోనే కాదు, ఇతరత్రా కూడా అనేక పాశ్చాత్య దేశాలు రాజకీయంగా తెచ్చే ఒత్తిడులను ప్రతిఘటిస్తూ కార్య సాధనకోసం జాగ్రత్తగా ముందుకు నడవాల్సి వస్తోంది.

కాశ్మీర్‌పై పాకిస్తాన్ దురాక్రమణచేసి పద్దెనిమి దేళ్ళయింది. కాని, పాకిస్తాన్ చేసినది దురాక్రమణ అని పాశ్చాత్య దేశాలు ఈ నాటికీ ఒప్పుకోవు.

పద్దెనిమిదేళ్ళ తరువాత కాశ్మీర్‌లోకి సాయుధ దుండగీండ్రను అక్రమంగా పంపి పాకిస్తాన్ దురాక్రమణకు మళ్ళీ తలపడితే, ఈ విషయం ఐక్యరాజ్య సమితి పరిశీలక బృందం అధిపతి జనరల్ నిమ్మో స్పష్టంగా వెల్లడి చేసినా, పాకిస్తాన్ చేసింది దురాక్రమణ అని బ్రిటన్, అమెరికాలుససేమిరా ఒప్పుకోడం లేదు. పైగా పాకిస్తాన్‌ను భారతదేశాన్ని సరిసమాన ప్రతిపత్తితో తూకంవేస్తూ యుద్ధాన్ని విరమించమంటున్నాయి.

జేబు దొంగను పట్టుకుని పోలీసుకు ఫిర్యాదు చేస్తే, సొమ్ము పోయిన పెద్దమనిషిని దొంగను కలిపి అరెస్టు చేశాట్ట పోలీసు. అందుకే దొంగకు మరీ అలుసైంది.



యుద్ధరంగంలోని అగ్రశ్రేణిస్థావరం : సైనికులు ఎటువైపు కాల్పులు జరపాలో ఇక్కడినుంచే ఉత్తర్వులు పంపబడుతాయి.

అందుకే పద్దెనిమిదేండ్ల తరువాత పాకిస్తాన్ మళ్ళీ దురాక్రమణ ప్రారంభించింది.

ప్రధాని శ్రీ శాస్త్రి అన్నట్లు పాకిస్తాన్ మాటిమాటికి కాశ్మీర్‌లో యుద్ధవిరమణ శ్రేణిని అతిక్రమించటం, దురాక్రమణకు దిగటం జరుగుతుంటే, మాటిమాటికీ దానికోసం మనం కాచుకోవటం ఇకపైన సాధ్యపడదు. దురాక్రమణను ప్రతిఘటించి శత్రువుకు బుద్ధి చెప్పే శక్తి సామర్థ్యాలు మనకి వున్నాయని ఒక్కమాటు చాటి చెపితేనేకాని పాకిస్తాన్‌కు గుణపాఠం కాదు, అప్పుడుగాని పాకిస్తాన్ మాటిమాటికి కయ్యానికి కాలుదువ్వటం మానదు.



భవిష్యత్తులో కాశ్మీర్‌పై పాకిస్తాన్ దురాక్రమణ చేయదనే నమ్మకం మనకుకలగాలి. పాశ్చాత్య దేశాలు మాటల ద్వారా ఇచ్చే హామీలమీద నమ్మకం పోయింది.

అమెరికా నుంచి పాకిస్తాన్ పొందిన సైనిక సహాయం చైనాను, కమ్యూనిజాన్ని యెదిరించడానికికాదని, కాశ్మీర్ విషయంలో భారతదేశం మీద ప్రయోగించటానికని మనకు తెలుసు. ఈ విషయాన్ని అమెరికా దృష్టికి పదేపదే మన ప్రభుత్వం తెచ్చినా పాకిస్తాన్ ఆగడాన్ని అరికట్టేందుకు ఆ దేశం యెటువంటి గట్టి చర్య తీసుకోలేదు.

భారతదేశం యెంత వద్దంటున్నా అమెరికా బ్రిటన్‌లు కలిసి "సియాటో" "సెంటో" సైనిక కూటములను యేర్పాటు చేసి వాటిలో పాకిస్తాన్‌కు సభ్యత్వం ఇచ్చి ఆ దేశానికి అపారమైన ఆయుధ సామగ్రిని సరఫరా చేశాయి.

ఫలితం ఆసియా ఖండంలో వాతావరణం కలుషితం అయింది. పాకిస్తాన్ కమ్యూనిజాన్ని యెదిరించడానికి బదులు ఆయుధాలతో కాశ్మీర్‌మీద దండెత్తింది. చైనాతో పొత్తు కలిపి భారత దేశాన్ని తప్పించింది.

"సియాటో" "సెంటో"ల యేర్పాటు నిష్ఫలమైంది. అంతే కాకుండా చైనా మద్దతుతో పాకిస్తాన్ ప్రారంభించిన అగడాలకు బాగా ఆసరా కూడా అయినాయి అమెరికా ఆయుధాలు.

సైనిక కూటముల ప్రయోజనాన్ని గురించి అమెరికా, బ్రిటన్‌లు పునః పరిశీలన చెయ్యాల్సిన తరుణం ఆసన్నమైంది.

పాకిస్తాన్ ఈనాడు దురాక్రమణకు దిగటానికిగాని, కాశ్మీర్ విషయంలో భారత్ పాకిస్తాన్‌లమధ్య ఇంత భారీగా యుద్ధం సాగటానికిగాని ప్రధాన కారణం పాకిస్తాన్‌కు పాశ్చాత్య దేశాలు చేసిన ఆయుధ సహాయమేఅనేది అమెరికా, బ్రిటన్‌లకు ఈనాడు సుస్పష్టమవుతున్నది.

ఏదిఏమైనా ఈనాడుపాకిస్తాన్‌కు అమెరికా, బ్రిటన్‌ల ఆయుధ సహాయం ఆగిపోయింది. భారతదేశానికి వ్యతిరేకంగా జరిగే యుద్ధంలో పాకిస్తాన్‌కు మద్దతు రావడానికి అమెరికా, బ్రిటన్‌లు నిరాకరించాయి.

ఈ తరుణంలో పాకిస్తాన్‌కు సహాయంగా చైనా భారతదేశంమీద

దాడిచేస్తే తాను సహించబోనని అమెరికా హెచ్చరించింది.

పాకిస్తాన్, భారతదేశాల మధ్య జరుగుతున్న యుద్ధంలో పరాయి దేశాలేవీ జోక్యం కలిగించుకో కూడదని రష్యాకూడా హెచ్చరించింది.

ఇది ఒకవిధంగా భారతదేశానికి సుముఖ పరిణామమే,

మన ప్రధాని శాస్త్రి, రక్షణ మంత్రి చవాన్ అన్నట్లు మనకు పాకిస్తాన్ ప్రజలతో విరోధంలేదు. వారి భూభాగాన్ని ఆక్రమించటం మన లక్ష్యం కాదు.

కాని పాకిస్తాన్ నియంతలు సాగిస్తున్న దురాక్రమణ కాండను మనం ప్రతిఘటిస్తున్నాం. ఏ ఆయుధబలం అయితే ఆ నియంతలను భారత దేశంమీద దురాక్రమణకు పురిగొల్పిందో, దానిని ధ్వంసం చెయ్యటమే మన లక్ష్యం.

కాశ్మీర్‌లో పద్దెనిమిదేండ్లనాడు దురాక్రమణ జరిగితే ఈనాటి వరకు దానిని గురించి ఐక్యరాజ్య సమితి గాని, పాశ్చాత్య దేశాలుగాని యెటువంటి చర్యా తీసుకోలేదు.

ఈ విపరీత వైఖరివల్లనే మొన్న ఉథాంట్ శాంతి దౌత్యం కూడా విఫలమైపోయింది.

సర్దార్ స్వర్ణసింగ్ చెప్పినట్లు భారత భూభాగమైన జమ్మూ కాశ్మీర్‌నుంచి పాకిస్తాన్ వైదొలగాలి.

ఎటువంటి దురాక్రమణనైనా ప్రతిఘటించి నిలబడగల శక్తి సామర్థ్యాలు భారత సైన్యానికి, నాయకులకు వున్నాయని నిరూపించాలి.

అప్పుడే మనకు శాంతి. అప్పుడే మనకు పురోగతి.

ఈ పరిస్థితుల్లో దేశపాలన బాధ్యత అతినేర్పుగా నడిపిస్తూ 'కత్తికి కత్తి' అనే జవాబు చెప్పి దేశ ప్రతిష్ఠను ఇనుమడింప జేసిన శ్రీ లాల్‌బహదూర్ నాయకత్వాన్ని బలపరచడం మనవిధి.

వీరోచితంగా పోరాడి జాతి రక్షణకు దీక్షపట్టిన ప్రతి భారతీయ సైనికునికి జోహార్!

—అనంతం.

□□□



మహర్షికాని మనీషి (2)

వెనకటికి ఎందరో భక్తులు, ఎందరో జ్ఞానులు ఎన్నో విధాలుగా భగవంతుడిని సాక్షాత్కారం చేసుకున్నారట. చైతన్యుడు భగవంతునికి తన్ను తాను ప్రేయసిగా అర్పించుకున్నాడు; ఆయనది మధుర భావం. రామకృష్ణ పరమహంస ఈశ్వరుడిని జననిగా ఆరాధించాడు; ఆయనది మాతృభక్తి. చండీదాసుకు తన ప్రేయసి రామినిలో భగవంతుడు కనిపించాడు; ఆయనది సహజ మార్గం. శంకరుడు తనకు, పరమాత్మకు అభేదం చెప్పుకున్నాడు; ఆయనది అద్వైతం. ఇలా ఒక్కొక్కరి దొక్కొక్క మార్గం.

కలడు కలండనెడు వాడు కలడో కలయో తెలియదుగాని, గుడిపాటి వెంకటచలంగారు మాత్రం ఈశ్వరుడిని సెక్సులో అన్వేషించినట్టు చెప్పుకోవచ్చు.

ఎందుకంటే, చలంగారికి చిన్నప్పటినుంచి భగవంతుని గురించిన జిజ్ఞాస వున్నట్టు కనబడుతుంది. ఆయన రచనలలో తరుచుగా భగవంతుని ప్రస్తావన వస్తుంది. అయినా, భగవంతుడిని తన తర్కంద్వారా తిరస్కరించి, మానవ జీవితంలో అన్నిటికంటె ఉన్నతమైన స్థానంలో సెక్సుకు ఆయన పట్టాభిషేకం చేశారు. సామాన్యులను బాధించే అనేక సమస్యలు, ఈతి బాధలు, రాగద్వేషాలను గురించి ఆయన ఎన్నడూ లోతుగా ఆలోచించినట్టు లేదు. ఊహాలోకంలో తమకు తామొక మైదానాన్ని సృష్టించు

కుని, దానిలో అభిమానాలను, అరుణలను కల్పించుకుని ఆయన కాలక్షేపం చేశారు.

చలంగారిది కేవలం అశ్లీల సాహిత్యమని త్రోసి పుచ్చినవారు లేకపోలేదు. వారి నిరసనతోనే నేకీభవించను. దేశ స్వాతంత్ర్యంకోసం ప్రాణాలర్పించినవారున్నారు; వ్యక్తి స్వాతంత్ర్యం కోసం, మత స్వాతంత్ర్యం కోసం పోరాడినవారున్నారు. చలంగారు సెక్సు స్వేచ్ఛ కోసం పోరాడారు. ఆయన— కనీసం ఆయనశిష్యులు – దానికి స్త్రీ స్వాతంత్ర్యోద్యమమని పేరుపెట్టినా, నిజానికి అది సెక్సు స్వాతంత్ర్యోద్యమమే. దానికోసం ఆయన ఎన్నో త్యాగాలు చేశారు; సంఘంతో నిరంతర యుద్ధం సాగించారు: కట్టుబాట్లను కాలదన్నారు; విశృంఖలత్వాన్ని ఉపదేశిస్తూ ఎన్నో కథలు, నవలలు, నాటకాలు, వ్యాసాలు, లేఖలు వ్రాశారు.

అయితే, దురదృష్టవశాత్తు చలంగారు నాడదలచిన ఔషధం రోగాన్నే కాక రోగినికూడా అంతం చేయగలిగినంత ఘాటైనది. అందుచేతనే ఆయన చికిత్సను మెచ్చుకున్నా, చికిత్సను మాత్రం ఆంధ్రదేశం అంగీకరించలేకపోయింది. ఆంధ్రదేశమే కాదు — ఆధునిక కాలంలో ఏ మానవ సంఘమూ దాన్ని ఆమోదించలేదు. అందుకే ఆయన ఆంధ్రదేశంపై ఆగ్రహించి అరుణాచలంలో ఆశ్రమం ఏర్పరుచుకున్నారు. ఆయన ఉద్బోధించిన సెక్సు స్వేచ్ఛ ఆయన ఆదర్శలోకంలోనే ఆశ్రయం ఏర్పరుచుకుంది.

చలంగారు ఒకందుకు అదృష్టవంతులు. ఆయనపట్ల గాఢవిశ్వాసం తప్ప మరేమీ లేని శిష్యులాయనకు కొల్లలు. వారు చలంగారిలాగ "హాస్తో — చేస్తో — వొంటరిగా" లాంటి ప్రయోగాల దగ్గర్నించి అన్నిటిలో ఆయన అడుగుజాడలను పరిస్తారు. ఆయన సెక్సును మించినదేదీ లేదన్నప్పుడు వారు భళీ అన్నారు; ఈశ్వరుడున్నాడలే వుందని ఆయన కనుమానం కలిగితే తలకాయ లూపారు; సౌరీసే ఈశ్వరుడంటే "మరే" అన్నారు; అష్టగ్రహకూటంతో ప్రళయం రాబోతోందంటే భయపడి పోయారు; కలదో లేదో అని ఆయన గందరగోళంలో పడితే వారూ పడ్డారు; అందర్నీ వదిలి అరుణాచలం వెళ్ళిపోతే అరుణ కోసం కాకపోయినా చలం కోసం తామూ వెళ్ళారు; కేవలం ప్రచురణ కోసమేనన్నట్లు అసంఖ్యాకంగా ఆయనకు లేఖలు వ్రాశారు: వ్రాయించుకున్నారు. స్వతంత్రాలోచనకు అంత విలువనిచ్చే చలంగారు తమ శిష్యుల భక్తిని హర్షించే "వ్యానిటీ"కి లోనుకావడం విచిత్రమే. భక్తులాయన్ని మహర్షిగా భావించినా, మహర్షిత్వానికి ఆయన్ని కొన్ని మెట్లు దిగువన నిలిపింది ఆయనలో మొదటినుంచి వ్యక్తమైన ఈ వ్యానిటీయే, చివరి కాయన మిగిల్చింది కొందరి మనస్సులలో గందరగోళమే.

—స వ్యా సా చి ౨౧౪





విజేత

యద్దనపూడి సులోచనారాణి

1947 వ సంవత్సరం.

దేశానికి స్వాతంత్ర్యం లభించిన సరికొత్త రోజులవి. హిందువులు యెంత శాంతియుతంగా పోరాడా లనుకున్నా బ్రిటిష్‌వాళ్ళ దౌర్జన్యంతో దేశంలో బోలెడంత హింసాకాండ జరిగింది. రక్తపు టేరులు ప్రవహించాయి. ఎందరో మనుష్యులు వికలాంగు లయారు.

ప్రాణాలు పోగొట్టుకున్నారు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ప్రతివాళ్ళని స్త్రీ పురుష భేదంగాని, వయో వివక్షతగాని చూపకుండా గొడ్డుల్ని బాదినట్టు చావబాదారు. కొంచెం అనుమానం తగ్గిలితే చాలు, వేటకుక్కల్లా వెంటబడి తరిమి తరిమి కాల్చి చంపారు. అయినా సరే. హిందువులు ఉద్రేకం అపుకుని నిగ్రహంతో మహాత్ముని అడుగు జాడల్లో సహనంతో, శాంతియుతంగానే పోరాడారు. చిట్ట చివరికీ మహాయజ్ఞంలో యెలాగైతేనేం కొన్ని వేల ప్రాణాలు బలిపెట్టి, కొన్ని లక్షలమంది వూహించలేనంత భయంకరమైన చిత్రహింసలకి గురియై అనుకున్నది సాధించారు. దేశానికి స్వాతంత్ర్యం లభించింది. కొన్ని వందల సంవత్సరాల తర్వాత భారతమాత దాస్య శృంఖలాలని ఛేదించుకుని స్వాతంత్ర్య వాయువులు పీల్చగలిగింది,

సంవత్సరాల తరబడి జైళ్ళలో మ్రగ్గుతూ, జీవితాల మీద ఆశ వదులుకున్న రాజకీయ ఖైదీలకి వెంటనే విడుదల లభించింది. ఎంతో ఆశగా, ఆత్మీయులని సజీవంగా మళ్ళా కళ్ళారా చూడబోతున్నాం అనే ఆనందంతో ఆత్రంగా యిళ్ళకి ప్రయాణం అయారు.

ఇలా విడుదల లభించిన వాళ్ళలో ఒకతను ఇంటికి వెడుతున్నాడు. అతని వయసు షుమారుగా 24 – 25 సంవత్సరాల మధ్య వుంది. మనిషిని పరిశీలిస్తే మాసి, బిరుసుతేలిన అతని గడ్డంలాగానే మనసు కూడా మహా కరుకేమో అన్న అనుమానం కలుగుతుంది. తీక్షణంగా వున్న ఆ కళ్ళు ఒకసారి దేనివేపయినా చూస్తే చాలు. ఆ క్షణంలో దాని పుట్టుపూర్వోత్తరాలు ఆకళింపు చేసుకోగలంత చురుగ్గా వున్నాయి. సమున్నతంగా వుండి చివర కొస తేలిన నాసికలో యేదయినా అనుకుంటే చివరికి ప్రాణాలకి తెగించి అయినా సరే అది సాధించి విజయం పొందగల పట్టుదల కన్పిస్తోంది. చప్పున తలెత్తి అందరివైపులా అతని ముఖంలోకి సూటిగా చూడలేం. కొద్దిగా మోటుగా వున్న ఆ పెదవులు చిరునవ్వు చిందిస్తున్నట్టు తోస్తుంది. కానీ పరీక్షగా చూస్తే అక్కడ చిరునవ్వుకి బదులు ఓ విధమైన గాంభీర్యం కానవస్తుంది. ఎలాంటి పరిస్థితుల్లోకూడా నా ఆత్మగౌరవం కాపాడుకోగలను అనే ధీమా అలా కొంచెంగా గడ్డం పైకెత్తుకుని చూడటంలో స్పష్టమౌతుంది. హిందు

వుల్లో సాధారణంగా అంతటి పొడగాటి మనుష్యులు అరుదుగా కన్పిస్తారు, ఒకప్పుడు అతని శరీరచ్ఛాయ పచ్చటి రంగే కావచ్చు. కాని కొన్ని సంవత్సరాలు యెండనకా, వాననకా తిరగడంవల్ల చామనచాయగా మారింది. అన్ని సంవత్సరాలు జైల్లో మగ్గినా, యెన్నియాతనలకి గురియైనా ఆ శరీరంలో దార్ఢ్యం యేం తగ్గలేదు. అతనిది అంతమంచి ఆరోగ్యంలా వుంది.

కొద్దిగా మాసిన బట్టల్లో జీప్‌లో వెనక్కు జారగిలబడి కూర్చున్నాడతను. తైల సంస్కారంలేని జుట్టు చెదిరి విశాలమైన నుదుటి మీద చిందర వందరగా పడుతోంది. అది కూడా ఓ అందంగానే వుంది.

బాట చాలా గతుకులుగా బొత్తిగా అధ్వాన్నంగా వుంది. రెండు మూడు రోజుల క్రితం బాగా వర్షం పడ్డట్టుంది. అక్కడక్కడా బురద గుంటలు వున్నాయి. రోడ్డుకిరుప్రక్కలా యెత్తుగా పెరిగిన చెట్లకి అడవి తీగెలేవో పెనవేసుకుని విరగబూసి వున్నాయి. వాటి నుంచి చిక్కగా వస్తున్న సువాసనలు మత్తెక్కించేలా వున్నాయి.

"ఎంత మంచి గాలి!" ముక్కుపుటాలు పెద్దవిచేసి గుండెలనిండా ఆ అడవి పూల వాసనలు పీల్చుకుంటూ అనుకున్నాడతను. కొన్ని సంవత్సరాలు చీకటిగదుల్లో మ్రగ్గిన అతనికి యీ వెలుగు, యీ ఆరుబయలు, యీ స్వచ్ఛమైన గాలి అమృతంలా వుంది.

"ఈ రాత్రికి యెక్కడైనా ఆగాల్సి వస్తుందేమో! దోవ బొత్తిగా బాగుండలేదు." అన్నాడు డ్రైవర్.

"ఊహు. వీల్లేదు, ఎంత రాత్రి అయినా సరే వెళ్ళిపోవాలి. పిడుగులు పడుతున్నా ఆగటానికి వీల్లేదు." దృఢంగా అన్నాడతను.

"దోవ నాకు సరిగ్గా తెలియదు. యెక్కడైనా తప్పితే-" సణిగాడు డ్రైవర్. "నేనున్నాగా!" నిర్లక్ష్యంగా అన్నాడతను మళ్ళీ ఆలోచనల్లోకి జారిపోతూ.

తదియనాటి వెన్నెల. మెల్లగా చెట్ల సందుల్లోంచి తొంగి చూడాలని ప్రయత్నం చేస్తోంది. చీకటి, వెలుగు కాని మిశ్రమ వాతావరణం. ఘాటుగా వున్న అడవిపూల సువాసనలు. అంతా కంటికి మనోహరంగా, మనసుకి ఆహ్లాదంగా వుత్తేజకరంగా వుంది. పరుగెత్తుతున్న జీప్ ఆగిపోతే కళ్ళముందు కన్పిస్తున్న

సీరియల్

యీ సుందర దృశ్యం కూడా యెక్కడ చెదిరిపోతుందో అన్పిస్తోంది. అతని ఆలోచన్లు అటు తిరిగి యిటు తిరిగి మళ్ళీ యింటిమీదకి మళ్ళినాయి.

నాలుగు సంవత్సరాల క్రితం యిల్లు వదిలేసి వచ్చేసాడు. అమ్మ యెట్లా వుందో! స్వాతంత్ర్యోద్యమంలో చేరటానికి చెప్తే వద్దంటుందని, "నా కున్నది నువ్వొక్క నలువి. ఆ వుద్యమంలో చేరటానికి యింకా చాలామంది వున్నారులే" అంటూ ఆటంక పరుస్తుందని, వెడతానంటే యేడ్చి అడ్డు పడుతుందని చెప్పకుండా వచ్చేశాడు. మర్నాడు లేడని తెలిసి యెంత క్రుంగిపోయిందో! అన్నం నీళ్ళు మాని యెన్ని రోజులు యేడుస్తూ పడుకుందో! కాని యేం చేస్తాడు తను. దేశం అత్యవసర పరిస్థితుల్లోవుంటే పౌరుడిగా తన కర్తవ్యాన్ని యే విధంగా విస్మరిస్తాడు! విస్మరిస్తే తృప్తిగా బ్రతగ్గలడా! దేశమాత కన్నీళ్ళతో రమ్మని పిలుస్తుంటే వెళ్ళకుండా యెలా! అందుకే కన్నతల్లిని బాధ పెడుతున్నానని తెలిసి కూడా నిగ్రహించుకుని వెళ్ళాడు. సుధ వుంది కాబట్టి కొంత ఫర్వాలేదు. అసలు ఆ ధైర్యంతోనే తను వెళ్ళాడు. సుధని గురించిన ఆలోచనలు మెదలగానే అతని మనసంతా తీయని బాధతో నిండిపోయింది.

తను యిల్లు వదిలి వచ్చేముందు, ఆ రాత్రి తనకి సుధకి జరిగిన సంభాషణ యిన్ని సంవత్సరాలలో ఒక్క క్షణమైనా మర్చిపోయాడా! అసలు జన్మలో మర్చిపోగలడా! ఆ రోజు పుచ్చ పువ్వులాటి వెన్నెట్లో పున్నాగ చెట్టుక్రింద వీడ్కోలు తీసుకుంటూ ఆఖరిసారిగా మాట్లాడిన దృశ్యం కళ్ళముందు కదిలింది.

"వ్యక్తిగత అభిప్రాయాలకి, స్వసుఖాలకి స్వస్తి చెప్పాల్సిన అమూల్యమైన కాలం సుధా! ఉప్పెన వచ్చి ప్రవాహంలా పొంగి పొర్లుతున్న యీ నవ చైతన్యంలో నాలాంటివాళ్లు వురికి ఆ ప్రవాహ వేగానికి మరింత బలం తీసుకురావాలి. అలా వురక కలిగిన ధైర్య సాహసాలు నీలాంటివాళ్లుయివ్వాలి. ఈసారి యీ గాలిదుమారం నుంచి ఆంగ్లేయులు తప్పుకోలేరు. దేశంలో వాళ్ళ అధికారానికి స్వస్తిపలికి మూటా ముల్లె సర్దుకుని వెళ్ళిపోక తప్పదు" ఆవేశంగా అన్నాడతను.

"కాదన్నానా బావా! కాదనలేదుగా నేను ?–" యేడుపు దిగమింగుతూ అంది సుధ.

ఇద్దరు ఆగిపోయి ఒకళ్ళని ఒకళ్లు ఆత్రంగా, అనురాగంగా చూసుకున్నారు.

(సశేషం)



"లక్ష్మీదాసు శుక్రవారం నాడు సెలవు పెట్టాడు" అనే ఘోరమైన వార్త ఆ తాలూకాఫీసులో ఎక్కడివాళ్ళనక్కడే స్తంభింపజేసింది. కొందరు మూర్ఛపోబోయారు. కొందరు గుడ్లెళ్ళబెట్టారు; కొందరికి నోళ్లు పడిపోయాయి. మరికొందరు సోడాలుచ్చేసుకున్నారు. ఎక్కడి పనులక్కడే ఆగిపోక తప్పలేదు.

పరిస్థితులింతగా విషమిస్తాయంటే విషమించవూ మరి?! దాసు తన ఆరేళ్ళ సర్వీసులోనూ మొట్టమొదటిసారిగా క్యాజువల్ లీవు పెట్టాడంటే – ఎటువంటి అసాధారణపరిస్థితులొచ్చాయో ఊహించ శక్యమా?

దాసు ఆ తాలూకాఫీసులో

"హరి ఓం" అంటూ ఆరేళ్ళనాడు లోయర్ డివిజన్ గుమాస్తాగా ఓ మాంఛి పాడికుండలాటి సీట్లో కాలెట్టి; ఆ వెంటనే కూర్చునీ అక్కడే స్థిరంగా పరిపాలిస్తున్నాడు. ఆ సీట్లో అతడుతప్ప మరోడు నెగ్గలేడని తాసిల్దారుగారికి నిశ్చితాభిప్రాయం. అందుకే ఎప్పుడన్నా దాసుకు ట్రాన్స్ఫర్ ఆరర్డొస్తే తానే స్వయంగా వెళ్ళి కలెక్టరు కాళ్ళుచ్చుకునీ, డిప్టీ కలెక్టరు కాళ్లుచ్చుకునీ బతిమాలి, శిలల్ని సైతం కరిగించే శాడ్‌శాంగ్స్ పాడి, తానూ ఏడ్చేసి, మొత్తంమీద ఆ ట్రాన్స్ఫర్ ఆపేసేవాడు. దాసుకూడా ఆ సీట్లోని మంచి లక్షణాలూ, తాసిల్దారుగారి నిశ్చితాభిప్రాయమూ గమనించినవాడై డిపార్టుమెంటల్ పరీక్షలు కూడా ప్యాస్ కావాలని కలలో కూడా తాపత్రయపడలేదు. తీరా పడి ప్యాసయితే ట్రాన్స్ఫరూ, రెవిన్యూ ఇన్స్పెక్టర్ ట్రెయినింగూ, పొలాలూ, గట్లూ, పుట్టలేగా గతి? ఇక్కడున్న మజా అక్కడెలా వస్తుంది? సెలవు పెట్టకుండా వున్నకొద్దీ మజా ఎక్కువ!

ఇంతకీ ఆ సీట్లోని "మాంఛి" లక్షణాలేమిటీ?

నిత్యమూ బోలెడు కాగితాలొస్తాయి. వాటిలో "అర్జెంటూ" "వెరీ అర్జెంటూ" బహు తక్కువ. మామూలు కాగితాల తాలూకు మనుషులు మాత్రం "వెరీ అర్జెంట్"గా వచ్చేస్తా రతనిదగ్గరకు రోజూ. ఆ వచ్చినవాళ్ళను సాదరంగా కాలినోస్ చిరునవ్వుతో – ఆహ్వానించి, ముక్కాలిపీటపైనుఖాసీనులనుచేసి, ఊరూ, పేరూ, వారి కష్టసుఖాలూ విచారించి, తన డ్రాయరు సొరుగు తెరిచి ఓ పక్క పొడిపొట్లం, ఓ నస్యం డబ్బా, ఓ చార్మినార్ సిగరెట్టూ, ఓ బీడీ, మరో చుట్టా టేబిల్‌మీద పడేసి "ఇందులో మీ కిష్టమైన వాటిని స్వీకరించి నన్నానందింపజేయ గోరుతున్నాను. మంగళం మహత్. శ్రీ శ్రీ శ్రీ" అంటూడు. మరీ ఎక్కడోగాని ప్రతి ఆసామీ వాటిలో ఒకటో రెండో స్వీకరించి దాసుని తన్మయుణ్ణిచేసి "అబ్బా! మీకు చాలా ఋణపడి వున్నానుసుమండీ!" అంటాడు.

"ఛ ఛ! ఇందులో ఋణమే ముందరండీ! పాపం మీ రేదో అవసరముండి వచ్చారు. వచ్చిన వారిని ఏదో నాకు చేతనైనంతలో మర్యాదచేసి మీ అవసరం తీర్చి మరి నా అవసరం మాత్రం గడుపుకోవద్దూ?" అంటాడు దాసు. "అవసరం" అనే మాటమీద ఓ క్వింటాల్ బరువేసి. ఇంత తతంగమూ నవ్వుతూ జరిపేసి, గభాల్న ఆ వ్యక్తి తాలూకు కాగితం బయటకు తీసి, "ఇక మీరు నిర్భయంగా, నిశ్చింతగా ఇంటి కెళ్ళండి. మీ పని వెంటనే జరిగి తీరుతుంది" అని అభయహస్త మిస్తూండగానే ఆ ఆసామీ తన శక్త్యానుసారం – ఏదో – అతని జేబులోనో, చేతిలోనో పెట్టేసి "ఇదిప్పటికి వుంచండి. మళ్ళీ దర్శనం చేస్తాను" అంటూ ధైర్యంగా, ఆనందంగా నిష్క్రమిస్తాడు. నిజంగానే ఆ పని వెంటనే జరుగుతుంది.

మిగతా గుమాస్తాల కడుపులు మండే దిక్కడే! మరి మండవూ? తామంతా చిరుగ్గుడ్డలూ, నూలు గుడ్డలూ ధరించి, ఆరోగ్యాలు పాడుచేసుకుని అహర్నిశలూ పని చేసినా ఆ జీతంరాళ్లు తప్ప మరో దిక్కు లేదాయె! దాసుని జూడబోతే – గ్లాస్గో పంచెలూ, టెర్లిన్ చొక్కాలూ, బూట్లూ, నున్నగా నైస్‌గా మెషిన్‌తో చేసిన తలమీద తెల్లని ఉన్నిటోపీతో, నిండిన కడుపుతో ఆనందంగా ప్రత్యక్షమవుతాడు రోజూ. కేవలం జీతంరాళ్ళే అయితే అతనిలా బ్రతగ్గలడా దర్జాగా.

ఇతర గుమాస్తాలంతా అక్కసు పట్టలేక విడివిడిగానూ, జోడు జోడుగానూ, గుంపులు గుంపులుగానూ కూడా దాసుకు ట్రాన్స్ఫర్ తెప్పించాలనీ, లేక ఆ సీటు మార్పించాలనీ, లేదా కనీసం ఒక్కరోజన్నా సెలవు పెట్టించాలనీ ఎన్నోసార్లనుకుని ప్రయత్నించి, తలక్రిందులై దేవుడికి కూడా దణ్ణాలూ దస్కాలూ పెట్టి, ఆయన సహాయం కూడా అర్థించి, ఎదురు చూస్చూసి హతాశులై "ఇక లాభంలేదు. దేవుడు దాసు పక్ష[illegible]" అనే ఏకైక నిర్ణయానికి వచ్చిన తర్వాత ఎన్నో యుగాలకి "దాసు శుక్రవారంనాడు సెలవు పెట్టాడు" అనే నమ్మలేని వార్త వాళ్ళ చెవుల్లో పడితే మతులు చెడవూ మరి?

ఇలా మతులుపోయిన గుమాస్తాలంతా మరో ఐదు నిముషాల్లో తేరుకుని, వాళ్ళ వాళ్ళ సీట్లొదిలిపెట్టి, దాసు చుట్టూ చేరారు "ఏ కారణం

పెండ్యాల నాగాంజనేయులు

వల్ల సెలవు పెట్టావు" అని నిగ్గదీస్తూ.

వాళ్ళ బాధ తెలిసిన దాను వాళ్ళందరికీ ఏవో రకరకాల సాకులు చెప్పి, ఏడ్పించి; కన్నీళ్ళు కార్పించి, చివరకు "నేను గురువారం రాత్రి బయల్దేరి బెజవాడ వెళ్తున్నానోచ్! శనివారం పొద్దున్నే వచ్చేస్తానోచ్" అన్నాడు.


అందులో ఓ ముసలి గుమాస్తా "నీకు బెజవాడ వెళ్ళే ఖర్మేం పట్టిందీ?" అంటూ డ్రాయరెక్కి కూర్చున్నాడు. మిగతా వాళ్ళు కోరస్ పాడారు. ఇంతలో తాసిల్దారుగారు ఆఫీసులో కాలెట్టడం చూసి ఎవరి సీట్లలోకి వాళ్ళు పారిపోయి కలాలాడించడం మొదలెట్టారు.

● ● ●

అనగనగా ఓ బీద శంకరయ్యగారి భార్య కడుపు పదకొండోసారి పండింది. అదివరలో పండిన ఏ ఒక్క పంటా మూడురోజుల కన్నా ఎక్కువకాలం నిలిచింది లేదు. కాని ఈ పంటమాత్రం అలా కాదు. అందుకే నాలుగో రోజున శంకరయ్య బ్రహ్మానంద భరితుడై ఓ పెద్ద బోర్డుకట్టుకున్నజ్యోతిష్కుడి దగ్గరకు అద్దె సైకిలేసుకెళ్ళి "అయ్యా! ఇదిగో ఇదీ టైము. ఈ టైములో నాకో మొగపండు కలిగింది. దాని తాలూకు జాతకం యావత్తూ ఏకరువుపెట్టండీ" అన్నాడు సంతోషంగా గుంజనానుకుని గొంతుక్కూర్చుంటూ.

జ్యోతిష్కుడు పద్మాసనం వేసుక్కూర్చుని, పది పంచాంగాలు తిరగేసి, కాగితం, కలం పుచ్చుకుని అప్పటికప్పుడు ఇళ్లూ వాకిళ్ళూ కట్టేసి, వాటిలో గ్రహాల్ని ప్రవేశపెట్టి "మరి శంకరయ్యగారి పంట తాలూకు జీవిత విశేషాలు ఏకరువు పెట్టండీ" అని కోరాడు.

గ్రహాలన్నీ కూడ బలుక్కుని ఏం చెప్పాయోగాని జ్యోతిష్కుడు మాత్రం "క్షమించండి శంకరయ్యగారూ! మీ పంట బహు నష్టజాతకప్పంట. అసలు బతికి బట్ట కట్టడం కష్టమంటున్నాయి గ్రహాలు" అంటూ మొదలు పెట్టాడు. శంకరయ్యకు ముచ్చెమటలు పోయలేదు. దిగులూ పడలేదు. లోగడ పది పంటలూ దక్కక పోవడంవల్ల మనసు రాయి చేసుకున్నాడు. కాకపోతే ఈ పంట నాల్గురోజులు నిలిచింది. ఇంకా నిలుస్తుందనే ధైర్యం వుండడంవల్ల "అయ్యా! జోతిష్కుడుగారూ! బట్ట కట్టక పోతే మానె. బ్రతికే యోగం వుంటే చెప్పండి" అన్నాడు బ్రతిమాల్తూ.



జ్యోతిష్కుడు శంకరయ్య మాటకు కడుపుబ్బ నవ్వుతూ కిందబడి దొర్లి, పొలమారి, మంచినీళ్ళు తాగి, మొహం కడుక్కుని, డ్రిల్లు చేసి "హొర్నీ అసాధ్యం కూల! భలే నవ్విస్తార్ సార్ మీరు! హాబ్బ! హబ్బ! బ్రతికే యోగం ఉంటే బట్ట కట్టకపోతే ఎలా? అయినా ఇంకోసారి గ్రహాల్తో ప్రయివేట్ గా మాట్లాడుతానుండండి." అంటూ మళ్ళీ గ్రహాల్తో మాట్లాడి, కూడికలూ తీసివేతలూ చేసుకుని, శంకరయ్య తొడమీద సంతోష సూచకంగా అయిదువేళ్లూ తట్టుతేలేట్టు చరిచి "ఫలాని విధంగా శాంతి చేస్తే కుర్రాడు బతుకుతాట్ట. తీరా బతకడం అంటూ జరిగాక బట్టకూడా కట్టుకుంటాడు. అయితే ఆ కట్టే బట్టలు మాత్రం కేవలం నేతవి, నూలువీను... అందులోనూ మరీ ముతకరకమూ, నాసిరకమే కాని సిల్కులూ, వులెన్లూ, ట్వీడ్లూ మాత్రం కావు" అన్నాడు చూపుడువేలు శంకరయ్యముఖంమీద తైతక్కలాడిస్తూ.

శంకరయ్య ఓ ఉగ్గుగిన్నెడు ఆనందబాష్పాలు రాల్చి "నిజమా? నిజమేనా?" అన్నా డాశ్చర్యంగా.

ఆయన తనను కించపరుస్తున్నా

దని జ్యోతిష్కుడికి అనుమానం వేసి పక్కనేవున్న మంచినీళ్ళ కుండ పగలేసి "నిజమే!" అన్నాడు గంభీరంగా.

శంకరయ్య సంతృప్తిచెంది జ్యోతిష్కుడికో "హస్తం" యిచ్చుకుని నమస్కారంచేసి, మళ్ళీ సైకిలెక్కి స్పీడుగా పోయేందుగ్గాను రిక్షావాడు తొక్కి నట్టు తొక్కుతూ ఇంటికి చేరాడు.

కుర్రాడు పుట్టిన పదకొండవనాడు జ్యోతిష్కుడు చెప్పిన విధంగా శాంతీ, పుణ్యాహవచనమూ, "లక్ష్మీదాసు" అనే నామకరణమూ చక్కగా యథావిధిగా జరిగాయి. తదాదిగా లక్ష్మీదాసు ఉయ్యాల్లోనూ చేతులమీదా పెరుగుతూ, వంటాముదమూ, డబ్బాపాలూ సేవిస్తూ మూడో నెలలో బోర్లపడి, అయిదో నెలలో పాకి, ఆరో నెలలో కూర్చుని పదోనెల వచ్చేసరికల్లా లేచి నిలబడుతూ అన్నప్రాశనకి తయారయ్యాడు. ఆ రోజున డబ్బులూ, పుస్తకం, కలం, బంగారం అతడికి దూరంగా పేర్చి పెడితే పాక్కుంటూవెళ్ళి డబ్బులు చేత బుచ్చుకుని అందులో ఓ పావలాకాసు గభాల్న నోట్లో వేసుకుని గుటకేయబోయాడు. గుటక దిగలేదు. ఉక్కిరి బిక్కిరయి గుడ్లు తేలేశాడు. తల్లీ తండ్రీ నానా కంగారూపడి గోలపెట్టి బెజవాడ కనకదుర్గమ్మకు మొక్కుకున్నారు. "తల్లీ! మా బిడ్డను కాపాడు. వాడిచేత నీకు కుంకం పూజ చేయిస్తాము" అని. అంతే! గుటక దిగింది. నాణెం పొట్టను పెట్టుకున్న కుర్రాడు దక్కాడు.

ఆ తర్వాత పన్నెండేళ్ళ వరకూ ఏ ఉపద్రవమూ సంభవించలేదు. నిక్షేపంగా థర్డుఫారంకూడా ప్యాసయ్యాడు. అయేడే దాసు తండ్రి భార్యా బిడ్డల్ని దిక్కులేనివాళ్ళను చేసి పోయాడు. శంకరయ్య నిలవజేసిన "లప్ప" ఏమీ లేనందువల్ల అతని భార్య వంటలక్కగా జీవితం సాగించాల్సి వచ్చింది. తల్లి కష్టం చూసిన దాసుక్కూడా ధనార్జన చెయ్యాలని కోరికపుట్టింది. పొద్దున్నే 9 గంటలదాకా వార్తాపత్రికలమ్మి, రాత్రిళ్ళు సినిమాహాళ్ళలో టీలూ, సోడాలూ అమ్మి ఏదో విధంగా రోజూ కష్టపడి ఓ రూపాయి కళ్ళ చూసి తల్లికి సాయపడుతూ స్కూల్ ఫైనల్ దాకా చదువుకుని, ఆ దరిమిలా సర్వీస్ కమీషన్ పరీక్షల కెళ్ళి ఈ తాలూకాఫీసు ఉద్యోగం దక్కించుకుని, మరో రెండేళ్ళకు వివాహం చేసుకుని సుఖంగా ఉంటున్నాడు. ఎంత సుఖంగా ఉంటు

న్నాడూ అనుకున్నా అప్పుడప్పుడూ ఓ తలనెప్పో, ఓ జ్వరమో, ఓ చెవిలో పోటో రాకమానదుగా మనిషన్న తర్వాత. అదిగో అలాంటప్పుడే దాను తల్లికి మొక్కుబడి సంగతి జ్ఞాపకం వచ్చి దానుమీద తాడెత్తున లేస్తుంది. దానికి దాను నవ్వుతూ "ఆఫీసులో పని చచ్చే వత్తిడిగా వుందాయె. తీరా బెజవాడ వెళ్ళి రావాలీ అంటే ఓ రోజన్నా కనీసం సెలవు పెట్టాలి గదా? సెలవు పెడ్తే పాపం గవర్నమెంటు కెంత కష్టం! మన కెంత నష్టం? నీ కెందుకు? నేను తీరుబడి చూసుకుని మొక్కు చెల్లించుకొస్తాగా" అని తల్లిని చల్లబరుస్తాడేగాని ఏ పరిస్థితిలోనూ—రోగమొచ్చినా రొష్టొచ్చినా, వానొచ్చినా, వరదొచ్చినా కూడా ఆఫీసు కెళ్ళడం మానడు. ప్రతిరోజూ అంతో ఇంతో అదనంగా కళ్ళచూస్తేగాని నిద్రపోడు. అతని విషయం చూసి చూసి, కోడల్ని కూడగట్టుకుని, ఆ యేడే వచ్చిన కృష్ణా పుష్కరాన్ని అసరగా తీసుకుని, మొక్కుకూ, పుష్కరానికీ పవిత్రమైన లంకె ఒకటి సృష్టించి కొడుకుమీద ఒత్తిడి తెచ్చింది తల్లి. ఇదీ తప్పుకోబోయాడు నేర్పుగా. ఇంతలో భార్య తెలివిగా మొక్కుబడికి, తన ప్రాణానికి లంకె వేసింది. దాంతో దాను దారి కొచ్చి 'సర్లే' అన్నాడు అయిష్టంగానే.

తత్ఫలితమే 'శుక్రవారంనాడు సెలవు!'

● ● ●

దాను తిరిగి రావలసిన శనివారం వచ్చినా, అతడుమాత్రం రాలేదు. ఇంటిదగ్గర అత్తా కోడళ్ళు అతడికేదైనా గండం సంభవించిందేమోనని భయపడుతూ, వీధిగుమ్మంలోనే - అతడి రాకకోసం ఎదురుచూస్తూ - కనకదుర్గకు మొక్కుతూ కూలబడ్డారు.

ఆఫీసులో గుమాస్తాలు ఎక్కడి పను లక్కడ బ్రేక్ వేసి గుమిగూడి దాను తిరిగి రాకపోవడానికి అత్యాశ్చర్యం ప్రకటిస్తూ, కారణాలు వూహిస్తూ, వెళ్ళగక్కుతూ, ఒకరితో మరొక రేకీభవిస్తూ, ఒకరినొకరు ఖండించుకుంటూ బుర్రలు గోడకేసి బాదుకుంటూ, లీటర్ల లెక్కన కాఫీ పుచ్చుకుంటూ, సిగరెటు కాలుస్తూ, పొడుం పీలుస్తూ, కూర్చుంటూ, లేస్తూ, "ఇశ్శో" "అశ్శో" అంటూ ఆఫీసు వరండాలో పచార్లు చేస్తున్నా రంతా.

మధ్యాహ్నం పన్నెండు గంటలకు— ఆఫీసుకో టెలిగ్రామూ, ఇంటికో ఉత్తరమూ వచ్చాయి.

టెలిగ్రాం: అనారోగ్యంగా ఉంది. మరి నాల్గురోజులు సెలవిప్పించ ప్రార్ధన— దాను.

గుమాస్తాల మనసు క్షణాలమీద తేలిక పడింది 'మిస్టరీ' వీడిపోయినందుకు. అంతా "అయ్యో పాపం!" అని పైకంటూ లోపల మాత్రం "కావలసిందే వెధవకు" అనుకున్నారు. కొందరు "పాపం! రోజుకు 5 రూపాయలు చొప్పున చూసుకున్నా పాతిక రూపాయలు క్షవరం గదా దానుకు?!" అంటూ కసిగా జాలిపడ్డారు.

మరో అరగంటలో తాసీల్దారుగారు వేంచేసి, దాను పెట్టిన సెలవును సానుభూతితో మంజూరు చేశారు.

ఇక ఉత్తరం: "గం॥ భ॥ స॥ తల్లిగార్కి, దాను నమస్కారాలు. ఇక్కడ నేను క్షేమంగానే వున్నాను. దుర్గగుడిలో విపరీతమైన ఒత్తిడి వల్ల నా మొక్కు ఈ రోజు తీరలేదు. వచ్చే శుక్రవారం తీర్చుకుని, ఆ తర్వాత వచ్చే శని ఆదివారాలు ఆఫీసుకు సెలవే కాబట్టి సోమవారం నాటికి (అంటే ఆ రోజే నా పుట్టిన రోజు కూడా) వస్తాను. ఎప్పటిలాగే మా ఆఫీసు గుమాస్తా లందరిని ఆ రోజు సాయంత్రం టీ పార్టీకి పిలుస్తాను. కాబట్టి తగిన ఏర్పాట్లు చేయవలసింది. నేను సోమవారం నాడు సరాసరి ఆఫీసుకే వెళ్తాను. సాయంత్రమే గుమాస్తాలతో కలిసి ఇంటికి వస్తాను. మరేం కంగారు పడవద్దు.

నీ కుమార్డు,
దాను."

అత్తాకోడళ్ళకు ఆందోళన తగ్గింది. మొక్కు తీర్చుకోలేక పోయినందుకు తల్లి కొంచెం జాలిపడి "పిచ్చిసన్నాసి!" అనుకుంది.

---

* మొదటివాడు: "ఏమండీ! మీ సూటు ఎంత బాగా కుట్టాడండీ టైలరు! వాడి ఎడ్రసిస్తారా?"

రెండోవాడు: "ఇస్తానుగానీ, ఒక్క షరతు."

మొ. వా: "ఏమిటా షరతు?"

రెం. వా: "మీరు మాత్రం నా అడ్రసు వాడి కివ్వనని మాటివ్వాలి."

"మా ఆయన కెంత భక్తో?" అని ఉబ్బిపోయింది దాసు భార్య.

ఆ తర్వాత గురువారంనాడు మరో టెలిగ్రా మొచ్చిందాఫీసుకు మరో రెండు రోజుల సెలవు పొడిగిస్తూ—

సెలవు మంజూరైంది.

గుమస్తాలంతా సంతోషంగా మరిరెండు కాఫీలదనంగా కొట్టేశారు ఆరోజున.

మళ్ళీ గురువారంనాడు మరో తంతి వచ్చింది-మరో రెండురోజుల సెలవు పొడిగిస్తూ.

గుమస్తాలు మరికాస్త కసిగా జాలిపడ్డారు.

తాసిల్దారు మరికాస్తజాలిగా సెలవు మంజూరు చేశాడు.

తర్వాత సోమవారంనాడు ఖచ్చితంగా ఆఫీసు టైముకు తన సీట్లో జొరబడ్డాడు దాసు.

అతని రాక కెదురు చూస్తున్న గుమాస్తాలు అతన్ని చుట్టుముట్టారు యోగక్షేమాలు విచారిస్తూ- జాలి పడుతున్నట్టు నటిస్తూ — ఓ కుర్ర గుమాస్తా "పాపం యాభై రూపాయలు నష్టపడ్డావుగదయ్యా" అని పబ్లిగ్గా జాలిపడ్డాడు.

ముసలి గుమాస్తా కుర్ర గుమాస్తాను ఎర్రటి కళ్ళతో చూసి దాసుతో "ఇంతకీ నీ జబ్బేమిటి ? మందెవరిచ్చారు? అసలేమిటి కథ?" అంటూ డ్రాయరెక్కాడు.

ఇంతలో ఆఫీసు ప్యూను "అయ్యా! తాసిల్దారుగా రొస్తున్నా రండీ" అని హెచ్చరించేసరికి "ఛీ! మాంఛి ముక్కపట్టులో వస్తాడీయన" అనుకుంటూ ఎవరి సీట్లలోకి వారు పరుగెత్తారు.

ఆ తర్వాత పార్టీలు రానూ వచ్చారు. దాసు నష్టబోయాడనుకున్న సొమ్ము ముట్టజెప్పనూ చెప్పారు.

గుమాస్తాలు శ్రుతి పెంచి ఏడ్చేశారు.

మరో అరగంటకు ఆఫీసు టైమైపోతుందనగా దాసు ఒక్కో గుమాస్తాను పేరు పేరునా టీపార్టీకాహ్వానించాడు.

అంతా వెళ్ళారు; సుష్టుగా తిన్నారు; గడగడ తాగారు; గుర్రున త్రేన్చారు.

"ఇంతకీ నీ జబ్బేమిటి? కథేమిటి? కమామీషేమిటి? ఎంతకూ చెప్పవేమయ్యా దాసూ" అంటూ జీడీలా పట్టుకుని నసపెట్టేశాడు ముసలి గుమాస్తా.

తటాల్ని వాళ్ళందరి మధ్యకు ఓ మంచం లాక్కుని, దానిపై నిలబడి "ఆఁ యేముందీ? డబ్బు లేక పోవడమే అనారోగ్యం" అన్నాడుదాసు.



గుమస్తా లందరికీ బలే హుషారు పుట్టింది. "అసలు కథేమిటో చెప్పు" అన్నారంతా. దాసు గొంతు సవరించు కున్నాడు.

"మహాశయులారా! నేను కనక దుర్గకు మొక్కు తీర్చుకునే నిమిత్తం బెజవాడ వెళ్ళాను. శుక్రవారం నాడు సూర్యోదయాత్పూర్వమే కృష్ణకెళ్ళాను స్నానార్థం. గుడ్డలు, సంచీ ఒడ్డునే పెట్టి కృష్ణలోదిగాను. పుష్కరాల సమయం కావడంవల్ల జనం విపరీతంగా వున్నారు. ఆ జనాన్నిచూస్తూ అలాగే అరగంటసేపు ఆనందంగా స్నానం చేసి ఒడ్డెక్కి చూస్తే నాతాలూకు బట్టలు సంచీయూ వత్తూ మాయమైపోయాయి. కంగారుగా వెదుక్కోడం మొదలెట్టాను. ఆ యిసుకలో ఓ పావలా మాత్రం దొరికింది. నా కంగారు చూసి జనం చుట్టూజేరి సానుభూతి వాక్యాలు, "జాగ్రత్తండీ" అని హెచ్చరికలు చేశారేగాని, ఒక్కడన్నా పోనీ "అయ్యోపాపం! కష్టాల్లో ఉన్నట్టున్నారు. ఇదిగో ఓ రూపాయ తీసుకోండి; పోనీ ఓ అర్థ పుచ్చుకోండి; కనీసం ఈ పావలా స్వీకరించండి" అని ఒక్క సన్నాసీ అన్నపాపాన పోలేదు. ఆఁ ... ఎవడికేం బట్టిందిలే! సరే! చేసేదేముంది? ఎరిగున్న శాస్త్రీ లేవైనా తగుల్తాయేమో, ఓ అయిదు రూపాయలన్నా బదులు పుడ్తుందేమో అని జాగ్రత్తగా ముఖాలన్నీ పరీక్షిస్తూ

పిచ్చగా తిరగడం మొదలుబెట్టా. ఊహు! కానీ... అల్లంత దూరంలో నా చిన్నప్పు డెప్పుడో నే నెరిగున్న సూర్యనారాయణమూర్తి గారిలా కనబడ్డాడో బ్రాహ్మడు. స్నానం చేసేవాళ్ళకు మంత్రాలు చెప్పి, వారి నెత్తిన ఓ చెంబెడు నీళ్ళు కుమ్మరించి వాళ్ళకు తోచింది పావలో, అర్ధో ఇస్తే పుచ్చుకుంటున్నాడు. నాకు కాస్త ధైర్యం కల్గింది. ఆయన దగ్గరకెళ్ళి నేను ఫలానా అని జ్ఞాపకంచేసి అవసరం గడుపుకుందామనీ, మొక్కు తీర్చుకు తిరిగొద్దామనీ, నెమ్మదిగా ఆయన్ని సమీపించా. తీరా దగ్గరగా చూస్తే, ఆయ నవునో కాదోననే సందేహం కలిగి బాగా గుర్తు చేసుకోడానికి ప్రయత్నించడం మొదలు పెట్టాను. ఇలా ఆలోచిస్తుండగానే ఆయన మరో పార్టీ దగ్గర కెళ్ళాడు. నేనూ ఆయన్ననుసరించడం మొదలు పెట్టానే గాని నాకు అనుమానం పీకుతూనే వుంది. ఇలా ఆయన ఓ ఇరవై పార్టీల దగ్గరకు మారుతూ, కంచు ఘంటలాగా మంత్రాలు చెప్తూ డబ్బులు పోగేసుకుంటూనే వున్నాడు. ఇంతసేపూ ఆయనవెంట బడి తిరగడంవల్ల హఠాత్తుగా నాకేదో కొత్త విషయం తెలిసినట్లయింది. ఏమిటదీ? మంత్రాలు... మరో పార్టీ దగ్గర ఆయన మంత్రాలు వల్లిస్తూవుంటే నేనూ నోటిలో అనుకున్నాను. డెడ్ కరక్ట్‌గా వచ్చేశాయి నాకు తెలియకుండానే ... అంతే! నాలో జ్ఞానోదయం అయింది. నా జబ్బుకు మందు తెలిసింది. వెంటనే దగ్గరున్న పావలాతో మంగలి దగ్గరకు నడిచాను."

అంటూ దాసు తన నెత్తిమీది ఉన్నిటోపీ తొలగించాడు- గుండూ! పిలక!

గుమాస్తాల బాధ ఇంతా అంతా కాదు- నవ్వేవాళ్ళు నవ్వారు. ఏడ్చే వాళ్ళేడ్చారు. దాసు మళ్ళీ ఆరంభించాడు. "ఆరోజు మధ్యాన్నం ఒంటిగంటకు నే సంపాదించింది ఇరవైనాలుగు రూపాయలన్నర. వెంటనే ఇంటికో ఉత్తరం రాశాను. మర్నాడు ఆఫీసుకో టెలిగ్రాం ఇచ్చాను.

అయితే ఈ పదిరోజులూ అదే ఉద్యోగమన్నమాట?" ముసలి గుమస్తా ప్రశ్న.

"ఆహా, నిక్షేపంగా! నా ఖర్చులు పోను- అంటే సినిమాలు, సర్కసులూ, కాఫీలు, సిగరెట్లు, ఎగ్జిబిషన్లు, ఈ కట్టుకున్న బట్టలు, చెప్పులు, టోపీ, ఈ రోజున నా దగ్గర మిగిలిన పుష్కరాల సంపాదన తాలూకు రొక్కం రెండువందల ఎనభై రెండు రూపాయల చిల్లర" అంటూ జేబులోనుంచి రకరకాల నోట్లున్న కట్టా, కొంత చిల్లరా బయటికి తీశాడు. అందులో నుంచి ఓ అరిగిపోయిన విభూతి పండు కింద పడింది.

"మరి నీ భోజనం సంగతేమిటి?" ముసలి గుమాస్తా ప్రశ్న.

"శివాలయం వీధి సత్రంలో రోజూ సంతర్పణ జరిగేది బ్రహ్మాండంగా: అక్కడేమనతిండీ, నిద్రాను" అన్నాడు దాసు దర్జాగా చిరునవ్వుతో.

ఇంతసేపూ వంటింట్లో కూర్చుని శ్రద్ధగా వింటున్న అత్తా కోడళ్ళు "ఇదేమిటి?" అంటే "ఇదేమిటి?" అన్నట్లు సైగలు చేసుకున్నారు. అత్త ఉండబట్టలేక "ఇన్ని చెప్పాడుగాని మొక్కుబడి సంగతి చెప్పాడు కాడేమే" అంది కోడలితో.

కోడలు నాలిక వెళ్ళబెట్టింది.


"మరి మొక్కెప్పుడు తీర్చుకున్నావ్?" ముసలి గుమాస్తా వదల్లేదు.

"మొక్కా? అదీ... ఈ ట్రిప్పులో కుదర్లేదులే! మళ్ళీ దసరా నవరాత్రులకి బెజవాడెలాగూ వెళ్ళాలి. అప్పుడు తీర్చుకొచ్చేస్తాను. అమ్మవారెక్కడికి పోతుంది? నే నెక్కడికి పోతాను?" అంటూ మంచం దిగాడు దాసు.

"హరి దిక్కుమాలిన వాడా!" అంటూ సొమ్మసిల్లిపోయింది దాసు తల్లి! కోడలు సరే సరి!

గుమాస్తాలంతా నేలమీదబడి దొర్లుతున్నారు ఏడ్పులాటి నవ్వులతో...

□□□



నవ్వితే నవ్వండి

* ఒక సాక్షి కోర్టులో లాయరువేసే అడ్డమైన అసందర్భపు ప్రశ్నలకి విసిగిపోయి, వాటికి తగ్గట్టుగానే సమాధానా లివ్వటం మొదలెట్టాడు.

లాయరు : 'నువ్వెప్పుడైనా పెళ్ళి చేసుకొన్నావా ?'

సాక్షి : 'చిత్తం.'

లా : 'ఎవరిని ?'

సా : 'ఒక ఆడదాన్ని.'

లా : 'ఎవరేనా మొగాణ్ణి పెళ్ళిచేసుకొన్నట్టు నువ్వెప్పుడేనా విన్నావా ?'

సా : 'చిత్తం. మా ఆవిడేనండి.'

* ఒక డాక్టరు మొట్టమొదటుసారి తన దగ్గిర కొచ్చిన ప్రతి రోగికి కన్సల్టేషన్ ఫీ పది రూపాయిలు, రెండోసారి నుంచి అయిదు రూపాయిలు ఛార్జీ చేసేవాడు.

ఒక రోగి ఖర్చు కలిసి రావటానికి ఉపాయం ఆలోచించి 'డాక్టరుగారూ ! వచ్చేశానండీ మళ్ళీ' అన్నాడు సంతోషంగా.

డాక్టరు : 'వెరీగుడ్! కోలుకుంటున్నా వన్నమాట. నేనిచ్చిన పాత మందులే వాడుతూ వుండు.'

* పూటుగా తాగేసిన తాగుబోతు తూలుతూ బార్‌లోంచి బయటుపడి, ఒక కాలు రోడ్డుమీద, ఇంకో కాలు పేవ్‌మెంటు మీద వేసి నడవటం మొదలెట్టాడు.

ఇది చూసిన బీట్ కానిస్టేబుల్ 'ఏయ్ ! ఏమిటా నడక? ఒక కాలు రోడ్డుమీద, ఇంకోటి పేవ్‌మెంటుమీదా?' అన్నాడు.

'అరె! కరెక్టుగా కనిపెట్టారు. ఇందాకణ్ణించీ చూస్తూన్నాను, ఒక కాలు పొడుగ్గా, ఇంకోటి పొట్టిగా వున్నా యేమిటాని ?' అన్నాడు తాగుబోతు.

—ఎస్పార్.

ఇంతే మగవాళ్లు

[మగ పాత్రలు లేని నాటిక]

అదొక గది. అందులో మంచం, బట్టల స్టాండ్, అద్దం బల్ల వగైరా సంసారం సామాన్లు వుంటాయి. కుడి వైపున ఒకటి, ఎడమవైపున ఒకటి, ద్వారాలు, వుంటాయి.

[కమల అద్దంముందు కూర్చుని తీరిగ్గా కూనిరాగాలు తీసుకుంటూ ముస్తాబు అవుతూ వుంటుంది. అత్త రాంభాణమ్మ వచ్చి కోడలి పిల్ల కులాసాకి విస్తుబోయి చూస్తుంది. కమల గబుక్కున కూనిరాగం ఆపేస్తుంది.]

రాంభా : (కోపంగా) ఆపేశావేం? పాడుకో, నీకేమైనా పనా? పాటా? ఆఫీస్ నుంచి అబ్బాయి వచ్చేదాకా ఎంచక్కా పాడుకో.

కమల : (కొంచెం ఆలోచించి) ల...ల...లా(అని మళ్ళీ నిర్లక్ష్యంగా పాడుకుంటూ మేకప్‌కి తుది మెరుగులు దిద్దుతుంది.)

రాంభా : అవును. నిన్నని ఏం లాభం! నిన్నింత నెత్తికెక్కించుకోడం నాదే తప్పు.

కమల : నేనేం మీ నెత్తినెక్కలేదు!

రాంభా : ఇంక అదొక్కటి తక్కువైంది. గంగిరెద్దులా కూర్చుని కూనిరాగాలు తీసుకునే బదులు – ఈ ఇంటికి కోడల్ని కదా, ఇల్లూ అదీ చూసుకుని, వంటా గిట్రా చెయ్యాలి– అనే జ్ఞానం నీకేమైనా వుంటే కదా! ఎందుకూ వచ్చాయి పాతికేళ్లు. తాడి చెట్టుకొచ్చాయి నీకూ వచ్చాయి.

తంబు

కమల : అత్తగారూ! మీ ఇష్టం వచ్చినట్టు మాట్లాడకండి.

రాంభా : నీతో నాకు మాటలెందుకే. వెళ్లు వెళ్లు పొయ్యిమీద పాలు పొంగిపోతున్నాయి.

కమల : పాలు పొంగిపోతే నేనే దించాలా? వంటింట్లోంచి వచ్చే ముందు దింపి రాకపోయారా?

రాంభా : నేను నీకు అత్తనా? నువ్వు నాకు అత్తవా? ఏమిటి నాకే పనులు పురమాయిస్తున్నావ్?

కమల : అవును మరి అత్తలంతా కోడళ్ళకి పనులు పురమాయించడానికే కాబోలు!

రాంభా : అవునే. మా అత్త నాచేత బండెడు చాకిరీ చేయించేది. నోరెత్తకుండా చచ్చినట్టు చేసేదాన్ని. అత్తనై– నేనూ వున్నానిప్పుడు. ఏం లాభం? పాలు దింపి రావే అని నిన్ను అద్దం దగ్గర్నించి లేపలేక పోతున్నాను.

కమల : అత్తయ్యా. మీరెన్ని చెప్పండి. నేనివాళ వంటింట్లోకి వస్తే వెళ్ళను.

రాంభా : ఓసి నీయిల్లు బంగారం గానూ. మరీ అంత కుండ బద్దలు కొట్టినట్టు చెప్పేస్తున్నావ్!

కమల : అవునత్తయ్యా. రోజూ నేనే చేస్తున్నానుగా వంట. ఇవాళొక్కరోజు మీరు చెయ్యాలి.

పాత్రలు :

రాంభాణమ్మ
కమల
లక్ష్మి
సుజాత
శాంతమ్మ

అంతే. ఏమైనా సరే నేనివాళ వంట చెయ్యను.

రాంభా : ఇది మరీ విడ్డూరంగా వుంది. రోజూ నువ్వు చేస్తున్నావుటే వంట! ?

కమల : నేను కాకపోతే మీరు చేస్తున్నారా? పొద్దున మీ పూజ పూర్తయ్యేసరికి పన్నెండు, తర్వాత మీరు చేసేది భోజనం. సాయంత్రం మీరు పురాణం నుంచి తిరిగి వచ్చి చేసేది నెయ్యి వెచ్చబెట్టడం. అంతేగా!

రాంభా : అయ్యో, రామా! శుబ్భరంగా మడిగట్టుకుని పూజ చేసుకునే దాన్ని అలా వుండనిస్తావుటే! బాత్‌రూంలో దొరసానిలా స్నానంచేస్తూ – అత్తయ్యా పొయ్యి మీద కూర మాడి పోతుందేమో ఒక్కసారి చూడండి. అన్నట్టు ఆ పులుసులో బెల్లం ముక్క వెయ్యడం

మర్చిపోయా వేసేద్దురూ. అదేచేత్తో ఆ అన్నం అడుగంటి పోతుందేమో దింపేద్దురూ— అని నా ప్రాణంతీసి నా మడి మంట కలుపుతావు కదే! పైగా వంట నువ్వు చేస్తున్నావా?

కమల : పోనీ పొద్దుటి విషయం వదిలెయ్యండి. సాయంత్రం ఐదయ్యే సరికి హెడ్మాష్టారిలా తయారై బయల్దేరతారుగా పురాణానికి. మరి ఆ సంగతో!

రాంభా : అయినకాడికి కూరలన్నీ తరిగి, బియ్యం కడిగి పొయ్యి మీద పడేసి వెళ్తానుకదే రోజూ. నువ్వు పడిపోతున్న కష్టమేమిటి నాకు తెలియక అడుగుతా!

కమల : అవును పాపం. ప్రొద్దున్న పూజచేసుకోనియ్యకుండా వంట—సాయంత్రం పురాణానికి వెళ్ళనియ్యకుండా వంట— పాపం ఎంత కష్టపడిపోతున్నారో!

రాంభా : అస్తమానం నా పూజ, పురాణంమీద పడ్తావేం! నా పూజా పురాణం నువ్వు అద్దం ముందు కూర్చుని పాటలు పాడుకోడానికి అడ్డొస్తాయా?

కమల : అయితే నేనస్తమానం అద్దం ముందు కూర్చుని పాటలు పాడుకుంటున్నానా?

రాంభా : అయితే నేనస్తమానం పూజలు చేసుకుని పురాణానికి వెళ్తున్నానా?

కమల : కాకపోతే మీరు అస్తమానం వంట చేస్తున్నారా?

రాంభా : అయితే నువ్వు చేస్తున్నావా అస్తమానం వంట?

కమల : అవును నేనేచేస్తున్నాను.

రాంభా : నువ్వు మధ్య మధ్యలో చేసిన వంటే తినలేక ఛస్తున్నాం. నా ప్రాణాలకి అస్తమానం కూడా నువ్వే చెయ్యాలా వంట!

కమల : ఫరవాలేదు లెండి. మీ కంటే బాగానే చేస్తాను.


రాంభా : అందుకే కాబోలు మొన్న అరటికాయ కూర అంత అందంగా బొగ్గు అయి పోయింది.

కమల : మీలాగ పులుసులో వుప్పు ఎక్కువ వెయ్యలేదుగా!

రాంభా : అవునే పులుసులో వుప్పు ఎక్కువే వేశాను! వెయ్యడం మర్చిపోయా ననుకుని మళ్ళీ వేశాను. ఏం చేస్తావు పెద్ద!!!

కమల : అహా! మొన్న అరటికాయ ముక్కలు మీరు వేయిస్తున్నారేమో అనుకుని మాడిపోతూన్నా చూస్తూ వూరుకున్నాను. మీరు మహా ఏం చేస్తారు?

రాంభా : ఏం చేస్తానా? నా



ఖర్మ అనుకుని నెత్తి [illegible]ని నోర్మూసుకుని వూరుకుంటాను.

కమల : మంచి పని! అలాగే చెయ్యండి.

రాంభా : చేస్తానమ్మా. చేస్తాను. మేనరికం వదులుకుని నిన్ను చేసుకున్నందుకు నాకు బాగానే బుద్ధి చెప్తున్నావు.

కమల : నన్ను పెళ్ళి చేసుకున్నది మీరు కాదు. మీ అబ్బాయి.

రాంభా : అవును. ఇదంతా వాడివల్లే వచ్చింది. ఆ చవట గాడిద నిన్ను చేసుకుంటానని ఏడవబట్టి ఈనాడు నాకు ఇలా గడ్డి పెడుతున్నావు.

కమల : నేను పెట్టడంలేదు. మీరే తింటున్నారు.

రాంభా : అవును నేనే తింటున్నాను. నాతోపాటు వాడికి కూడా కాస్త పెట్టు. ఎవడికి? మా వాడికి. నీ మొగుడికి. ఆ చవటకి, ఆ వెట్టి

వెధవకి, ఆ జడ్డి నాగమ్మకి—నిన్నే చేసుకుంటానని నాకు నిర్వాకం చేసిన ఆ చెవల వాజమ్మకి కూడా నిన్ను చేసుకున్నందుకు బాగా బుద్ధి వచ్చేటట్టు గంపెడు గడ్డిపెట్టు!

కమల: ఏమండోయ్ అత్తయ్యా! అనవసరంగా ఆయన్నెందుకు తిడతారు. నా సోరసలే మంచిదికాదు. ఆయన పూసెత్తకండి మధ్యలో.

రాంభా : నీ వాటం చూస్తే నోరేకాదు చెయ్యి కూడా చేసుకునేట్టున్నావ్! అయినా ఫాడినని ఏం లాభం! అంతా నా ఖర్మ!!!

కమల: అలా అన్నారుబాగావుంది. ఆయన్నిమాత్రం తిట్టకండి. నాకసలే చిరాగ్గా వుంది.

రాంభా : ఏమిటే? నన్ను బెదిరిస్తున్నావా? నాయిష్టం వచ్చినట్టు తిడతాను. నీ మొగుడు వట్టిచేతకాని వెధవ! పెళ్ళాంచేతిలో కీలుబొమ్మ!

కమల : అత్తయ్యా. మర్యాదగా ఆఖరుసారి చెప్తున్నా. మళ్ళీ ఆయన్ని తిడితే మాట దక్కదు.

రాంభా : అయితే నా కొడుకుని నేను తిట్టుకునే హక్కు నాకు లేదన్నమాట.

కమల : లేదు. ఆయన బాగోగులు చూసుకోడానికి తాళి కట్టిన పెళ్ళాన్ని నేనున్నాను. అనవసరంగా మీరు జోక్యం చేసుకోకండి.

రాంభా : ఇదంతా చూస్తుంటే వాడే నీకు పెళ్ళాంలా వున్నాడు.

కమల : ఏదోఒకటి. మీకెందుకు మధ్యలో.

రాంభా : ఔరా! కనిపెంచిన తల్లిని నాకంటే – నిన్నకాక మొన్న వచ్చిన పెళ్ళానివి నువ్వు ఎక్కువటే వాడికి.

కమల : అవును మీకంటే నేనే ఎక్కువ ఆయనకి. ఇప్పటికైనా తెల్సిందా ?

రాంభా : తెల్సిందమ్మా! వూరికే అనలేదు పెద్దలు – పెళ్ళాం అంటే బెల్లం, తల్లి తండ్రీ అల్లం– అని.

కమల : అనవసరంగా సినిమా పాటలు పాడకండి. వెళ్ళి వంట చెయ్యండి నాకు వేరే పనుంది.

రాంభా : అవునే. పెద్దలంటే భయం భక్తి, గౌరవం లేక పోయాక నేనేం చెప్పినా సినిమా పాటల్లా నే వుంటాయి మరి. ఈ కాలం పిల్లలు ఇంత బరితెగించబట్టే సంసారాలు సర్కస్ కంపెనీల్లా తయారౌతున్నాయి.

కమల : అత్తయ్యా! మాటలు జాగ్రత్తగా వాడండి. ఇది సర్కస్ కంపెనీ అయితే మీరు ఒక ఖడ్గమృగం.

రాంభా : (నోరు నొక్కుకుని) ఓసి నీ అఘాయిత్యం కూలా! నన్ను ఖడ్గమృగం అంటావుటే!

కమల : నేను వేరే అనక్కర్లేదు.

రాంభా : అంటే?

కమల : అంతే!

రాంభా : మనిషంత మనిషిని. అందులోనూ అత్తగార్ని. పెద్దదాన్ని. నేనంటేనే ఖాతర్లేకుండా ఇంతలేసి మాట లంటున్న దానివి వాణ్ని మటుకు ఏం సుఖపెడతావు?

కమల : ఆయన్ని మీరు సుఖపడనిస్తే చాలు. నేను వేరే సుఖపెట్టనవసరంలేదు.

రాంభా : హవ్వ. హవ్వ. నేను వాడి సుఖానికి అడ్డొస్తున్నానుటే!

కమల : కాక పోతే మరి. ఆర్నెల్లక్రితం ఆయన పాపం కొత్త రేడియో కొనుక్కుందా మనుకుంటే మీరేగా కృష్ణా రామా అంటూ కొనిపించారు ఉత్తరదేశ యాత్రకి టిక్కట్టు – నూట ఎనభై రూపాయలు పెట్టి!

రాంభా : మూణ్ణెల్ల పాటు నాబాధ వుండదని నువ్వేగా వాడి చేత ఆ టిక్కట్టు కొనిపించి నన్ను కాశీకి పంపించేశావు!

కమల : టిక్కట్టు ఎనభై, మీ పైఖర్చు డెభై అయిదు, మీరు పారేసిన మరచెంబు వృధా అయి పోయినా మూడు నెలలూ వాన వెలిసినట్టు హాయిగా వుంది.

రాంభా : వాడు నాకు ఖర్చు పెడితే వృధా ? నువ్వూ వాడూ అప్పుడు మీ చిన్ని కూతురు పెళ్ళికి వెళ్ళి—అరవై రెండు రూపాయిల పట్టుచీర గొప్పగా చదివించి, పెళ్ళిలో ఒంటిపేట గొలుసు పారేసుకోడం దండగకాదు బాబోలు!

కమల : నా ఆయన సంపాదన నా యిష్టం వచ్చినట్టు తగలేస్తాను. మీకేం ?

రాంభా : నా కొడుకు మీద నీ కెంత హక్కు వుందో అంతకంటె నాకు ఎక్కువే వుంది. తెలుసునా ?

కమల : తెలియకేం! మీ పూజలకి, పునస్కారాలకి, దానాలకి, ధర్మాలకి అయ్యే దుబారా అంతా అందులోంచేగా !

రాంభా : నీ సినిమాలకి, సింగా

---

* లాయర్ కష్టపడి ఎలాగో తన క్లయింటయిన గజదొంగకి విముక్తి కల్గించాడు. వాడు కృతజ్ఞతతో "ప్లీడరుగారూ! ఎప్పుడేనా వచ్చి తమ దర్శనం చేసుకుంటాను" అన్నాడు.

ప్లీడరు : "బాబ్బాబు. నీకు పుణ్యముంటుంది. వీలు చేసుకొని పగలే రానాయనా."

రింపుకి వదిలేది ఎందులోంచో మరి!

కమల: అవును మొగుడి సంపాదనమీద పెళ్ళానికి హక్కు ఎలా వుంటుందీ ఇంట్లో. ఆయనేమో వుత్తి చంటిపాపాయి. తల్లిచాటు పిల్లాడు. అమ్మ చెప్తేనేగాని మీ అబ్బాయి ఏ పనీ చెయ్యరుగా— 'ఒరేయ్ మీ ఆవిడ దుబారా చేస్తోంద్రోయ్' అని చెప్పేయ్యండి.

రాంభా: అయినకాడికి వాడు జీతం అంతా తీసుకొచ్చి నీ చేతులోనే పోస్తున్నాడుగా. పెత్తనం అంతా నీదనేగా ఈ మెహర్బానీ. ఎందుకూ చేస్తున్నాడు వుద్యోగం. అదికూడా వదిలేసి నీకొంగు కట్టుకుని తిరిగితే సరిపోతుంది. పట్టిపెట్టు మారి మొగుడు!!!

కమల: లేకపోతే. అమ్మా అమ్మా అంటూ మీ వెనకతిరగాలా?

రాంభా: అక్ఖర్లేదు. నీ కొంగుకే ముడేసుకుని నీ వెనకే తిప్పుకో. వాడికి సిగ్గులేక పోయాక నిన్నని ఏం లాభం?

కమల: ఛ. ఛ. ఏంమనుషులో.. భార్యా భర్తలు అన్యోన్యంగావుంటే చూసి ఓర్వలేరు.

రాంభా: అయ్యో! అయ్యో! అయ్యో! ఎంతలేసి మాటలంటున్నావే! మీ అన్యోన్యం చూసి ఓర్వలేనుకే! ఏడీవాడు? వాడ్ని రానియ్యి చెప్తాను. వ్యవహారం ఇంతవరకూ వచ్చాక ఇంక లాభం లేదు. నేనీ ఇంట్లో వుండడం ఇష్టంలేదేమో వాడినే అడిగేస్తాను.

కమల: ఆయన ఇప్పుడప్పుడే ఇంటికి రారు. ఇంటికి రాగానే మీరేదో ఇలాంటి పంచాయితీ పెడతారనే!

రాంభా: అవునే. రోజూ నీతో దెబ్బలాట పెట్టుకుని, ఆ తగవు తీర్చమని వాడ్ని వేధించుకు తినడమే పని నాకు. వాడిని రానియ్యి. ఈ సంగతికూడా అడిగేస్తా.

కమల: ఆ... మీరిటువంటివన్నీ అడుగుతారని తెలిసే ఆయనఆరుగంటలయినా ఇంటికి రావడానికి భయపడి ఆఫీసులోనే వుండిపోతున్నారు.

రాంభా: ఏమో! నాకు భయపడి ఆఫీసులో వుండిపోతున్నాడో! నీకు భయపడి నీ చీర ఎంబ్రాయిడరీ దారాలూ, పూసలూ, అద్దం ముక్కలుకోసం బజార్న పడి తిరుగుతున్నాడో!

కమల: కాదు. మీరు చెప్పిన గంటల పంచాంగం తేవడానికే పోస్టుమేన్‌లా వూరంతా వెదుకుతూ వుంటారు.

(లక్ష్మి కుడివైపునుంచి కాలేజీ నుండి వచ్చి, పుస్తకాలు టేబిల్ మీదకి గిరాటేసి, నీరసంగా నిట్టూర్చి, అటూ ఇటూ చూసి, కమలతో...)

లక్ష్మి: వదినా అన్నయ్యొచ్చాడా ?

రాంభా: అప్పుడే ఎందుకు వస్తాడూ! రంగుదారాలింకా దొరికి వుండవు.

కమల : కాదు. గంటల పంచాంగం కోసం పక్క వూరు వెళ్ళుంటారు.

లక్ష్మి: అబ్బబ్బ! అప్పుడే మొదలయ్యిందీ మీ యుద్ధం. అమ్మా కష్టపడి కాలేజీకి వెళ్ళొచ్చానుకదా రాగానే కాస్త కాఫీ ఇవ్వకూడదే!

రాంభా: సిగ్గు లేకపోతే సరి. నేను కలిపి ఇవ్వాలా కాఫీ? ఈ పాటికి పెళ్ళయి పిల్లల తల్లివి అవాల్సిన దానివి నీకు నేను కాఫీ కలిపి వియ్యపురాలిలాకూర్చోపెట్టి ఇవ్వాలిటే!

లక్ష్మి: అమ్మా! వదిన మీద కోపం నామీద చూపిస్తావేం? పోనీ వదినా, నువ్వైనా కాస్త కాఫీ కలిపి ఇద్దూ! కాలేజీనుంచి రాగానే నీరసం వచ్చింది.

కమల: ఈ ఇంట్లో అందరికీ నీరసాలే! ఎటొచ్చీ నేనే ఎద్దులా అంత చాకిరీ చెయ్యాల్సింది!

రాంభా: ఇప్పుడు వాడు రాగానే వాడ్ని తీసుకుని ఎక్కడికో షికారు వెళ్ళాలి కాబోలు – అందుకనే రోజూవచ్చే నీరసం పోయిందివాళ.


కమల : షికారుకేమీ వెళ్ళడం లేదు. మా అక్కయ్య ఆడబడుచు తోటికోడలు మొగుడికి ఈ వూరు బదిలీ అయిందిట. వాళ్ళిల్లు ఆయనకు తెలుసు. తీసుకువెళ్తానన్నారు అంతే!

రాంభా: ఏమోనమ్మా నాకదంతా తెలియదు. టౌనుహాల్లో రామాయణంకథ మీఎవరో మాట్లాడతారుట ఇవాళ. ఎన్నిసార్లు వెళ్ళినా ఆ దిక్కుమాలిన టౌను హాలు నాకు గుర్తుండి చావదు. వాడొచ్చాక నన్నక్కడ దిగబెడతాడు. తర్వాత మీ ఇష్టం!

లక్ష్మి: అమ్మా ... వదినా ... మీ దెబ్బలాట మీదే కాని నాకు కాఫీ ఇచ్చేట్టులేరు మీరు. ఇప్పుడు అన్నయ్య వచ్చినా కాఫీ ఇచ్చే దిక్కు లేదు.

రాంభా: దానికంత బాధ్యత తెలియకపోయినా నేను వున్నానుగా కలిపి ఇస్తాలే కాఫీ!

కమల : మీరేం కష్టపడనక్కర్లేదు. కాఫీ కలిపి ఫ్లాస్కులో పోసి వుంచాను లెండి.



లక్ష్మి : హమ్మయ్య! బతికించావ్! ఏదీ కాఫీ?

రాంభా: గ్లాసులో పోసుకుని తెచ్చుకుని తాగగలవా? పడుకోపెట్టి పట్టాలా?

లక్ష్మి: నేవెళ్ళి తెచ్చుకోగలను. కానీ నే వెళ్ళగానే మీరు మళ్ళీ యుద్ధం ప్రారంభిస్తారు.

కమల : పోన్లే. నేను తెచ్చిపెడతాను.

(అనికమలఎడమవైపు వెళ్తుంది.)

రాంభా: (ఎడమగదికేసి చూస్తూ) ఒసే అమ్మడూ. వాడ్ని వుత్త అమాయకుడ్ని చేసి మనల్నందర్నీ ఎలా ఆడిస్తోందో చూశావా?

లక్ష్మి: అమ్మా నీకు వేరే పనేమీ లేదేమిటే ?

రాంభా: ఏం అలా అడుగుతున్నావ్.

లక్ష్మి: అబ్బే ఏం లేదు. నీ పురాణం ఎన్నింటికి?

రాంభా: ఇవాళ పురాణానికి వెళ్ళను. టౌను హాల్లో రామాయణానికి వెళ్ళాలి. అబ్బాయివస్తే బావుండును దిగబెడతాడు.

లక్ష్మి: అవును అన్నయ్యవస్తే బావుండును.

(కమల ఎడమ ద్వారంలోంచి కాఫీ గ్లాసుతో వచ్చి లక్ష్మికి ఇస్తుంది.)

కమల : ఎవరూ రావడం? మీ అన్నయ్యేనా. ఆయనింత పెంద్రాళే వస్తే ఇంకేం?

రాంభా : వాడు వచ్చేసరికి ఆ రామాయణం కాస్తా అయ్యేపోతుంది. ఎప్పుడొస్తాడో! ఎప్పుడు దిగపెడతాడో!

కమల : అత్తయ్యా! మీ రామాయణంకంటే ముందు నేను మా వాళ్ళ యింటికి వెళ్ళాలి. గంట నించీ నేను రెడీగా చూస్తున్నా ఆయనకోసం.

రాంభా : వాడ్ని రానియ్, వాడే ఆలోచించుకుంటాడు. నన్ను దిగపెట్టాలో, నిన్ను తీసుకు వెళ్ళాలో.

లక్ష్మి : ఈ పరిస్థితిలో అన్నయ్య వచ్చి ఇరుకులో పడే బదులు ఇంకేదైనా పని చూసుకుని ఆలశ్యంగా వస్తే మంచిది.

కమల : నువ్వు తీరిగ్గా కూర్చుని కాఫీ తాగుతున్నావుగా ఆయన ఎంత అలసిపోతే నీకేం?

రాంభా : అప్పటికి వాడు రాగానే నువ్వు వాడ్ని విశ్రాంతి తీసుకోమంటావు కాబోలు.

కమల : నే వూరుకున్నా మీరూ మీ రామాయణం వున్నాయిగా!

లక్ష్మి : మిమ్మల్ని చూశాక, అన్నయ్య వచ్చినా నా పని చెప్పడానికి భయం వేస్తోంది.

రాంభా ; ఏం? నీకూ ఏమైనా రాచకార్యం చేసిపెట్టాల్నా వాడు?

కమల : అయితే అయినట్టే ఇంక.

లక్ష్మి : అదికాదమ్మా. ఇవాళ రాత్రి మా స్నేహితురాలికి బెజవాడలో పెళ్ళి. అన్నయ్య వస్తే టెలిగ్రాం ఇమ్మనాలి.

రాంభా : శుభమా అని పెళ్ళి చేసుకుంటూంటే టెలిగ్రాం ఎందుకే?

లక్ష్మి : నీకు తెలియదులేవే పెళ్ళికి వేరే టెలిగ్రాంలు ఇస్తారు.

రాంభా : ఏమోనమ్మా టెలిగ్రాం అంటేనే నాకు భయం.

కమల : అత్తయ్యా మీకుకూడా భయం అనేది వుంటుందా? మిమ్మల్ని చూస్తేనే అందరికీ భయం వెయ్యాలికాని–

రాంభా : ఏమే? నేనేం దెయ్యాన్నా? భూతాన్నా? నీ నోటికి మరీ అడ్డూ ఆపూ లేకుండా పోతోంది. వాడ్ని రానియ్ చెప్తా.

కమల : రానియ్యండి. నేనూ చెప్తాను. లేకపోతే రోజూ ఏమిటీ భాగోతం. ఏదో ఒకటి తేలిపోవాలి ఇవాళ.

లక్ష్మి : అమ్మతో సమానంగా నువ్వూ దెబ్బలాడితే ఎలా వదినా? ఏదో పెద్దరికం! చాదస్తంకొద్దీ ఏదో అంటే దాన్ని పట్టుకుని నువ్వుకూడా ఏమిటి వదినా?

రాంభా : అంటే నేనే మొదలు పెట్టానన్నమాట ఇదంతా!

కమల : మీరు కాదు నేనే మొదలు పెట్టాను. ఏదో పోనీలెమ్మని సర్దుకుపోతూంటే మీరు..

రాంభా : ఏం? ఆపేశావేం? ఆ అనదల్చుకున్నదేదో అనెయ్!

లక్ష్మి : అమ్మా నువ్వూరుకో. ఎందుకి కీచులాట అనవసరంగా.

రాంభా : అవునే. నేనే అనవసరంగా కోడలితో కయ్యానికి దిగుతున్నాను. నువ్వుకూడా ఒక కోడలికి అత్తవై, ఆ కోడలు నిన్ను నిర్లక్ష్యం చేస్తే అప్పుడు తెలుస్తుంది.

కమల : కాదులక్ష్మి. నీక్కూడా పెళ్ళయి ఇటువంటి గయ్యాళి అత్తగారు వస్తే నా కష్టం తెలుస్తుంది.

రాంభా : మధ్యలో దాన్నెందుకూ దీవిస్తావు గయ్యాళి అత్తగారొస్తాలని? దాన్ని మా బుజ్జిగాడికే ఇచ్చి పెళ్ళి చేస్తాం. వాడికి ఇదెంత చెప్తే అంతే! నెత్తిమీద పెట్టుకుని పూజ చేస్తాడు. అత్తగారి ఆటలు దాని దగ్గర సాగవు.

కమల : కాబోలు అల్లుడు మీ కూతురి మాట జవదాటకూడదని మీరు అనుకుంటున్నప్పుడు మీ కొడుకు కోడలిమాట వినేస్తున్నాడని ఎందుకూ ఏడవడం?

రాంభా : అవునే ఏడుస్తాను. నీకేం. నాయిష్టం.

లక్ష్మి : అమ్మా వూరుకోవే. ఏమిటి వదినతో సమానంగా...

రాంభా : నువ్వు వాడికి చెల్లెలివే అన్పించుకుంటున్నావే వెర్రితల్లి! వాడు నీకోసం తెచ్చిన వంగపండురంగు గళ్ళచీర అది పుచ్చేసుకున్నా నీకు తెలియదు.

కమల : ఆహా! మరి అటువంటి

● "ఏం, దిగులుగా వున్నావ్?"

"మా ఆవిడ పుట్టింటికెళ్ళి రెండు నెలైంది. ప్రతి వుత్తరంలోను నేను రాత్రిళ్లు ఎక్కడికీ వెళ్ళటంలేదని, ఇంట్లోనే వుండి రాత్రి రెండింటిదాకా నిద్ర పట్టక పుస్తకాలూ అవీ చదువుకుంటూ కాలక్షేపం చేస్తున్నానని రాసేవాణ్ణి. రేపావిడ వస్తోంది."

"వస్తే ఏం?"

"ఏమిటేమిటోయ్ భగవాన్లూ. నిన్నొచ్చిన కరెంటు బిల్లులో రెండునెల్లకీ కలిపి ముప్ఫావలా అయింది."

చీరె ఇంకొకటి తెమ్మని ఆయన మీ చేతి కిచ్చిన పాతిక రూపాయలూ మీరు ఆ మధ్య వచ్చిన దొంగ సన్యాసికి కైంకర్యం చేసినా తెలియదు పాపం.

లక్ష్మి : వదినా ఒక్కక్షణం ఆగు. అమ్మా నువ్వు కూడా కొంతం ఓపిక పట్టు. ఆ... ...

మీ రిద్దరూ ఇలాగ ఆగకుండా ఎన్ని రోజులు దెబ్బలాడుకో గలరు ?

రాంభా : ఏం ? మాకు వోపిక వున్నంతవరకూ దెబ్బలాడు కుంటాం.

కమల : నీ కంత కష్టంగా వుంటే వెళ్ళి కాలేజీలోనే కూర్చో.

లక్ష్మి : అన్నయ్య ప్రస్తుతం చేస్తూన్న పనే అది. ఇంటి దగ్గర మీ కాకిగోల భరించలేక నే ఆలశ్యంగా వస్తున్నాడీ మధ్య.

రాంభా : మా కాకిగోల భరించ లేక వాడేమీ కష్టపడి పోడం లేదు. క్లబ్బులో కూర్చుని ఖుషీగా పేకాట ఆడుతూ వుంటాడు.

కమల : ఆయనకి క్లబ్బుకి వెళ్ళ డానికి తీరిక ఎక్కడుంటుంది పాపం. ఆఫీసులో ఆ బీద లేడీ టైపిస్టుని చూసి జాలిపడడం తోటే సరి పోతుంది.

లక్ష్మి : ఛ ఛ రాను రాను మీరంటే నాకు అసహ్యం వేస్తోంది. ఎందుకూ తీరికూర్చుని అర్థంలేని అపోహలు చేస్తారు? అన్నయ్య క్లబ్బులో కూర్చుని పేకాట ఆడడం నువ్వు చూశావా అమ్మా, లేకపోతే ఆఫీస్‌లో ఆ లేడీ టైపిస్టుతో వదిన చూసిందా? ఎందుకు అనవసరంగా కన్నకొడుకుమీద, కట్టుకున్న మొగుడిమీద అభాండాలు వేస్తారు?

రాంభా : అవును అభాండాలే! ఏం? వేళపట్టుని ఇంటికి రాక వాడక్కడ చేసే రాచకార్యం ఏమిటో?

కమల : కళ్లు కాయలుకాచేటట్టు ఎదురుచూడ్డమేకాని ఒక్క రోజైనా ఆయన త్వరగా ఇంటికి వచ్చారా?

లక్ష్మి : అవును. అన్నయ్యదే తప్పంతా! ఇంటికి రోజంతా ఆలస్యంగా రావడం అన్నయ్యదే తప్పు. మిమ్మల్నిద్దర్నీ ఇలా విచ్చలవిడిగా నోటికి వచ్చినట్టు వాగనియ్యడం అన్నయ్యదే తప్పు. మీ తప్పేమీ లేదు.

కమల : ఎప్పుడొస్తారా అని ఎదురు చూస్తూంటే టైమ్‌కి రాపోతే ఏమనుకోవాలి ?

రాంభా : లక్షా తొంభై అనుకుంటారు. మనం ఎన్ననుకున్నా వాడికేం! మగమహారాజు! వూరంతా వూరేగి ఎప్పుడో చేరుకుంటాడు ఇంటికి. వాడికిప్పుడు మనం జ్ఞాపకం వుంటామా ? ఇంటి దగ్గర మనం వాడికోసం ఇలా కాపలా కాస్తూంటామని వాడికేం తెల్సుపాపం।

కమల : లక్ష్మి నీకూ పెళ్ళయితే తెలుస్తుంది. మొగుడు వేళకి ఇంటికి రాకుండా షికార్లు కొడితే ఎలా వుంటుందో? ఏమనిపిస్తుందో? ఇంతే మగవాళ్ళు! బాధ్యత తెలియదు.

లక్ష్మి : అవును. మగాళ్ళకి స్వేచ్ఛ ఎక్కువ. వాళ్ళేం చేసినా అడిగేవాళ్ళు లేరు. అన్నిటికీ సర్దుకు పోవాల్సింది మన ఆడవాళ్ళే.

రాంభా : అంతేనే! తరతరాల్నించి, యుగయుగాల్నించీ మన ఆడవాళ్ళకి ఇలాగే అన్యాయం జరుగుతోంది అయినా మనం ఏమీ చెయ్యలేం!


కమల : ఆడది ఎంత చదువు చదివి, ఏం వుద్యోగం చేసినా పెళ్ళాం పెళ్ళామే! మొగుడు మొగుడే! ఆడది ఆడదే! మొగాడు మొగాడే!

లక్ష్మి : ఇంతే మగవాళ్ళు— అని మనం నోరు మూసుకుని వూరుకోవల్సిందేనా ? మహిళల్లో విప్లవం తీసుకొచ్చి మగవాళ్ళకి బుద్ధి చెప్పలేమా ?

రాంభా : చాల్చాలు ... ... నోర్మూయ్ ... ఎవరేనా వింటే నవ్వి పోతారు.

కమల : తిరుగుబాటు అనేది జరగని పని లక్ష్మి. మనలో ఐకమత్యం లేదు.

లక్ష్మి : మగవాళ్ళ అహంకారానికి ఆనకట్టు కట్టాలి. వనితలంతా కలిసి వుద్యమం లేవదియ్యాలి. ఇంటు గెలిచి రచ్చ గెలవమన్నారు. ముందు అన్నయ్యతో ప్రారంభిద్దాం.



రాంభా : ఒసే, కొంపదీసి నీకు పైత్యం చెయ్యలేదు కదా !

కమల : లక్ష్మికి కాదు పైత్యం చేసింది. మొత్తం మగవాళ్ళందరికీ పైత్యం చేసింది.

రాంభా : పిచ్చి కుదిరింది రోకలి తీసుకురా తలకి చుడతానన్నాట్ట వెనకటికి ఎవరో! అలాగ మీకు మతి లేకపోతే సరి. పిచ్చి వాగుడు కట్టిపెట్టండి.

(సుజాత కుడివైపులోంచి 'లక్ష్మి' అని పిలుస్తూ ఆదుర్దాగా ప్రవేశిస్తుంది.)

లక్ష్మి : ఏమిటి సుజాతా హడావుడి!

సుజా : లక్ష్మీ మీ అన్నయ్య ...

లక్ష్మి : ఇంకా ఆఫీస్ నుంచి రాలేదు.

కమల : ఎప్పుడొస్తారా అనే ఎదురుచూస్తున్నాం.

రాంభా : రాగానే కొన్ని ముఖ్య విషయాలు మాట్లాడాలి కూడా!

సుజా : కాదు లక్ష్మీ మీ అన్నయ్యకి ...

లక్ష్మి : ఊ... ... మా అన్నయ్యకి ... ఏమైనా కబురు చెప్పాలా?

సుజా : కాదే! మీ ... అన్నయ్యకి ... అన్నయ్యకి ఏక్సిడెంట్ అయింది.

రాంభా : హా! ఏక్సిడెంటే.

లక్ష్మి : అన్నయ్యకి ఏక్సిడెంటయిందా?

కమల : అయ్యో! ఏంజరిగిందో? ఎలా వున్నారో!

సుజా : ఏం భయంలేదు లేడి. ఆయనకేం పెద్ద దెబ్బలు తగల్లేదు.

రాంభా : హమ్మయ్య బతికించావ్. ఏక్సిడెంటనగానే నా పై ప్రాణం పైనే పోయింది. ఆ శ్రీరామ చంద్రమూర్తి చల్లగా చూశాడు అంతే చాలు.

లక్ష్మి : ఇంతకీ అన్నయ్య ఏడీ?

కమల : ఆయన ఎక్కడున్నారు?

సుజా : హాస్పటల్లో వున్నారు.

రాంభా : దెబ్బలుతగల్లేదన్నావు మళ్ళీ హాస్పటల్ అంటావు? అసలు జరిగిందేమిటో సరిగ్గా చెప్పు.

సుజా : మీ అబ్బాయి మెయిన్ రోడ్డులో అటుంచి ఇటు రోడ్డు దాటుతూండగా ఒక సైకిల్ రిక్షా వచ్చి గుద్దేసింది. మీ అబ్బాయికేమీ అంత దెబ్బలు తగల్లేదు కానీ ఆ రిక్షా వాడికి బాగా దెబ్బలు తగిలాయి.

రాంభా : అవును మరి. వళ్ళు పయి తెలియకుండా రిక్షా తొక్కితే దెబ్బలు తగలవూ !

లక్ష్మి : పాపం వాడికి పెద్ద దెబ్బలు తగిలాయా?

కమల : రిక్షా వాడి సంగతి ఎందుకు ? ఇంతకీ ఆయనేరి ?

సుజా : వాడికి మందు వేయించడానికి హాస్పటల్‌కి తీసుకువెళ్ళారు.

లక్ష్మి : పోనీలే మనందరి అదృష్టం బావుండి అన్నయ్య క్షేమంగా వున్నాడు. అంతేచాలు.

రాంభా : అంతా ఆ ఏడుకొండల వాడి చలవ. ఆ వెంకటరమణమూర్తి పేరు పెట్టబట్టి గండం గడిచింది.

కమల : అంత ప్రమాదం తప్పిందికదా ఆయన తిన్నగా ఇంటికి వచ్చేస్తే మన ప్రాణాలు ఎంత కుదుట పడతాయి.

సుజా : ఇంటికి వచ్చేద్దురు. కానీ—ఆ రిక్షావాడ్ని అలా వదిలెయ్యడానికి మనసొప్పక హాస్పటల్‌కి తీసుకు వెళ్ళారు. నేను సంగీతం మాష్టారి ఇంటినుండి తిరిగి వస్తూంటే ఈ ఖబురు ఇంట్లో చెప్పమన్నారు. అరగంటలో వచ్చేస్తాను, ఖంగారు పడొద్దన్నారు.

రాంభా : మంచిదమ్మా. ఏదో కబురు చెప్పావు. లేకపోతే వాడింకా రాలేదు, ఏమయ్యాడా అని తికమకపడి చచ్చేవాళ్ళం.

సుజా : నే వెళ్ళొస్తా లక్ష్మి ఇటువంటి కబురు మోసుకు వచ్చినందుకు ఏమీ అనుకోకు.

లక్ష్మి : ఛ ఛ నీ తప్పేం వుంది మధ్యలో. పెద్ద ప్రమాదమేమీ జరిగి పోలేదుగా.

కమల : అయినా ఇటువంటి కబురు ఇంకెప్పుడూ తీసుకు రాకమ్మా ...... వుత్తినే అన్నాను. ఏమీ అనుకోకు వెళ్ళిరా...

(సుజాత కుడివైపునుంచి వెళ్ళిపోతుంది.)

రాంభా : ఆ దిక్కుమాలిన రిక్షా వాడికి కట్టు కట్టించడం ఇంకా పూర్తయి వుండదా?

కమల : అక్కడ అందమైన నర్సులు వాడికి కట్లు కడుతూంటే పాపం ఆయనవాళ్ళకి సాయపడుతూ వుండి వుంటారు.

లక్ష్మి : మళ్ళీ మొదలుపెట్టారా మీ ఊహాగానం. వాడికి మందు వేయించి ఈపాటికి అరగంట అయి వుంటుంది.

రాంభా : అయితే మళ్ళీ క్లబ్బుకి వెళ్లి పేకాట ఆడుకుంటున్నాడేమో.

కమల : కాదు. ఆఫీస్‌కి వెళ్ళి ఆ బీద లేడీ టైపిస్టుని చూసి జాలి పడుతూ వుంటారు.

లక్ష్మి : మీరు నోరు పూరుకోక అలా అనుకుంటున్నారు. అన్నయ్య వచ్చేస్తూనే వుంటాడు.

రాంభా : ఆ వస్తూనే వుంటాడు. ఆ రంగు దారాలూ, పూసలూ,



అద్దాలూ ఎక్కడున్నాయో కనుక్కుంటూ.

కమల : గంటల పంచాంగం ఎక్కడుందో వెదుక్కుంటూ.

లక్ష్మి : అబ్బబ్బ. మళ్ళీ మొదలయ్యింది మీ యుద్ధం, అన్నయ్య వచ్చేలోగా మళ్ళీ అంతా ప్రారంభం.

కమల : ఆయన తిర్గ్గా వస్తూనే వుంటారు. మాకే వేరే పని లేక పోట్లాడు కుంటున్నాం. మొత్తానికి ఆయన మగబుద్ధి ఎక్కడికి పోతుంది.

రాంభా : వేళకి తిన్నగా ఇంటికి వచ్చే ఖర్మ వాడికేం పట్టింది. వాడికేం మగ మహారాజు!

లక్ష్మి : అవును. ఇంతే మగ వాళ్ళు! అన్నయ్య ఎప్పుడొస్తాడో కాని నేను మాత్రం మీ డ్యూయెట్లు వినలేను. పక్కింటి శాంతమ్మ పిన్నిగారింటికి వెళ్తున్నా. అన్నయ్య రాగానే పిలవండి.

(లక్ష్మి కుడి వేపు గదిలోకి వెళ్తుండగా శాంతమ్మగారు కుడి వేపు గదిలోంచి ప్రవేశించి లక్ష్మికి ఎదురౌతారు).

శాంతమ్మ : మా ఇంటి కెందుకు లక్ష్మీ. అక్కడికి కూడా ఈ హరికథే వినిపిస్తోంది. మా ఇంటికేకాదు మన వీధి మొత్తానికే వినిపిస్తోంది మీ ఇంట్లో హడావుడీ!

లక్ష్మి : అమ్మా, విన్నావా? వదినా! ఇప్పటికైనా తెల్సిందా?

మన ఇల్లు ఎంత ఆదర్శ ప్రాయంగా తయారవుతోందో!

కమల : అవును ఇరుగుపొరుగుకి వేరే పనిలేకపోతే సరి, మనమాటలే విన్పిస్తాయి.

రాంభా : కమలా, ఇష్టం వచ్చినట్టు పెద్దా చిన్నా లేకుండా ఏమిటా మాటలు ?

కమల : ఇందాకట్నించి పెంకులెగిరి పోయేట్టు దెబ్బలాడి ఇప్పుడు బుద్ధులన్నీ నాకు చెప్తారేం ?

రాంభా : దాని మాటలకేంగాని, రండి. పిన్నిగారూ, కుర్చోండి.

శాంతమ్మ : మీ కుటుంబ విషయంలో నేను జోక్యం కలుగచేసుకోకూడదు కానీ మీ కుటుంబం మీద వున్న అభిమానంకొద్దీ, మీ దగ్గరవున్న చనువుకొద్దీ ఒక విషయం చెప్దామని వచ్చాను పిన్నిగారూ.

రాంభా : చెప్పండి పిన్నిగారూ!... అంతకంటేనా ...

శాంత : ఎందుకు రోజూ సాయింత్రం మీ ఇంట్లో హోరాహోరి యుద్ధం జరుగుతుంది ?

కమల : ఎందుకా! ఆ మధ్య మీ ఇంట్లో మీరూ, మీ కోడలూ కలిసి మీ అబ్బాయి ఆఫీస్‌నుండి ఆలస్యంగా ఎందుకు వస్తున్నాడని నూ ఇదయి పోయేవారు చూడండి. అందుకని!

లక్ష్మి : ఏమిటి వదినా మరీ మర్యాద లేకుండా.

కమల : నీకు తెలియదు లక్ష్మి. నాకు అసలే వళ్ళు మండిపోతోంది.

లక్ష్మి : నీకే కాదు; ఈ మగవాళ్ళ నిర్లక్ష్యం, పొగరుమోత్తనం తల్చుకుంటే అందరికీ వళ్ళు మండుతుంది.

శాంతమ్మ : అయితే ఇది మగవాళ్ళ నిర్లక్ష్యం, పొగరుమోత్తనం అంటావు?

రాంభా : ... పిన్నిగారూ ... దేవుడే వాళ్ళకి ఆధిక్యం ఇచ్చాడని మగాళ్ళందరికీ పెద్ద బడాయిలెండి. మీకు తెలియని దేముంది లెండి, పిన్నిగారూ.

శాంతమ్మ : సృష్టిలో ఆధిక్యం ఎవరిదీ కాదు. అందరూ సమానమే. ఆడ-మగలో ఎవరు గొప్ప అనే ప్రసక్తి వస్తే పురుషుడికంటే స్త్రీయే గొప్పదని చెప్పవచ్చు. పురుషుణ్ణి కన్నతల్లిగా, స్వంత సోదరిలా, ఇల్లాలిగా ఆదరించి ప్రేమిస్తుంది స్త్రీ.

కమల : అవును. అందుకనే ఈ మగాళ్ళంతా అలా నెత్తికెక్కి కూర్చున్నారు.

లక్ష్మి : పురుషులతో సమాన హక్కులు సాధించి వాళ్ళతో సమానంగా వుద్యోగాలు చేస్తూన్న

ఈ రోజుల్లో కూడా స్త్రీలు ఇంకా ఇలా బానిసల్లా పడి వుండడం అన్యాయం.

రాంభా : మనల్ని కేవలం వంటింటి కోసం, పిల్లల్ని కనడం కోసమే సృష్టించాడు దేవుడు.

శాంతమ్మ : అలా అని మనల్ని మనమే లోకువ చేసుకుంటున్నాం. ఎంతటి పురుషుడికైనా మొదటి గురువు స్త్రీయే! పసిపాపగా ఎవరైనా మొదట నేర్చుకునే మాట — అమ్మ! అందుకే ఇంటికి దీపం ఇల్లాలే అన్నారు

కమల : ఇంత ప్రాధాన్యం వున్న స్త్రీకి నిజంగా కోపంవస్తే ఈ మగాళ్ళంతా ఒక్క రోజులో సన్యాసులయిపోతారు.

లక్ష్మి : అందుకనే మహిళంతా వుద్యమం లేవదీసి మనవిలువ మగవాళ్ళు గుర్తించేటట్టు చెయ్యాలి.

రాంభా : మగ – ఆడలో ఎవరు గొప్ప అనేది ఎప్పటికీ తెమలని సమస్య. ఎటొచ్చీ ఒకళ్ళ విలువ ఒకళ్ళు తెలుసుకుని ఎవరి బాధ్యతలు వాళ్ళు గుర్తిస్తేచాలు!

శాంత : మంచి మాటన్నారు పిన్నిగారూ... సంసారమనే బండి సాఫీగా సాగిపోవాలంటే ఒకళ్ళను, ఒకళ్ళు లాగకుండా ఇద్దరూ కలిసి తమ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తే చాలు. ఈ సత్యం గ్రహించక పూర్వం నేను మా కోడలు, మా అమ్మాయి మీలాగే మగవాళ్ళని ఆడిపోసుకుంటూ మాలో మేము కీచులాడుకుంటూ వుండేవాళ్ళం. కానీ ఇప్పుడు మా ఇల్లు నమూనా స్వర్గసీమలా హాయిగా వుంది.

రాంభా : ఇది అందరికీ తెలిసిన సత్యమే!, మీరు ఆచరణలో పెట్టారు. సుఖంగా వున్నారు. మేం కూడా ఇవాల్టినుండి ఆచరణలో పెడతాం.

కమల : అవును. వారు రాగానే కూర్చోపెట్టి వారి బాధ్యతలు వారికి, మన బాధ్యతలు మనకి వప్పగించుకుందాం..

లక్ష్మి : ఇలాగే అందరిళ్ళల్లోనూ అందరు మగవాళ్ళకి చెప్పేస్తే 'ఇంతే మగవాళ్ళు' అనే గొడవ లేకుండా పోతుంది.

శాంతమ్మ : శుభం! మరి నే వెళ్ళొస్తా పిన్నిగారు నమస్కారం

[శాంతమ్మ కుడివైపు వెళ్తుండగా — తెర.]

గమనిక : ఈ నాటికను ప్రదర్శింప కోరువారు నాకు తెలియచేస్తే సంతోషిస్తాను.

— రచయిత

□□□

స్మరియింపు మంతియే

పి. గణపతిశాస్త్రి

వెడలిపోదువుగాని, వెనుదిరిగి నిలిచి యీ
వీడుకోలిక సుంత వినిపొమ్ము నెచ్చెలీ!
తడవుకాబోదులే! ఎడద లోలో మాట
వేవేగ ఒకలిప్తలో విన్నవింతు లే!

కడసారి మనసార కరువుదీరగ నిన్ను
కనుగొందు నన్న, ఉప్పెన లయ్యె నశ్రువుల్
తడబడెను తలపోత, విడివడవు పెదవులీ
అడియాస ఒక్కటే సుడిదిరిగె నక్కటా!

పేరాసయేగాని, ప్రేమ పరమావధే!
నిరుపేదకింత పెన్నిధి యేల లభియించు!
ఊరకే తపియించి ఆరాట పడినంత,
దూరసుందర సుధాకరబింబ మందునా?

పరమ రమణీయ మొక నెరసంజ వెలుగులో
తరళతారకలమై వరలితిమి చాలులే!
మరల నెప్పుడయిన నెమ్మది నా నిమేషమ్ము
స్మరియింపు మంతియే! మరువకో ప్రియతమా!

ప్రయాణం

(గతసంచిక తరువాయి)

ఓ రెండంతస్థుల మేడదగ్గర బండి ఆపించారు. రాజారావు ఒక్క గెంతులో దిగాడు. ఆ అదుటుకి బండిలో ఉన్న మేము ఒక్క ఎగురుకి టాపుకి ఠక్కుమని కొట్టుకున్నాం. నేనూ సుధ బండిదిగి ఇంట్లోకి దారి తీశాం. వీళ్లుంటున్నది మేడ మీద భాగంలో. మెలికలు తిరిగిన మెట్లు మీంచి జాగ్రత్తగా నడుచుకుంటూ పోయాం పైకి. రాజారావు సూట్ కేస్‌తో మా వెనకాలే వచ్చాడు.

ఉంటున్నది రాజమండ్రిలో అయినా ఇల్లు చాలా అందంగా అలంకరించి పెట్టింది సుధ. గుమ్మాలకు అందమయిన తెరలూ, డ్రాయింగురూములో సోఫాలూ – వాటిమీద పువ్వులు కుట్టిన గలేబులూ, పక్కల్ని వాజుల్లో తాజా పువ్వులూ గోడలమీద ఒకటి రెండు వర్ణ చిత్రాలూ — చూడగా నేను తాతా వరణం హాయిగా అనిపించింది. ఓ సోఫాలో కూలబడ్డాను. సుధ లోపలికి వెళ్ళింది కాఫీ తీసుకొస్తానని చెప్పి, బల్లమీదున్న పత్రికలు చూస్తూ కూర్చున్నాను. ఆరిపోయిన చుట్టని వెలిగించుకున్నాడు రాజారావు.

సుధ కాఫీ పట్టుకొచ్చింది. స్టీలు గ్లాసుల్లో కాకుండా కప్పుల్లో పట్టుకొచ్చింది. కాఫీ తాగుతూ 'కప్పులు చాలా అందంగా ఉన్నాయి' అన్నాను.

'అంతకన్న కాఫీ ఘోరంగా వుందని స్పష్టంగా చెప్పొచ్చును కదా' నవ్వుతూ అన్నాడు రాజారావు. సుధ చిన్నబుచ్చుకుంటుందేమో నన్న భయంతో వెంటనే 'కాఫీ అద్భుతంగా ఉంది. కప్పులు కూడా తగినట్టు అందంగా ఉన్నాయని నా ఉద్దేశం' అన్నాను. సుధ నవ్వింది.

"మా పెళ్ళికి ఎవరో ప్రెజంట్ చేశారు వీటిని" అంది.

పెద్ద కథ

'అవునుగాని, మా పెళ్ళికి రాలే దేమిటి మీరు?' రాజారావు అడిగాడు.

'మీరు పిలిస్తేకదా!'

'ఊఁ, గట్టి చిక్కొచ్చి పడిందే... అయినా మీ స్నేహితురాలు పిలిస్తే నే పిలిచినట్టు కాదూ?' అన్నాడు.

'మా సుధ నన్నేమీ నిలదీసి అడగటం లేదు—నా పెళ్ళికి రాలే దేమిటని.'

'ఫరవాలేదు, పిట్ట కొంచెమయినా కూత ఘనమే' అన్నాడు నవ్వుతూ.

'ఏమిటండోయ్! మరీ చిన్న పిల్లని ఆడించినట్టు ఆడిస్తున్నారు దాన్ని' అంది సుధ నన్ను వెనకేసుకొస్తూ.

'చిన్న పిల్లకాదూ! 'మా రమ, మా రమ' అని నువ్వంటూంటే నీలాగే ఉంటుందనుకున్నాను' అని చేతుల్తో సుధ లావుని సూచించాడు.

ఈసారి సుధని వెనకేసుకు రావటం నా వంతయింది. 'మా సుధ ఇంతకుముందెంతో నాజూగ్గా ఉండేది. ఇప్పుడు సహవాస దోషం వల్ల అలా పాడైపోయిందిగాని!'

నా మాటలికి సుధ పకపకా నవ్వింది. రాజారావు మొహం ముడుచుకుంటాడనుకున్నాను — అతని స్థూల దేహాన్ని ఎత్తిపొడుస్తున్నందుకు, ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ లేచి పక్కగదిలోకి వెళ్ళిపోయాడు. హాయిగా సోఫాలో జార్లబడ్డాను.

'ఏం, హైదరాబాదు ఎందుకెళ్ళావ్?' సుధ అడిగింది.

'అమ్మ, నాన్నగారు అక్కడే ఉన్నారు. క్రిందటేడు నాన్నగారికి హైదరాబాదు బదిలీ అయింది. ఈ ఒక్క సంవత్సరంతో నా చదువయిపోతుంది కదా — మధ్యలో మార్చెందుకని నన్ను వాల్తేరులో పిన్ని వాళ్ళింట్లో ఉంచారు.'

'ఊరికే చూద్దామనే వెళ్ళావా, ఏదన్నా ఇబ్బందొచ్చిందా?'

'ఓ విధంగా ఇబ్బందే.'

ఏమిటేమిటంటూ గాభరాగా చూసింది సుధ.

'అమ్మనీ నాన్నగార్నీ ఎదిరించాల్సి వచ్చింది' అన్నాను బాధగా.

'సంబంధం చూశారా' అంది కన్నుగీటుతూ. అవునన్నాను. 'ఎవరతను' అని అడిగింది.

'డాక్టరు చంద్రశేఖరం అని మా నాన్నగారి స్నేహితుడి కొడుకు. తరుచు వస్తూ పోతూ ఉంటారు మా ఇంటికి. అక్కడ యూనివర్శిటీలో పని చేస్తున్నాడు.'

'మరెందుకొద్దన్నావ్? మనిషి బావుండడా?'

'అబ్బే, అదికాదు. అతన్ని పెళ్లి చేసుకోవాలన్న అభిప్రాయం నాకెప్పుడూ కలగలేదు. అదీకాక, మూర్తితో మొదట్నించీ నాకు పరిచయం. అతన్నే చేసుకోవాలని నిశ్చయించుకున్నాను; మూర్తి మన శాఖవాడు కాదు. పైగా హోదా కూడా తక్కువేనని అమ్మకీ నాన్నగారికీ అయిష్టత. ఈ రోజుల్లో కులాలే పట్టించుకోవటం లేదు — ఇక శాఖలంటూ మూర్ఖంగా కూర్చుంటే ఎలా?'

సుధ అంత ఉత్సాహం కనబరచలేదు.

'ఎంతయినా తల్లి తండ్రులు. మన మంచి ఆలోచించే చూస్తారుకదా. ఏ సంబంధమయినా వాళ్ళ మనసు నొప్పించకుండా ఉండాల్సింది' అంది.

'నా కేది మంచిదో నాకు మాత్రం తెలియదూ? — ఇంత వయస్సొచ్చాక. జీవితాంతం సహచరులుగా ఉండాల్సిన విషయంలో తగినవాణ్ణీ నచ్చినవాణ్ణీ ఎన్నుకునే బాధ్యత నేను తీసుకుంటే తప్పేముంది?' అంటూ నన్ను నేను సమర్థించుకున్నాను.

సుధ తేలిగ్గా నవ్వేస్తూ 'పోనీలే, ఎవరో ఒకరు — నీకు నచ్చితే నీ జీవితం సుఖంగా సాగుతుంది. అంతకన్న మీ వాళ్ళకు మాత్రం కావల్సిందేమిటి? — అలా అనుకుని సరిపెట్టుకుని ఉంటారు మీ వాళ్ళు.'

కాఫీ కప్పులు తీసుకుని లోపలికి వెళ్ళింది సుధ. రాజారావు బట్టలు మార్చుకుని వచ్చాడు. తెల్లని ధోవతి, ఖద్దరు లాల్చీ వేసుకున్నాడు. మొట్టమొదటిసారిగా 'మగవాడు ధోవతిలో కూడా అందంగా ఉండొచ్చును' అనుకున్నాను.

'ఏం, ఎలా ఉంది మా ఊరు' అన్నాడు కుర్చీలో కూర్చుంటూ.

'ఏదీ, ఇంకా చూపించందే ఏం చెప్పను?'

సుధని కేకేశాడు వెంటనే. ఏమిటంటూ కొంగుతో చెయ్యి తుడుచుకుంటూ వచ్చింది.

'మీ స్నేహితురాలికి ఊరు చూపించలేదని అలకొచ్చిందట.' కొంటెగా నవ్వుతూ అన్నాడు.

'చూశావా సుధా, అంతా కల్పన'

అబ్బూరి ఛాయాదేవి

"పోనీ, దానికేఁవుంది ? సాయం కాలంఅలాపుష్కరేవువైపుపోదాం. అక్కణ్నుంచి కావాలంటే మ్యూజియం అవీ చూసి రావచ్చు ... ఇప్పుడు మేటనీకి వెడదామా" అంది గారాం చేస్తున్నట్టు.

"చంపావు పో. ఇప్పుడే బట్టలు మార్చుకున్నాను. మళ్ళీ చచ్చి చెడి సూటూ బూటూ వెయ్యమంటే ఎలా?" దిగాలుగా చూశాడు రాజారావు.

"పరవాలేదు. ఈ డ్రెస్‌లోనే ఎక్కువ బావున్నారు – ఇలాగే పదండి" అన్నాను చటుక్కున. అనేశాక నాలిక్కొరుక్కున్నాను. రాజారావు మొహంకేసి మళ్ళీచూడకుండా చూపులు సుధవైపుకి మళ్ళించాను. సుధ అన్నం వడ్డించేస్తానంటూ వంటింటివైపు వెళ్ళింది. నేను సుధ వెనకాలే వెళ్ళాను. గ్లాసులతో మంచినీళ్లు పెట్టి పీటలు వేస్తానన్నాను. వినకుండా నన్ను రెక్క పుచ్చుకుని బలవంతాన ఓ పీటవేసి కూర్చోబెట్టింది. అన్నీ చకచకా సర్దేసి రాజారావుని రమ్మని పిలిచింది. భోంచేస్తున్నంత సేపూ అవీ ఇవీ నాకు మారొడ్డించమని సుధని చంపుకుతిన్నాడు. చీటికీ మాటికీ నా బక్కపలచదనాన్ని వెక్కిరిస్తూంటే నేను ఊరుకోలేదు.

"ఆయనకి ఇంకా శ్రద్ధగా వడ్డించు సుధా– మరీ నా తిండిచూసి మొహమాట పడుతున్నారు... మీ డోసు తగ్గించకండి– నేనేమీ అనుకోను లెండి" అన్నాను. పంతాలకుపోయి ముగ్గురం భుక్తాయాసంతో లేచాం.

సాయంకాలం ఆరున్నరకిసినిమా అయిపోగానే రామాటాకీసు నుంచి కాలినడకని బయల్దేరాం. మ్యూజియంకి వెళ్ళటం మానేసి 'అలా నడుస్తూ సరదాగా కబుర్లు చెప్పుకుంటూ పుష్కరేవుకి వెళ్ళాం. అక్కడ మర్రిచెట్టు దగ్గర చిన్న దేవుడి గుడి ఉంటే సుధ అటు దారి తీసింది.


"ఏమేవ్, అటు వెళ్ళకు ప్రమాదం" అన్నాడు రాజారావు. గాభరాగా చూశాం ఏమిటని.

"అక్కడ సాధువులున్నారే, చూసిందంటే మీ స్నేహితురాలు మళ్ళీ ఇంటికి రానంటుంది."

సుధ నవ్వుకుని ఇవతలి వైపు కొచ్చేసింది.

అతనిమీద ఎదురుదెబ్బ తీయటానికి అవకాశం కోసం కాచుక్కూచున్నాను.

బ్రిడ్జి స్తంభాల చుట్టూ చేరి కెరటాలు కొడుతూ నీళ్ళలో ఆడుతున్న పిల్లల్ని చూస్తూంటే నాకూ ఆ గోదావరిలో హాయిగా ఈతలాడితే



బావుండు ననిపించింది. ఒడ్డున నుంచుని కాసినినీళ్లు తీసుకుని మొహంమీద పోసుకుని, పాదాలు తడుపుకుని సంతృప్తిపడి ఇవతలికొచ్చేశాను. తరవాత ఆంజనేయస్వామి గుడికి వెళ్ళాం – కొబ్బరికాయలూ పువ్వులూపట్టుకునిలోపల దేవుడికి దణ్ణంపెడుతూంటే రాజారావు నా వైపు తిరిగి "ఏఁవని కోరుకున్నారు?" అన్నాడు.

"మీతో ఎందుకు చెప్పాలి?"

"నాకు తెలుసు మీరు చెప్పకపోయినా."

"ఏఁవిటి చెప్పండి చూద్దాం."

"మొగలీ పువ్వంటీ మొగుణ్ని వ్వవే..." అంటూ రాగం తీశాడు.

"ఛీ, నాకు మొగలిపువ్వంటే పరమ అసహ్యం". ఇదెక్కడి పిల్లరా బాబూ అనుకున్నట్లు భుజాలు ఒక్క విరుపు విరిచి అవతలికి వెళ్లిపోయాడు.

దారిలో, హొటల్లో భోంచేద్దామన్నాడు— అప్పుడు వెళ్లి ఇంట్లో సుధ చేత వంట చేయించటం ఎందుకని. సుధ సంతోషించింది.

భోంచేసి నడుచుకుంటూనే ఇంటికి చేరుకున్నాం. రాత్రి తొమ్మిది దాటిపోయింది. అలిసిపోయాను నడిచి నడిచి. "పేకాడుకుందామా" అంది సుధ. "నిద్ర వస్తోంది, వద్దన్నాను. డాబామీద ముగ్గురికీ పక్కలు వేసింది. కాస్సేపు కబుర్లు చెప్పుకున్నాం—మధ్యాహ్నం చూసిన సినిమా గురించి. ఉన్నట్టుండి "చలేస్తోంది" అని రాజారావు ఇంట్లోకి వెళ్ళిపోయాడు.

నేను మగతగా కబుర్లు కొనసాగించాను. మరి కొంతసేపటికి సుధ కూడా లోపలికి వెళ్ళిపోయింది.

దూరంనుంచి నైట్‌క్వీన్ పరిమళం గాలి వీచినప్పుడల్లా వచ్చి డాబా అంతా వ్యాపిస్తోంది. మావయ్య పడగ్గది పక్కన ప్రత్యేకం నాటించిన నైట్‌క్వీన్ మొక్క ఈ పాటికి బాగా ఎదిగి ఇలాగే పరిమళాన్ని వెదజల్లుతూ ఉండి ఉంటుంది. తాతయ్యగారింట్లో వేసవికాలం పొగడచెట్టు కింద పక్కలువేసేవారు. సెలవులికి వెళ్ళినప్పుడు రోజూ పొద్దున్నే లేచి నా పక్కమీద ఎన్ని పూలు రాలినవో లెక్కపెట్టుకునే దాన్ని. ఇప్పుడు పొగడపువ్వులమీద అంత మోజు లేదు. సన్నజాజిది చక్కని పరిమళం. నాజూకైన పువ్వు. నాజూకైన పరిమళం.

మత్తుగా ఒత్తిగిలాను.

సన్నజాజి సౌరభం ... సన్నాయి... కొబ్బరి చెట్లు ... తాటాకు పందిరి ... పట్టుచీరల గరగరలు... మండువాలో పేరంటాళ్ళు. ముత్తయిదువులకు పసుపు రాస్తోంది వదిన. ఎవరో గంధం పూస్తున్నారు. మామయ్య కూతురు శశి పన్నీరు జల్లుతోంది. నాకు పిన్ని పూల జడ వేస్తోంది. సన్నజాజులు గుచ్చుతోంది. మధ్య మధ్య కనకాంబరాలూ మరువం వేస్తే బావుంటా యంటోంది. మరే పువ్వులూ కలపొద్దన్నాను. జడ ఇంకా సగం కూడా కాలేదు. పురోహితుల కేకలు — 'తొరగా తెమలండి' — 'అమ్మాయిని తీసుకురండి' — సన్నజాజుల పోగు తరగటంలేదు. బావ మొగలి పువ్వులు పట్టుకొచ్చాడు. కత్తిరించి జడమీద కుట్టమన్నాడు. వద్దన్నాను. చాలా బావుంటుంది — పెట్టించుకోమన్నాడు. వద్దన్నాను మళ్ళీ. కావాలంటే వాసన చూడు — ఎంత బావుందో అన్నాడు. బాబోయ్, నా దగ్గిరికి తీసుకురాకు — నాకసహ్యం — కళ్ళు మూసేసుకున్నాను. బావ పట్టుదల వదల్లేదు. ముక్కు దాకా తీసుకొచ్చాడు. పిన్ని చేతుల్లోంచి జడ ఒదిలించుకుని దూరంగా పరిగెట్టాను. ముత్తయిదువులంతా నవ్వుతున్నారు. బావ మొగలిపువ్వుతో నా దగ్గిరికొస్తున్నాడు. నేను వెనక్కి వెనక్కి పరిగెడుతున్నాను. బావ మొగలి పువ్వుతో మీది మీది కొస్తున్నాడు. ఇంక వెనక్కి వెళ్ళటానికి చోటు లేదు. గోడ అడ్డుకుంది. బావ మొగలి పువ్వుని మొహంమీద పెట్టాడు. బుగ్గలకి తగిలి గీరు



కున్నాయి. మొగలి ఘాటుకి ఊపిరి సలపలేదు. ముళ్ళు గుచ్చుకుంటున్నాయి. బావ వేడి ఊపిరికి తల తిరిగినట్లయింది. ఎదిరించే శక్తి సన్నగిలింది. జడలో సన్నజాజులు గోడకి రాసుకుని నలిగి రాలి పడ్డాయి. కోపంలో ఒక్క తోపు తోశాను — బలాన్ని కూడగట్టుకుని. ఆ కుదుపుకి మెలుకువొచ్చింది. కళ్ళు తెరిచి చూశాను.

బావ కాదు – మొగలి పువ్వు కాదు – ఎదురుగా రాజారావు. బుసలు కొడుతున్నట్లు ఊపిరి ఒగుర్తున్నాడు. నా చేతులు రెండూ మంచానికి అదిమిపెట్టి ఉన్నాయి. అరిచాను. నా గొంతు నాకే వినిపించలేదు. నా నోటి మీద మరో నోరు. ఘాటైన చుట్టవాసన. తల తిరిగిపోయింది. నా ఆపాదమస్తకాన్నీ అదిమిపెట్టిన ఆ బరువుని తోసే శక్తి నాలో లేకపోయింది, నా అసహాయత్వానికి కళ్ళ నీళ్ళు తిరిగాయి. సుధ వస్తే బావుండును అనుకున్నాను. పిలవబోయాను. మళ్ళీ నా నోటి మీద నోరు. గుండెలమీద బరువు. కడుపులో దేవినట్లయింది. కాళ్ళు విరిగిన స్తంభాల్లా పడి ఉన్నాయి. నా వెన్నెముక కరిగిపోయినట్లుంది. ఉన్నట్టుండి నా మీది బరువు తొలిగిపోయింది. ఆ బరువు నానుంచి దూరంగా నడిచి

● జబ్బుపడ్డ షావుకారు మరణశయ్యమీద వున్నాడు. చుట్టూ కొడుకులు, కోడళ్లు, పెళ్ళాం అంతా మూగివున్నారు. షావుకారు కళ్లు తెరిచాడు.

"రాముడేడీ?" అని అడిగాడు.

"ఇక్కడే వున్నా నాన్నా" ఏడుస్తూ అన్నాడు పెద్ద కొడుకు.

"నారాయణ?"

"ఇదుగో నీ కాళ్ళ దగ్గిరున్నా" అని దుఃఖం దిగమింగుతూ అన్నాడు రెండో కొడుకు.

● "కేశవులు?"

"ఇదుగో ఇటు. అంతా ఇక్కడే వున్నాం నాన్నా" అంతా కళ్ళు తుడుచుకుంటున్నారు.

హఠాత్తుగా ముసలాడు గర్జించాడు. "అంతా ఇక్కడే వుంటే దుకాణంలో ఎవరున్నట్టు?"

పోయింది. పోతూ పోతూ నాశక్తి నంతా కూడగట్టుకుపోయినట్టుంది. నీరసం ఆవరించింది. వంటి మీదికి గాలి చల్లగా వీచింది. అయినా అలాగే చలన రహితంగా మంచాన్ని అంటిపెట్టుకుని ఉండి పోయాను. ఆకాశంవైపు చూశాను. చంద్రమామ పాలిపోయినట్లు కనిపించింది. చుట్టూ నక్షత్రాలు బిక్కు బిక్కు మంటున్నాయి.

జరిగిన సంఘటనని మనస్సు మెల్లి మెల్లిగా పునశ్చరిం చుకుంటోంది. పువ్వుల గురించి ఆలోచిస్తూంటే ఎప్పుడు నిద్రపట్టిందో తెలియదు. పీడకల — దాని వెనక రాజారావు — చలిగాలి, ఒళ్ళంతా

జలదరించింది. జాకెట్టు బొత్తాలు పెట్టుకున్నాను. చీర మోకాళ్ళ క్రిందికి లాక్కున్నాను. ఒణుకు కొంత తగ్గింది. మళ్ళీ మనస్సులో ఆలోచనలు—

'నాకెందుకు జరిగిందిలా? నే నింత అబల నెలా అయిపోయాను?' కళ్ళనిండా నీరు నిండి రెండు కనుకొలకుల్లోంచీ జారి చెంపలూ చెవులూ తడిశాయి. కోపం, ఆవేశం, బాధ, భయం, జాలి, అసహ్యం — ఒక్కసారిగా అనుభవించాను. 'నాకెందుకు జరిగిందిలా?' నా మూగ ప్రశ్నకి జవాబు చెప్పటాని కక్కడెవరూ లేరు—ఆకాశం క్రింద నేను తప్ప. తెల్లవారకుండా ఉంటే బావుండు ననుకున్నాను. గోడదూకి ఆత్మహత్య చేసుకుందా మనుకున్నాను. పారిపోయి గోదావరిలో దూకుదామా అనుకున్నాను. చీరకొంగుతో ఉరిపోసుకుందామా అనుకున్నాను. ఏదీ చెయ్యలేదు. మంచాన్ని అంటిపెట్టుకుని అలాగే ఆకాశంవైపు చూస్తూ కర్తవ్యం తోచక ఆలోచిస్తూ ఉండిపోయాను. అలసటలో ఎప్పుడు నిద్రపట్టిందో తెలియదు.

ఎండ కళ్ళలో పడగానే మెలుకువొచ్చింది. చటుక్కున లేచబోయాను. ఒళ్ళంతా బడలికగా చచ్చుగా ఉన్నట్లనిపించింది. జరిగిన సంఘటన కళ్ళకుకట్టినట్లయింది. లేవబుద్ధి కాలేదు. లేస్తే అతను కనిపిస్తాడేమో! సుధ మొహాన్ని ఎలా చూడను! నా మొహాన్ని నే నెలా చూసుకోను? ఏం చెయ్యాలో ఎలా ప్రవర్తించాలో అర్థంకాక అలాగే కళ్ళుమూసుకు పడుకున్నాను. మూర్తి మనస్సులో మెదిలాడు. మూర్తి - ప్రేమ - వివాహం - అన్నీ అకస్మాత్తుగా అపరిచితంగా తోచాయి. బావి జీవితమంతా అస్పష్టంగా పొగమంచు కమ్మినట్లుగా ఉంది. ఈ సంఘటన నా మనః ప్రవృత్తిలో నే నింతకుముందు ఊహించని పరిణామాన్ని తెస్తున్నట్లు తోచింది. నే నిదివరకటిదాన్ని కాదిప్పుడు - శారీరకంగా గాని, మానసికంగా గాని ఈ మార్పు నా జీవనాన్ని ఎలా తీర్చిదిద్దుతుందో తెలియదు. మూర్తి ప్రేమ నిన్నటివరకూ సజీవరూపంలో నా ఎదుట నిలిచింది. ఈ రోజు బుద్బుదమై గాలిలో తేలి నానుంచి

● జీవితంలో విజయం పొందడానికి చాలా ఉపాయా లున్నాయిగాని మనం పని చెయ్యందే అవి పని చెయ్యవు.

దూరమై పోతున్నట్లు తోస్తున్నది. ఎప్పుడు బుద్బుదం అదృశ్య మవుతుందో తెలియదు. నిన్నటికీ ఈరోజుకీ ఎంత భేదం! ఇలా జరక్కపోయి ఉంటే?— నిన్న అనుకున్నాను—' వాల్తేరు వెళ్ళగానే విజయగర్వంతో మూర్తిని పిలుస్తాను. 'అమ్మ, నాన్నగారూ, అడ్డు చెప్పినాసరే శేఖరాన్ని కాదని నీ దగ్గరికి వచ్చాను మూర్తీ' అంటాను. మూర్తి ఆనందంతో ఉప్పొంగిపోయి తన బాహు బంధనలో నన్నుక్కిరిబిక్కిరి చేస్తాడు...' ఇప్పుడు! — వాల్తేరు వెడతాను. మూర్తిని కలవకుండా ఉండటానికి ప్రయత్నిస్తాను. మూర్తి మొహం చూడలేక తప్పించుకు తిరుగుతాను. ఓ రోజున మూర్తి కలుస్తాడు. చెబుతాను. 'మూర్తీ, వస్తూ వస్తూ దారిలో నా శరీరాన్ని మలినం చేసుకు వచ్చాను' అని. మూర్తి ఏమంటాడు? ఎలా ప్రవర్తిస్తాడు? నన్ను అసహ్యించుకుంటాడా? అవును. ఎందుకు అసహ్యించుకోకూడదు? నా అబలత్వానికీ నా అశక్తతకీ నా బుద్ధిహీనతకీ నన్ను ఛీత్కరించుకుంటే ఆశ్చర్యమేఁవుంది? నా మీద నాకే అసహ్యంగా ఉంది. ఇప్పుడు నాకేఁవిటి శిక్ష? ఎవరు విధిస్తారు నాకు తగిన శిక్ష? నాకు నేనే విధించుకోనా? ఏం శిక్ష విధించుకోను? ఓ భగవంతుడా! మాట్లాడవేం? నీ మౌనమే నాకు శిక్షా?

"రమా, లేస్తావా, కాఫీ తీసుకుందుగాని" అంటూ సుధ నన్ను మృదువుగా తట్టి లేపింది. కళ్లు తెరిచి చూశాను. సుధ మామూలుగానే ఉంది. పక్కమీంచే లేచాను. చెంపలకి కట్టిన కన్నీటి చారలు కనిపిస్తాయేమోనని కొంగు తీసి తలచుట్టూ కప్పుకున్నాను. వాచిన కళ్ళు కనిపించకుండా కళ్ళజోడు సమయానికి నన్నాదుకుంది. సుధ నా మొహంలోని మార్పుని గమనించినట్లు లేదు. సుధకి తెలియదన్నమాట. తెలిస్తే? పక్క సర్దటం మొదలుపెట్టాను.

"వద్దులే, పనిమనిషి సర్దుతుందిలే. నువ్వు లోపలికి పద" అని, లోపలికి దారి తీసింది. మౌనంగా అనుసరించాను. లోపలికి వెళ్ళాక చెంబుతో వేణ్ణీళ్ళు అందించింది. నా చేతిసంచీలోంచి బ్రష్షూ పేస్టూ అవీ తీసుకున్నాను. పళ్ళు తోముకున్నాక మొహం వేణ్ణీళ్ళతో కడుక్కుంటూంటే బుగ్గలు మండాయి. నోట్లో కొత్త వాసన ఇంకా అలాగే ఉన్నట్లనిపించి, భళ్ళున డోకొచ్చినట్లయింది. వికారానికి కళ్ళ నీళ్ళు తిరిగాయి. మొహం తుడుచుకుని లోపలికి వెళ్లాను. కాఫీ గ్లాసుతో సిద్ధంగా ఉంది సుధ. మాట్లాడక పుచ్చుకున్నాను. ఏం మాట్లాడాలో, ఎలా మొదలు పెట్టాలో తెలియదు. ఏమీ జరగనట్లు ఎలా దులుపుకుని మామూలుగా ఉండాల్లో అర్థం కాలేదు. నేను మామూలు మనిషినయేట్లు హఠాత్తుగా ఏదన్నా జరిగితే బావుండునని అనుక్షణం అనుకున్నాను. పోనీ సుధ మాట్లాడదేం? తెలుసునా? తెలిస్తే ఎందుకు ఊరుకుంది? ముందే తెలుసా? తరవాత తెలిసిందా? ముందే తెలిస్తే ఎలా ఒప్పుకుంది? తరవాత ఎలా తెలిసింది? సుధ ఏమన్నా అంటే బావుండును అనుకున్నాను.

"ఉప్మా చేశాను తింటావా?" అంది. "ఊఁ" అన్నాను. చచ్చేటంత నీరసంగా ఉంది. తినాలనిపించింది. ఆశ్చర్యపోయాను — అంత జరిగాక కూడా తిండిమీదకి దృష్టి ఎలా పోయిందని. పొగలు కక్కుతూన్న ఉప్మా ప్లేటులో పెట్టి పట్టుకొచ్చింది.

"నువ్వు తీసుకోవూ?" అన్నాను.

"ఆయనతో కలిసి తీసుకున్నాను ఇందాకనే". అంటున్నప్పుడు మామూలుగా భర్తమీద ఎప్పటి భక్తి వాత్సల్యాలే ధ్వనించాయి. సుధకి ఏఁవీ తెలియదా? తెలియకపోతే నేను చెప్పాలో వద్దో తెలియలేదు. మౌనంగా ఉప్మా తిన్నాను. సుధ కూర తరుక్కుంటోంది. నేను మౌనంగా ఉన్నానేమని కూడా అడగలేదు. అంటే నేను మామూలుగానే కనిపిస్తున్నానా! నా ఆత్మనిగ్రహానికి నన్నే అభినందించుకున్నాను.

టైము చూసుకున్నాను. తొమ్మిదయింది. ఆశ్చర్యం వేసింది— అంతసేపు ఎలా పడుకున్నానా అని. ఇంక గంటున్నర టైముంది రైలుకి.

"టైమవుతోంది. స్నానం చేస్తాను సుధా."

"అలాగే. నువ్వు తెమిలే లోపల నేనూ వంట పూర్తి చేసుకుంటాను. ఫోంచేసి స్టేషనుకి వెళ్లొచ్చును ఇద్దరం."

● మేనేజరు ఒక గుమాస్తాని పిలిచి అడిగాడు: "ఇదుగో రామారావ్! కంపెనీ నష్టంమీద నడుస్తోంది. ముగ్గురు గుమాస్తాల్ని తీసేద్దామనుకుంటున్నాను. ఇంకో ఇద్దరి పేర్లు చెప్పు".

"ఎందుకు సుధా నీకు శ్రమ. నేను వెళ్ళగలను.

"బాగుంది! ఒక్కర్తెని ఎలా పంపించమన్నావ్? ఆయనకి ఏదో అర్జంటు పని ఉందని వెళ్ళారు. వీలైతే అట్నుంచి స్టేషనుకి వస్తానన్నారు. మనిద్దర్నీ వెళ్ళమన్నారు ఫోం చేసి."

వేణ్ణీళ్ళు తోడిపెట్టింది స్నానానికి. స్నానం చేస్తూంటే జుగుప్స కలిగింది. నా దేహం నాకే పరాయిదిగా తోచింది. రాజారావు స్పర్శ తలపుకొచ్చి తేళ్లూ జెర్రులూ పాకినట్లనిపించింది. ఈ పైపై ప్రక్షాళనం ఉత్త దండగ అనిపించింది. ఎలాగో నాలుగు చెంబులు నీళ్ళు పోసుకుని చీర చుట్టబెట్టుకుని బయటి కొచ్చాను.

తల దువ్వుకుని బొట్టు పెట్టుకుని వచ్చేటప్పటికి రెండు కంచాల్లో అన్నం వడ్డించింది సుధ. కూర్చున్నానన్న మాటేగాని ఒక్క ముద్ద నోట్లో పెట్టుకోబుద్ధి కాలేదు.

"అదేఁవిటి, వంట బాగుండ లేదా?" అని నొచ్చుకుంది సుధ.

"కాదు, ఆకలిగా లేదు" అని లేచాను.

ఇల్లంతా సర్దుకుని సుధ కూడా సిద్ధమయింది. ఇద్దరం రిక్షా మాట్లాడుకుని స్టేషనుకి బయలుదేరాం. రిక్షా వెడుతున్నంతసేపూ నేనేం మాట్లాళ్ళేదు. రోడ్డు వైపున దుకాణాల్నీ చూస్తూ కూర్చున్నాను. మౌనంగా కూర్చున్నానన్న స్పృహ మాత్రం మనస్సుని కెలుకుతూనే ఉంది. సుధతో పొద్దుటి నుంచీ ఏం మాట్లాడాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. నిన్నటిలా చనువుగా తేలిగ్గా మాట్లాడ్డానికి వీలవటం లేదు. సుధకీ నాకూ మధ్యన రాజారావు గోడలా నిలిచాడు.

"రమా, మళ్ళీ ఎప్పుడొస్తావ్?" అంది హఠాత్తుగా.

"మళ్ళీనా?" నా గొంతు ఎలా ధ్వనించిందో నాకే తెలియదు. అలా ఎందుకు రెట్టించానో — అనాలోచితంగా అలా ఎందుకన్నానో? సుధ చటుక్కున నా చేతులు రెండూ పట్టుకుని "నన్ను క్షమించు" అంది. సుధ మొహం పాలిపోయింది. ఆ క్షణంలో సుధని చూస్తే జాలేసింది.

"ఛీ, అదేఁవిటి, మధ్య నువ్వేం చేశావ్?" అన్నాను తేలిగ్గా కొట్టి పారేస్తున్నట్టు. ఆ క్షణంలో ఒకరి నొకరం అర్థం చేసుకున్నట్లుగానూ, ప్రపంచంలోని సమస్యలన్నీ పరిష్కృత మయి పోయినట్లుగాను తోచింది.

స్టేషనుకివెళ్ళగానే కనుక్కుంటే రైలు గంట లేటని చెప్పారు. ఆ గంటసేపూ సుధతో ఎలా గడపటంవా అని చిరాకు పడ్డాను. కొంతసేపు ప్లాట్‌ఫామ్‌మీద మౌనంగా ఇటూ అటూ తిరిగాం. ఉన్నట్టుండి సుధ అలా రా, రమా, అక్కడ కూర్చుని మాట్లాడుకుందాం" అంది. ఇద్దరం ప్లాట్‌ఫామ్ చివరగా వెళ్ళి ఇనప కటకటాల పక్కగా ఇసకమీద కూర్చున్నాం—జనానికి దూరంగా. నేనేమీ మాట్లాళ్ళేదు. చేతి సంచీ తాడు మెలిపెడుతూ కూర్చున్నాను. సుధే మొదలు పెట్టింది.

"ఇప్పుడేం చెయ్య దలుచుకున్నావ్?" తల వొంచుకుని గులక రాళ్లు పోగుచేస్తూ అడిగింది.

"నువ్వే చెప్పు" అన్నాను ఒక నవ్వు నవ్వి — ఆరిపోయే ముందు దీపం భగ్గుమని వెలిగే వెలుగులాంటి నవ్వు.

"నిన్ను అన్యాయం చేశాను... నీకు అన్యాయం చేశాను. నీ కింత అన్యాయం జరుగుతుందనుకోలేదు."

అబ్బ, చాల్లేదూ, ఈ కబుర్లకేఁవిటి– అనుకున్నాను.

"ఆయన కదొక్కటే లోపం..."

సుధ కళ్ళలోకి చూశాను. అల్లరి చేసే ... డుకు గురించి తల్లిపడే బాధ సుధ కళ్ళలో కనిపించింది.

"మళ్ళీ నాకే విధమయిన లోటూ రానివ్వరు–డబ్బులోగాని నిత్యావసరాల్లోగాని– దేనిలోనూ కించిత్తు లోటు రానివ్వరు. నాకు రవంత బాధ కలగనివ్వరు..."

- భగ్నప్రేమికుడు జీవితంమీద విరక్తిచెంది రైలుక్రిందపడి ఆత్మహత్య చేసుకుందామని పట్టాల కడ్డంగా పడుకున్నాడు.
దారినపోయె దానయ్యొకడు ఈ వరసచూసి "నీకేం కష్టకాలమయ్యా! రైలుపట్టాల కడ్డంగా పడుకున్నావు?" అని పరామర్శించాడు.

"ఆత్మహత్య చేసుకోబోతున్నాను"

"అయితే ఆ పక్కన పెద్ద సంచిలో ఆ వేరుశెనక్కాయలు కూడా ఎందుకు?"

"ఏమో! ఈ వెధవ రైళ్లు ఓ పట్టాన వచ్చేడిశాయా! ఆ వచ్చే లోపల ఆకలితో మాడి చావకుండా ఉండేందుకు ఇవి కూడా తెచ్చుకున్నా."

అయ్యో పిచ్చిదానా- అనుకున్నాను.

"నిజం రమా, మా కాపురం విషయంలో కూడా నన్నేవిధంగానూ అశ్రద్ధ చెయ్యరు. కాని, అదొక్కటే ఆయనకున్న లోపం..."

చాలదూ!- అనుకున్నాను.

"మాది ప్రేమ వివాహం కాదు. పెద్దవాళ్లు చూసి చేసిన సంబంధమే. కాని ఆమాటకొస్తే మాది "తొలి చూపుల్లో ప్రేమ" అని చెప్పొచ్చు. నన్ను తప్ప మరెవర్నీ పెళ్ళిచూపులు చూట్టానికి వెళ్ళలేదాయన. నన్ను చూడగా నే ఒప్పుకున్నారు. మా వాళ్ళు తగినంతగా కట్నం అదీ ఇవ్వలేరని ఆయన తల్లిదండ్రులు వెనకదీస్తూంటే ఆయన కాదూకూడదని పట్టుపట్టి మరీ చేసుకున్నారు నన్ను..."

రాజారావు గురించి నా అనుభవం, అభిప్రాయం వేరు. అటువంటి వాడి గురించి భక్తి వాత్సల్యాలతో సుధ చెప్పుకుపోతూంటే నేనేమనను? మాట్లాడక వింటున్నాను.

"స్వల్ప విషయంలోనైనా నన్ను నిర్లక్ష్యం చేస్తే నేను నిస్పృహ చెందిపోతాను. ఆత్మ విశ్వాసం నశించి పోతుంది. ఆయన్ని పదే పదే అడుగుతాను—నన్ను ప్రేమిస్తున్నారా, నేనంటే మీకు ప్రేమేనా—అని. నేనడిగినప్పుడల్లా ఆయన నన్ను దగ్గిరికి తీసుకుని "నేను వందమంది ఆడవాళ్ళతో పోయినా సరే మళ్ళీ నీ దగ్గిరికే వస్తాను. నువ్వు లేకపోతే పిచ్చెత్తిపోనూ" అంటారు. ఇలా అని ఒకసారి కాదు—కొన్ని వందలసార్లు అన్నారు. నా మీద అంత ప్రేమ, పిచ్చి ఉంటే వందమందితో పోవటమెందుకని నేను అడక్కపోలేదు..."

సరిగ్గా నా నోటి చివరదాకా వచ్చింది—అలా అడక్కపోయావా— అని సుధతో అందామని. ఫరవాలేదు. అడిగిందన్నమాట. మరేమన్నాడు? కుతూహలంగా సుధ వైపు చూశాను.

"..." అన్నం తినకపోతే చచ్చిపోతాము. అలాగని చిరుతిళ్లూ అవీ తినకుండా ఉంటామా? ఏదైనా కొత్తగా స్వీటు కనిపిస్తే తినాలనిపించదూ? అలాగని ఎన్ని చిరుతిళ్లు తింటే మాత్రం అన్నం తినకుండా ఉండగలమా" అన్నారు. నిజమే అనిపించింది నాకు. సంఘానికీ కట్టుబాట్లకీ వెరిచిగాని — అలా తిరిగితే తప్పేముంది అనుకున్నాను. నన్ను ప్రేమించటం మానరనీ నన్నొదిలిపెట్టరనీ నమ్మకం కుదిరింది నాకు. ఆయన మీద పరిపూర్ణ విశ్వాసం ఉంది నాకు..."

[ఇంకా వుంది]




[గత సంచిక తరువాయి]

22

హాస్పిటల్ వెయిటింగ్ రూంలో డాక్టర్ గిరిధర్ కుమార్ అధ్యక్షత క్రింద "హౌస్ సర్జెన్స్" సమావేశం ఏర్పాటు చేయబడింది. వేణు వుపన్యసిస్తాడు.

"కలరాతో ప్రజలు చస్తున్నారని, వార్తా పత్రికల్లో చదివి, అందరిలాగే మనం కూడా "అయ్యో! పాపం! అని వూరుకోవడం ధర్మం కాదు. కలరా వ్యాధి వ్యాపించడానికి యీ తేమతో కూడుకున్న వాతావరణం చాలా అనుకూలంగా వుందని, సకాలంలో ఈ వ్యాధిని అరికట్టకపోతే, తర్వాత దుస్సాధ్యమౌతుందని హెచ్చరికలు వస్తున్నాయి. ఇప్పటికే వ్యాధి తీవ్ర రూపం దాల్చింది. ఎనిమిది రోజుల్లో 382 మందిని పొట్టబెట్టుకుంది. 15 రోజుల్లో యిప్పుడు కలరా ముమ్మరంగా వున్న మాధవపురంలో మారేడమ్మ తీర్థం జరుగబోతుంది. అనాదిగా దైవ కార్యాలన్నా పుణ్యక్షేత్రాలన్నా, తీర్థాలన్నా, మన పల్లె ప్రజలకి భక్తి వుత్సాహాలెక్కువ. కలరాకి భయపడి, సాంప్రదాయ సిద్ధంగా వస్తున్న తీర్థానికి రావడం మానేసే వాళ్ళుచాలా తక్కువ. "ఆ మారేడమ్మ తల్లిదయఎలాగుంటే అలాగే జరుగుతుందని మొండి ధైర్యంతో వస్తారు అందరూ. అప్పటికి కాని యీ కలరా వ్యాధి తగ్గగపోయినట్లయితే, తీర్థప్రజలద్వారా జిల్లా అంతావ్యాపిస్తుంది. అప్పుడు వ్యాధిని అరికట్టడం కష్టతరమై పోతుంది.



"అందుచేత యీసమయంలో మనంవెళ్ళి ఆపల్లె ప్రజలకి సహాయం చేస్తే, సకాలంలో సేవచేసిన వాళ్ళమవుతాం, యిది మనకి కనీస విద్యుక్త ధర్మం. వెళ్ళడానికి అధమ్మం ఎనమండుగురైనా సిద్ధంగావుంటే, మనహాస్పటల్ తరపున ఒక "మెడికల్ స్క్వాడ్"ను పంపించడానికి మన సూపెర్నెంట్‌గారు కూడా ఒప్పుకున్నారు. నా విజ్ఞప్తికి సహృదయులు సహకరిస్తారని విశ్వసిస్తూవిరమిస్తున్నాను"

వేణు ప్రసంగం విన్న తర్వాత హౌస్ సర్జన్లమధ్య యీ వుద్యమానికి సుముఖంగా గుసగుసలు ప్రారంభమయ్యాయి. ఇదంతా గమనించి, డాక్టర్ గిరిధర్ లేచి మాట్లాడేడు.

"కొత్తగా వచ్చిన నాకు కూడా వేణుగోపాల్రావు వాగ్ధాటి కొత్త కాదు. అతని నటనా నైపుణ్యానికి, భాషా చాతుర్యానికి, అతను కాలేజీలో సంపాదించిన బహుమతులే సాక్షి. అతని వుపన్యాసం మమ్మల్నందర్నీ ఆవేశ పూరితుల్ని చేసిందంటే అందులో ఆశ్చర్యంలేదు. నేనొక్కటే విషయం చెప్పదలుచుకున్నాను. వేదికలమీద వుపన్యాసం వేరు. కార్యసాధనికి కావలసిన పరిశ్రమ వేరు. ఇక్కడ హాస్పటల్‌లో మెళ్ళో స్టెథస్కోపులు తగిలించుకుని, ట్వీడ్ పేంట్సు కూడా నలక్కుండా వార్డుల్లో తిరగడం వేరు. అక్కడ సేవ చేయడం వేరు. పల్లెటూరు ప్రజల సంగతి మీకుతెలియనిదికాదు, మందుత్రాగ్గమంటే త్రాగరు, యింజక్షనంటే భయం. ఏది తినొద్దంటే అదే తింటారు. దీనికి అసలు కారణం మంత్రంతాడు, రక్షరేకు, అమ్మవారి మొక్కు, వీభూతి, వీటిలోవున్న నమ్మకం వాళ్ళకు మనవైద్యంలోలేదు. మీరక్కడకెళ్ళినా అంతే. కలరా యినాక్యులేషన్ అంటే పారిపోతారు. సరిగ్గా చికిత్స చెయ్యనివ్వరు. రోగుల్నియిళ్ళలోనే దాచేస్తారు. అదీకాక అక్కడ ప్రభుత్వం ఏర్పాటుచేసిన 'కలరారిలీఫ్ యూనిట్", అనుభవశాలియైన డాక్టర్ శ్రీదేవి, తదితర పరిసర ప్రాంతల్లోను డాక్టర్లు, యింతమంది అక్కడ కృషి చేస్తున్నారు. అందుచేత నాసలహా ఏమిటంటే... "యీపిక్‌నిక్ కేంపెయిన్" మానేసి, ఆవైద్య సహాయార్థుల కోసం చేయబడుతున్న నిధికి మీరందరూ యథాశక్తి ద్రవ్యరూపంలో సహాయం చెయ్యండని కోరుతున్నాను. శలవు."

డాక్టరు గిరిధర్ వేదిక దిగిపోతూండగా హౌస్ సర్జెన్స్‌లో

కల్లోలం బయలుదేరింది. కొందరు డాక్టర్ గిరిధర్‌తో ఏకీభవిస్తారు. అందరూ లేవబోతూవుంటే వేణూ మళ్ళీ వేదికమీదకి వచ్చి మళ్ళీ ప్రసంగించేడు.

"క్షమించండి. ఒక్క నిమిషం. డాక్టరు గిరిధర్ కుమార్‌గారు చెప్పిన మాటలు అక్షరాలా నిజం. ఉపన్యాస ధోరణికి, కార్య నిర్వాహణకి వున్న తారతమ్యం చక్కగా విశదీకరించారు. అందుచేత మన సేవాదీక్ష కార్య నిర్వాహణలతో నిరూపించవల్సిన బాధ్యత మన మీద వుంది. అందుకు తగ్గ పట్టుదల, ఆత్మ విశ్వాశం వున్న సోదరీ సోదరులనే ముందుకువచ్చి పేర్లిమ్మంటున్నాను. మరో విషయం. చందాలు వసూళ్లు చేయమన్నారు. ఈ విషయంలో అనేక విద్యా సంస్థలూ, వ్యాపార సంస్థలూ, రెడ్ క్రాస్, లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్ వగైరాలు చేయూత నిస్తున్నాయి."

వేణూ గిరిధర్‌ల విభిన్న వుపన్యాసాల ఫలితంగా హౌస్ సర్జెన్స్ మధ్య ఈ వుద్యమానికి అనుకూలంగానూ, ప్రతికూలంగానూ వాదోపవాదాలు ప్రారంభమయ్యి, చివరకు ఒక నిర్ణయానికి రాలేక ఎవళ్ళకి వాళ్లు చల్లగా జారుకోగా మీటింగ్ వాయిదా వేశారు.

● ● ●

డాక్టర్ గిరిధర్ తన గదిలోకి తిరిగివచ్చి హాస్పటల్ సూపెర్నెంట్ ఆఫీస్సుకు ఫోన్ చేసాడు.

"హాలో మేనేజర్ గారా. నేను డాక్టర్ కుమార్‌ని, గుడ్ మార్నింగ్. సూపెర్నెంటు గారున్నారు? ... అహ... ఏమీలేదు. చూడండి. హౌస్ సర్జెన్ వేణుగోపాల్రావు నెరుగుదురుకదూ. అతను ంహా కలరా పేరుచెప్పి, హౌస్ సర్జెన్సందరిని బయలుదేరమని బలవంతం చేస్తున్నాడు. ఇలా 'స్క్వాడ్' కింద వీళ్ళనిపంపించేస్తే హాస్పటల్లో అటెండెన్సు తగ్గిపోతుందని సూపర్నెంటుగారికి చెప్పండి. ఈవెళ్ళదలచుకున్న వాళ్ళంతా ఏదో వాళ్ళ పేర్లు పేపర్లో పడతా యేమోనన్న ఆశకొద్దీ బయలు దేరే రకాలు... మరచిపోకండి ... రైటో... థేంక్స్.

గిరిధర్ కలరా బాధితుల్ని దృష్టిలో పెట్టుకుని చేసిన పని

బి. వి. రమణారావు

కాదిది. అతని లక్ష్యమల్లా వేణూ మొదలెట్టిన ఈ వ్యవహాన్ని విచ్ఛిన్నంచేసి అవమానించడం. రూపం, చదువు, సంస్కారం, విదేశాల్లో చదువుగల యువకుడు గిరిధర్. ఇన్నాళ్ళూ బ్రహ్మచారిగా వుంటూ, ఏనాడో చేసిన వాగ్దానాన్ని పాటిస్తూ తనే స్వయంగా చంద్రశేఖర్రావుగారింటి కొచ్చి, పద్మని పెళ్ళాడతాననే తన నిశ్చయాన్ని తెలియ జేసిన ఆత్మాభిమాని. ఆడినమాట తప్పకుండా వంశ మర్యాదని నిలబెట్టుకోవాలనే పట్టుదలతో, తన పెళ్ళి విషయం ఏనాడో స్థిరమై పోయినదన్నట్టుగా, ఇన్నాళ్ళూ ఆలోచించనయినా లేదు. ఈ మర్యాదని పాటించకుండా చంద్రశేఖర్రావుగారు అతి గారాబంతో పెంచి పద్మకు మితిమీరిన స్వతంత్రం యివ్వడం వల్లనే, వేణూలాంటి చీడ పురుగు తన ఆనందాన్ని ఆశయాల్ని భగ్నం చేసే దుర్గతి సంభవించిందని గిరిధర్ ఉద్దేశ్యం. ఈ ఆలోచనలతో వేణూమీదా, అంతకంటే ఎక్కువ చంద్రశేఖర్రావుగారిమీదా అతని ద్వేషం ప్రబలింది. అంతస్తు తెలియక అవివేకంగా వేణూకి మనసిచ్చి, తన పరిచయంతో తనని వరించగల పద్మని జీవిత భాగస్వామిగా చేసుకునే నీచత్వానికి దిగజారకుండా వుండటమే అతని మనో నిశ్చయం. మనస్సు చలించకుండా మాటిమాటికి పద్మవల్ల కలిగిన అవమానాన్ని తలుచుకుని, పద్మని అసహ్యించుకోడం మొదలెట్టాడు.

23

గిరిధర్ పెళ్ళికి ఒప్పుకొన్న క్షణం నించి చంద్రశేఖరరావుగారి ఆనందానికి అవధులు లేవు. రెండు వంశాల పేర్లు నిలబెడుతూ పెళ్ళి ఎంతో ఘనంగా చెయ్యాలన్న అభిలాషతో చెయ్యవలసిన ఏర్పాట్లు గురించి ఆప్తమిత్రులతో సంప్రదించడానికి మద్రాసు వచ్చి నెల్లాళ్ళ నుంచి మకాం వేసేడు. విదేశీయ రాయబారి అమ్మేస్తుంటే అరవై వేలుపెట్టి గిరిధర్‌కో ప్లిమత్‌కారు కొన్నాడు. సుమారో డెబ్బయి వేలు ఖరీదుచేసే నగలూ, బట్టలూ పద్మకి కొన్నాడు. దగ్గరలో రెండు ముహూర్తా లున్నాయి. అందులో ఏది అనుకూలంగా వుంటుందో పద్మా గిరిధర్‌లతో సంప్రదించి నిర్ణయించవచ్చని, ముందు పద్మకి ట్రంక్‌కాల్ బుక్ చేసాడు.

బల్లమీదవున్న టెలిఫోన్ పక్కనే పద్మా, శశి ఫొటోలున్నాయి. తను తెచ్చిన నగలపెట్టెలలోంచి ఆప్యాయంగా రెండు నెక్లెసులు తీసి ఒకటి పద్మఫొటోకి, ఒకటి శశి ఫొటోకి తగిలించి పద్మ దగ్గరనుంచి జవాబు కోసం నిరీక్షిస్తూండగా కాల్‌వచ్చి పద్మగొంతు వినబడింది.

'ఎవరూ. పద్మా — నేనమ్మా'

'మీరా నాన్నా' గుడ్‌మార్నింగ్. ఇలాసాగావున్నాం? "కులాసాయే నమ్మా. నీకో శుభవార్త, వచ్చే నెల్లో నీపెళ్ళికి ముహూర్తాలు చూస్తున్నానమ్మా. ఇరవయ్యో తేదీ, యిరవై ఏడో తేదీన కూడా మంచి ముహూర్తాలే. నువ్వూ గిరిధర్ ఆలోచించి ఏముహూర్తం అనుకూలంగా వుంటుందో నాకు సాయంత్రం టెలిఫోన్ చేస్తే, ఏకంగా శుభలేఖలు కూడా ప్రింటింగ్ కిచ్చేస్తాను. నే నింకా నాలుగైదురోజు లిక్కడుండాలనుకుంటున్నా. నీకు సలభై వేలెట్టి డైమండ్ నెక్లెస్ కొన్నానమ్మా. గిరిధర్ కో అరవైవేలెట్టి ప్లిమత్ కారు కొన్నా."

"థేంక్స్ నాన్నా."

(శశి ఫొటో ఆప్యాయంగా తడుముతో) "శశి అక్కడవుందా? శశికి ఏడువేలెట్టి చిన్న నెక్లెస్ కొన్నాను. మరి గిరిధర్‌తో ఆలోచించి సాయంత్రం టెలిఫోన్ చేస్తావుకదూ" (క్లిక్) హల్లో... పద్మా .. పద్మా...

అప్పటికే దుఃఖంతో కృంగిపోతున్న పద్మ నోట మాట రాని స్థితిలో టెలిఫోన్ రిసీవర్ దించేసింది.

• • •

డాక్టర్ గిరిధర్ బల్లమీద ఫోన్ మ్రోగింది. "యస్ ...... లైన్ యివ్వండి... హలో ... చంద్రశేఖర్రావుగారా, నమస్కారం. అలాగా నాకు తెలీదు .. వారం రోజుల క్రితం మీ యిల్లు విడిచిపెట్టి వేరే యిల్లు తీసుకున్నాను."

"అదేమిటి! సరిసరి! అప్పుడే అలకా. నేను నాలుగైదు రోజుల్లో తిరిగొస్తున్నాను. మీ తగువు అప్పుడు పరిష్కారం చేస్తాను. ఈ లోగా నీకో శుభవార్త. మీ పెళ్ళి వచ్చేనెల. 20 వ తేదీ, 27 వ తేదీన ముహూర్తాలున్నాయి.

● భార్య : అబ్బాయికి అప్పుడె పెళ్ళేమిటండీ, ఇంకా ఇరవైయేళ్ళన్నా నిండలేదు. లక్షణమైన పిల్ల దొరికేదాకా ఆగుదాం.

భర్త : ఎందుకాగాలి? మా అమ్మా నాన్నా ఆగారా? ..

ఇందులో ఏ ముహూర్తం పెట్టమంటావో. ఆఁ... కేన్సిల్ చెయ్యడమా! కారణం?"

"కారణం, నన్నడగడంకంటే పద్మనికాని, లేకపోతే పద్మ సహచరుడు... ఆత్మీయుడూ, ప్రియుడు మొదలయినవాడు ఆ వేణుగోపాలావు నడగండి. క్షమించండి. ఇంతకంటే నేను చెప్పే దేమీ లేదు."

చంద్రశేఖరంగారు దిగ్భ్రమతో రిసీవర్ దించేశాడు.

వేణూ హాస్పటల్ లో తన వార్డులో రోగుల్ని పరీక్ష చేస్తూ, అప్పుడే బాధతో మూలుగుతున్న ఓ రోగి మంచం దగ్గరకు వచ్చి, పక్కనే తగిలించివున్న అట్టతీసి చూశాడు.

"నిన్నటికంటే సులువుగా వుందా?"

"తమర్ని చూస్తున్నంతసేపూ సులువుగానే వున్నట్టుంటుంది బాబూ"

నాడిచూసి, తర్వాత థెర్మోమీటర్ నర్స్ చేతులోంచి అందుకుని, రోగి నోట్లోవుంచి, "భయపడకు. తగ్గిపోతుంది" అన్నాడు.

వేణు రోగి టెంపరేచర్ చూచి, అతని చెయ్యితట్టి "మరేం పర్వాలేదు. ధైర్యంగావుండు" అని లేచి నర్సుకేసి తిరిగి "వెల్ సిస్టర్! 11 గంటలనుంచి డ్యూటీలో వున్నది నువ్వేనా యీ వార్డులో" అని అడిగాడు.

"అవునండి. మీరసలు నా మొహాలుకేసి చూసిమాట్లాడితేకదా, మమ్మల్ని అనమాలు కట్టడానికి"

"కేస్‌షీట్ తీసుకుని ఒకసారి నాకూడా రా!"

వేణు వరండా మీదకి వెళ్ళేడు. నర్సు వేణు వెనకాలే బెదురుతూ వెళ్ళింది.

"ఇందులో టెంపరేచర్ నోట్ చేసింది నువ్వేనా?"

"అవును డాక్టర్."

'ఊఁ' 11 గంటలకినూరుంది. ఒంటి గంటకు నూరుంది. నాలుగు గంటలకు నూరుంది. ఇప్పుడు నాలుగూ పదయింది. ఇప్పుడు నేను చూస్తే నూటనాలుగు దాటింది. ఇవి నిజంగా టెంపరేచర్ చూసి నోట్ చేసిన రీడింగ్సేనా?"

నర్సు దిక్కుతోచక, తన యూనిఫారం అంతా తడివి చూసుకుని, నేలకేసిచూస్తూ, జోడుతో నేలని రాముతూ నిలబడి పోయింది.

"నీ యూనిఫారం అవి చాలా బాగున్నాయి. నే నడిగిన దానికి, సమాధానం ఏమిటి?"

"కొద్దిగా అశ్రద్ధ చేశాను."

"ఇక్కడ ప్రాణాలతో పని. అశ్రద్ధగా వుండే! వాళ్ళకిక్కడ చోటు లేదు. ఒక్క విషయం గుర్తుంచుకో, ఈ హాస్పటల్ కట్టించింది డాక్టర్లకీ, నర్సులకీ వుద్యోగా లివ్వడానికి కాదు. ఈ దిక్కులేని రోగుల కోసం. ఈ రోగులకి శ్రద్ధగా పరిచర్య చెయ్యడానికే ఈ హాస్పటల్ కట్టించి, మనల్ని జీతాలిచ్చి పోషిస్తున్నది. అదైనా తెలుసా? నీ రాతలు నమ్మి, అతనికి జ్వరం తగ్గు మొహం పట్టిందనుకుని చూడకుండా వెళ్ళిపోతే, అతని ప్రాణం మీద కొచ్చి వుండును. దానికి బాధ్యులెవరు?"

"నేనే డాక్టర్. తప్పు నాదే."

"ఆలోచించు. నిజంగానీతండ్రో, నీఅన్నో, నీదగ్గర బంధువో అలాంటిస్థితిలో వుంటే అశ్రద్ధ చేస్తావా?"

"పొరపాటు డాక్టర్."

"మరోసారి యిలాంటి అశ్రద్ధకనబడిందంటే, సూపర్నెంటుతో రిపోర్టు చెయ్యవలసి వుంటుంది."

"క్షమించండి, యింక మీదట జాగ్రత్తగా వుంటాను"

"ఆల్‌రైట్. చూడు. ఆరోగి పరిస్థితి కొంచెం సీరియస్‌గా వుంది. ప్రిస్క్రిప్షన్ మారుస్తాను. వెంటనే డిస్పెన్సరీకి పంపించి మందు తెప్పించు. ఈలోగా "ఐస్ బేగ్" పెట్టు. పొద్దున్నతని "బ్లడ్‌స్మియర్ లేబరేటరీకి పంపించేను. రిజల్టు రాగానే నాకొచ్చి చెప్పు వార్డులోనే వుంటాను."

"సరే డాక్టర్"

"చూడు సిస్టర్. ఎంతో శ్రద్ధగా వైద్యం చేస్తేనేకాని ఓ ప్రాణం నిలబెట్టలేం. కాని ప్రాణం పోవడానికి ఏమాత్రం అశ్రద్ధ చేసినా చాలు. ఏమంటావ్"

"అహంభావంతో యిన్నాళ్ళూ రోగులపట్ల అన్యాయంగా ప్రవర్తించాను. క్షమించండి. డాక్టర్."

ఇంతలో మరో నర్సు వచ్చి "డాక్టర్. మీకు మెడ్రాస్ నుంచి ట్రంక్ కాల్ వచ్చింది" అని వేణూతో చెప్పింది,

"ష్యూర్! నాకే?"

● ఒకడు : "మా యింట్లో నేను రాజుని. నామాట రాజాజ్ఞ.
మరొకడు : "మాయింట్లో నేనూ అంతే. మాఆవిడ పుట్టింటికెళ్ళింది."

'అవును డాక్టర్.'

'థేంక్స్. వస్తున్నాను.'

● ● ●

మద్రాసు నుంచి ట్రంక్ కాల్ అనగానే ఆశ్చర్యపోయాడు వేణూ. రిసీవర్ అందుకుని, పద్మ తండ్రి గొంతుక ఆనమాలు కట్టేడు.

'చంద్రశేఖర్రావుగారు నమస్కారం. క్షమించండి. నాకు తెలీదు. మీ యింటికెళ్ళి వారం రోజులు పైనయ్యింది ... నామీద మీకున్న అభిమానానికి కృతజ్ఞుణ్ణి. క్షమించండి ... యీ విషయం ఫోనులో మాట్లాడ్డం అసభ్యంగా వుంటుందనుకుంటూను' అన్నాడు.

'మిష్టర్ వేణుగోపాల్రావు నీతో నాకున్న పరిచయం చాల తక్కువ. నీతో యిలాంటి స్వంత విషయాలు మాట్లాడవల్సిన పరిస్థితి ఏర్పడినందుకే కించపడుతున్నాను. రేపు సాయంత్రం యేడు గంటలకి తప్పకుండా మాయింటికి రావాలి. ఇది చాలా ముఖ్యమయిన విషయం. పద్మా గిరిధర్ల ధోరణి చాల వింతగావుంది. మధ్య నీ పేరెందుకు రావాలో నా కర్థమవటంలేదు ... రైట్ ... ఎదురుచూస్తూ వుంటూను' అన్నాడు చంద్రశేఖర్రావుగారు గంభీరంగా.

24

రాత్రి గిరిధర్ కుమార్ బల్లమీద వున్న వుత్తరం తీసి, దానిపైన పద్మ దస్తూరితో ఎడ్రస్ వ్రాసి వుండటం చూసి, కవరుచించి, చదవటమా—చదవక పోవడమా అని క్షణమాలోచించి, చివరకు చదివేడు.

ఆనాడు కోపంతో మీరు యిల్లు విడిచి వెళ్ళినప్పటినుంచి, దుర్భర నరకం అనుభవిస్తున్నాను. రేపు నాన్నగారు 7 గం॥ల ప్లేన్‌లో వస్తున్నారు. మిమ్మల్ని ఒక్కసారి కలుసుకుని మాట్లాడనిదే, నాన్నగారికి నా మొహం చూపెట్టడానికి ధైర్యం చాలడంలేదు. అందుచేత నా యందు దయుంచి, మీరు రేపు సాయంత్రం కాలేజీ విడిచిపెట్టిన తర్వాత 5 గంటలకి వీలు చేసుకుని ఒక్కసారి యిక్కడకు రమ్మని ప్రార్థిస్తున్నాను.

మీరు వస్తే నామాన ప్రాణాల్ని కాపాడిన వారవుతారు. 5 గం॥ల వరకూ మీ కోసం ఎదురుచూస్తూ వుంటాను.

మీ

పద్మ.

ఉత్తరం మడిచి, కవర్లో పెట్టి, సిగరెట్ తీసి, వెలిగించి, ఆ అగ్గిపుల్ల మంటతో ఆ కవర్ పళంగా, ఆవుత్తరాన్ని అంటించేడు. కోపోద్రేకాలతో, అప్పటికే ఎర్రబడిన మొహం, ఆమంట వెలుగులో మరింత ఎర్రబడింది.

● ● ●

మర్నాడు సాయంత్రం 5 గంటలు దాటింది. పద్మ వరండా మీద గిరిధర్ రాక కోసం ఆతృతగా ఎదురు చూస్తోంది. ఇంతలో పోర్టికోలో కారు ఆగింది. అందులోంచి శశి దిగింది.

'జ్వరం తగ్గిందా అక్కయ్యా!

'తగ్గిందమ్మా,

'మరినువ్వు కూడా ... ఎయిరోడ్రోంకి వస్తావా!'

'అలాగేలే చూద్దాం ... నువ్వు ముందర డ్రస్ మార్చుకో'

పద్మా, శశి మేడమీద కెళ్ళేరు. చిన్నమ్మ కాఫీ ఫలహారాలు ట్రేలో తీసుకొచ్చి, బల్లమీద పెట్టింది. పద్మ పత్రిక తిరగేస్తూవుంటే, శశి డ్రెస్ మార్చుకుని, కాఫీ తీసుకుంటూ.

'అక్కయ్యా, నువ్వు కూడా ఎయిరోడ్రోంకిరావా'అంటూఆప్యాయంగా అడిగింది. పద్మ టేబుల్ మీద పత్రిక పడేసి 'యిలారా శశి' అని పిలిచింది. అనుమానంగా శశి తనముస్తాబంతా సరిగ్గా చూసుకుని.

'ఏం' అంటూ పద్మ దగ్గర కొచ్చింది.

పద్మ ఆప్యాయంగా శశి చెక్కిళ్లు తాకుతూ 'చూడు శశీ. పెద్ద దానవవుతున్నావు. ఇంక అన్నింటికి నేను కూడా వుండాలనకూడదు. ఇల్లంతా నువ్వే చక్కబెట్టుకోవడం నేర్చుకోవాలి' అంది.

'పెద్దదానవు నువ్వున్నావుగా?'

'నేను లేననుకో.'

'అనుకోడమేమిటి? అయితే నేనూ లేననుకో!'

'పోనీ ... నేను చచ్చిపోయాననుకో.'

'అక్కయ్యా! ఏమిటలా మాట్లాడుతున్నావు' అంటూండగా చిన్నమ్మ ప్రవేశించి 'అమ్మా ఆరోవ్వాస్తూంది' అని జ్ఞాపకం చేసింది.

'కారు సిద్ధంగా వుంచమను.'

'అయితే నువ్వూ వొస్తున్నావన్నమాట.' సంతోషంతో గంతేసింది శశి.

'చెబుతాగా నడు!'

పద్మా శశి మేడ దిగి హాల్లోకి వచ్చారు. కారు పోర్టికోలో సిద్ధంగా వుంది. డ్రైవర్ వెనకసీటు తలుపు తెరిచి పట్టుకున్నాడు. శశి ఎక్కి కూర్చుంది. చిన్నమ్మ మేడమీదనుంచి, కాఫీ ఫలహారాలు

తెచ్చిన ట్రే క్రిందకి పట్టుగొచ్చి, హాల్లోంచి వంటింట్లోకి వెళ్ళబోతూ వుంటే పిలిచి పద్మ తన తాళం చెవుల గుత్తిలోంచి తన గది తాళం విడదీసి, చిన్నమ్మ చేతులోవున్న ట్రేలో పడేసి ...

"చిన్నమ్మా! ట్రేవంటింట్లోపడేసి తర్వాత ఆ తాళం తీసుకుని మేడ మీదకువెళ్ళి, నాగది తాళంవేసేసి, తాళం నీ దగ్గరే వుంచుకో, యింకెవ్వరికి యివ్వకు తెలిసిందా" అంది.

"ఏం దాచిపెట్టావేమిటి ?" నవ్వుతూ అడిగింది చిన్నమ్మ.

"తెలుస్తుందిగా తర్వాత."

చిన్నమ్మ వంటింటివైపు వెళ్ళగానే పద్మ వరండామీదకు వచ్చి. డ్రైవరుతో "నేను ఎయిరోడ్రోంకి రావడంలేదు. శశిని జాగ్రత్తగా తీసుకెళ్ళు" అని లోపలికి వచ్చేసింది. "నువ్వుకూడా రా అక్కయ్యా!" అంటూనేవుంది శశి. కారు బయలుదేరి వెళ్ళిపోయింది. పద్మ తన కాళ్ళజోడు చేత్తో పట్టుకుని నిశ్శబ్దంగా మేడమీద తన గదిలోకి వెళ్ళిపోయింది.

చిన్నమ్మ, వంటింటిలోంచి, హాల్లోకి వచ్చి, కారు వెళ్ళిపోయినట్టు గ్రహించి, కూనిరాగం తీసుకుంటూ మేడమీదకెళ్ళి బారుగా తెరిచివున్న పద్మ గదితలుపులు తాళం వేసింది.

25

చిన్నమ్మ గదికి బయటనుంచి తాళం వెయ్యడం గ్రహించి, పద్మ మంచం కిందనుంచి బయటకి వచ్చి, చీకట్లో తడుముకుంటూ టేబుల్ లైట్ వెలిగించింది. ఒక వుత్తరం వ్రాసి, మంచందగ్గర కొచ్చి దాని తలగడ క్రిందపెట్టి, పరుపు కింద దాచి వుంచిన "డయాల్" అని వున్న సీసాతీసి, అందులోవున్న పది మాత్రలు ఒకటి తర్వాత ఒకటి వేసుకుని మంచినీళ్ళుతాగి పడుకుంది. గోడకున్న గడియారంలో 6-30 అయింది. మంచం పక్కనేవున్న టేబుల్ ఫేన్ ఆన్ చేసింది.

కళ్ళు ముయ్యగానే గత సంఘటనలు స్మృతి పథానికొచ్చేయి. నాటి రాత్రి మేడమీద పద్మా గిరిధర్‌ల ప్రణయఘట్టం ఊటీలో చంటిపాపని పద్మ ఎత్తుకున్నప్పుడుగిరిధర్ ఫొటో తీసిన దృశ్యం, పరీక్షా ఫలితాలు తెలిసినప్పుడు గిరిధర్, పేప రందకుండా, పట్టుకున్న దృశ్యం కళ్ళ ముందు కనబడుతూ వుంటే, పద్మ చిరునవ్వు నవ్వుకుంటోంది.

క్షణంలో మరో దృశ్యం. అదే పక్కమీద తన మృత కళేబరం. పక్కనే తన తండ్రి, శశి ఏడుస్తూ వున్నారు. వేణు శశిని, తండ్రిని ఓదారుస్తూ వుంటాడు. గిరిధర్ ఖిన్నుడై నిలబడి తనకేసి చూస్తూ వుంటాడు. ఈ వూహా దృశ్యంతో పద్మ కళ్ళనుంచి నీళ్లు కారతాయి.

ఇంతలో మరో దృశ్యం. తన తండ్రీ, శశి, గిరిధర్ కూడా వేణూని పద్మ చావుకు కారణం నువ్వే అని నిందిస్తూ వుంటే, వేణు నిస్సహాయంగా, చేతుల్లో మొహం కప్పుకుని వెనక్కి తిరిగిపోతూ వుంటాడు. ఈ దృశ్యంతో పట్టు తప్పుతున్న చైతన్యంలోంచి మేలుకుని, వేణూ వేణూ... అని గద్గదంగా అంటూ గదంతా ఒకసారి కలియజూసి, అప్పటికే నిద్రమత్తులో పడుతున్న పద్మ కళ్లు మూసుకుంది. క్షణంలో మైకం కమ్మి వికృతంగా మెలికలు తిరిగిపోతూ, ఆవేశంతో చెయ్యి పైకెత్తి. నోరు విడక, అస్పష్టంగా 'వే... వే... వేణూ. ఊ – ఊ అంటూ పద్మ మంచం అంచువరకూ దొర్లింది.

● ● ●

సాయంత్రం ఏడున్నర గంటలకి, చంద్రశేఖరరావుగారూ, శశి కారు దిగేరు. అంతకు ముందేవచ్చి వరండాలో కూర్చున్న వేణూ ఎదురెళ్ళి నమస్కరించేడు.

"నమస్కారం."

"హల్లో. వేణుగోపాల్రావ్"

"హల్లో. గుడీవినింగ్" అంటూ శశి వేణూని పలకరించింది.

"వెరీగుడీవినింగ్‌శశి ... పద్మేది?"

"ఏం పద్మిక్కడ లేదూ?" చంద్రశేఖరంగారు ఆతృతగా.

"లేదే. నే నిక్కడకొచ్చి అర గంటయింది. కార్లోనే వెళ్ళిందంది చిన్నమ్మ" అన్నాడు వేణు.

"లేదు. బహుశా టెన్నిస్‌కి వెళ్ళి వుంటుంది."

"నాన్నా. అక్కయ్యకి తెచ్చిన నెక్లెస్ చూపెట్టరూ ?" గారంగా అడిగింది శశి.

"చూపెడతానమ్మా శశీరానీ."

"అసలు అక్కయ్యెక్కడికెళ్ళిందో చిన్నమ్మ నడుగుతానుండు" అంటూ మేడమీదకెళ్ళి శశి చిన్నమ్మని పిలిచింది. పద్మ శశితో కార్లోనే వెళ్ళిందని చిన్నమ్మ వుద్దేశం. ఆమాటే అంది చిన్నమ్మ.

"నాతో రాలేదే. వెళ్ళి గదిలో పడుకుందేమో చూడు" ఆదేశించింది శశి.

"లేదమ్మా, గదికి తాళమేసారు. వుండండి వెంకన్న నడుగుతాను. ఇందాకట్నుంచీ దొడ్లోనే వున్నాడు... పద్మమ్మగారు బయటకెడితే చూసే వుంటాడు."

● ● ●

"తగినంత కారణం వుంటేనే

కాని మనస్సులో అంత బాధ పడటానికి గిరిధర్ కేమీ తుర్రాడు కాదు. పొరపాటే అయినట్లయితే, మా పద్మ సమర్థించుకోలేనంత అసమర్థురాలు కాదు" అన్నాడు చంద్రశేఖర్రావు గారు తీవ్రంగా.

"అక్కయ్య ఎక్కడికీ వెళ్ళలేదంటున్నాడు వెంకన్న. సాయంత్రం నుంచి గేటు దగ్గరే వుంటున్నాడుట." అంటూ మాటకి అడ్డం వొచ్చింది శశి.

"కార్లో వెళ్ళిందనుకుంటుంది చిన్నమ్మ. ఎక్కడికీ వెళ్ళలేదంటాడు వెంకన్న. ఇంట్లో చూస్తే లేదు. మరేమయింది. నే నొస్తానని కూడా తెలుసునే. టెన్నిస్‌కే వెళ్ళుంటుంది. వెంకన్న చూసుండడు" అన్నాడు పద్మ తండ్రి విసుగ్గా.

శశి మేడమీదకెళ్ళి, పద్మ గది కిటికీ తలుపు సందులోంచి, చూస్తూ

చందాదారులకు మనవి

పాత చందాదారులు తిరిగి చందా పైకం పంపేటప్పుడు మీ చందా నెంబరు, అడ్రసు వివరంగా వ్రాసి మాతో సహకరించ ప్రార్థన.

వుండగా చిన్నమ్మ అక్కడి కొచ్చింది. తలుపు సందులోంచి శశి మరింత పరీక్షగా చూస్తూ వుందీసారి.

"ఏమిటమ్మా చూస్తున్నారు."

"గోడని టెన్నిస్ రేకెట్ వుంది చిన్నమా."

"మీ కెలా కనబడిందమ్మా ?"

"... కావలిస్తే నువ్వు కూడా చూడు. అక్కయ్య లైటు కూడా ఆర్పెయ్యకుండా వెళ్ళిపోయింది."

"ఆఁ... లోపల లైటు వేసుందా?"

• • •

శశి కిందకు వచ్చేసింది. చంద్రశేఖర్రావుగారు, వేణూ యింకా మాట్లాడుకుంటూ వున్నారు.

"నాకూ పద్మకు వున్న స్నేహాన్ని గిరిధర్ కుమార్‌గారు సరిగ్గా అర్థం చేసుకోలేక మమ్మల్ననుమానించి వుండాలి... అంతకంటే..."

అని వేణూ అంటుండగా చిన్నమ్మ కెవ్వుమని కేక వేసింది. వేణూ, చంద్రశేఖర్రావుగారు వాళ్ళ వెనకాలే శశి, ఒక్క పరుగులో ఎక్కారు. పద్మగది తలుపు తెరిచి, తలుపుకు ఊరగిలబడి, చిన్నమ్మ భయంతో "బాబూ! అంతా మాయగా వుందండి, ఏసిన తలుపులు ఏసినట్టే వున్నాయి. పద్మమ్మగారు లోన పడిపోయున్నారండి." అంది.



పద్మ మంచం పక్కనే కిందపడిపోయివుంది. వేణు వెంటనే గది కిటికీ తలుపులన్ని తెరిచేసి, పద్మ నాడి చూసి, గోడకు తగిలించి వున్న స్టెథస్కోప్ తో గుండెలు పరీక్ష చేస్తూ వుండగా, చంద్రశేఖర్రావుగారు గుమ్మంలోంచే "యేమిటి భగవంతుడా, నా తల్లిని యేం చేశావు!" అంటూ వణికిపోతూ గుమ్మంలోనే చతికిలబడ్డాడు. శశి "అక్కయ్యా" అంటూ పద్మమీద పడబోతూంటే, వేణూ వారించి, తండ్రి దగ్గర కూర్చోపెట్టేడు.

వేణు పద్మ కళ్ళూ, పెదవులూ, మెడా పరీక్ష చేస్తున్నప్పుడు, అతని దృష్టి మంచం దగ్గిరే వున్న "డయాల్" మాత్రల ఖాళీ సీసా మీద పడింది. చిన్నమ్మ సహాయంతో పద్మని, మంచంమీద పడుకోబెట్టి, కింద హాల్లోకి వెళ్ళి డాక్టర్ ప్రసాద్ యింటికి ఫోన్

చేసాడు, వెంటనే కావల్సిన మందులూ, పరికరాలతోటి రమ్మని. తర్వాత రఘూకి, లిల్లీకి అర్జంటుగా బయల్దేరి రమ్మని టెలిఫోన్ చేశాడు.

డాక్టర్ గిరిధర్ లాడ్జిలో ఫోన్ మోగింది. రిసీవర్ గిరిధర్ అందుకోగానే "చంద్రశేఖర్రావుగారింట్లోంచి మాట్లాడుతున్నాను. పద్మకి చాలా సీరియస్‌గావుంది. ఆత్మహత్య చేసుకోడానికి డయాల్ టేబ్లెట్స్ మింగింది. దయయుంచి మీరు త్వరగా రావాలి" అన్న వేణు గొంతుక వినబడింది.

"నన్నక్కడికి రప్పించడానికిదో ఎత్తనుకుంటాను. అయినా మీరందరూ వున్నారుగా. నేనొచ్చి మాత్రం చేసేదేముంది. గుడ్‌నైట్" అని రిసీవర్ దించేసేడు గిరిధర్.

గిరిధర్ కుర్చీలో కూర్చుని, బల్లమీదున్న కాలింగ్ బెల్ నొక్కి, బంట్రోతురాగానే, అతనికి ప్రిస్క్రిప్షన్ చీటి అందించి "రామన్నా ... సిటీ ఫార్మసీకి వెళ్ళి రెండు మాత్రలిస్తారు పట్టుకురా"అని పర్సులోంచి రూపాయితీసి యిచ్చేడు.

"ఎందుకు బాబూ యిది."

"నిద్ర పట్టడానికి. ఏం అలా అడిగేవు."

"వారం రోజుల్నుంచి తమరదో మాదిరిగా వున్నారు బాబూ. భోజనంకూడా చెయ్యటం లేదు."

"ఈ వూరుగాలి నాకు సరిపడలేదు రామన్నా. యీ వుద్యోగానికి రాజీనామా యిచ్చేసి, మరోసారి విదేశాలు తిరిగి రావాల్నుంది" అన్నాడు గిరిధర్ సాలోచనగా.

26

పద్మ గది బయట కుర్చీలలో అందరూ ఆతృతతో కూర్చుని వున్నారు. రఘూ సరాసరి పద్మగదిలోకి వెళ్ళేటప్పటికి, వేణూ నాడి చూస్తూ వుండగా, ప్రసాద్ యింజక్షన్ యిస్తూ వుంటాడు, ఒక నర్సు ఆక్సిజన్ ఎక్కిస్తూ వుంటుంది. వేణూ నిశ్శబ్దంగా లేచి, రఘూ చెయ్యి పట్టుకుని బయటకు తీసుకొచ్చేడు.

"ఎలావుంది కండిషన్?" ఆతృతగా అడిగేడు రఘు.

"ఏమీ బాగాలేదు. నువ్విక్కడే వుండు. వీలయితే హాస్టలుకు ఫోను చేసి లిల్లీని రమ్మను. నేను డాక్టర్ గిరిధర్ కుమార్‌ని ఎలాగైనాసరే తీసుకొస్తాను" అన్నాడు వేణు.

"లిల్లీకి హాస్పటల్నుంచే ఫోన్ చేసేను".

"ఇంకో అరగంటలో 'పల్స్ యింప్రూవ్' అవ్వకపోతే పోలీస్ స్టేషన్‌కి ఫోన్‌లో తెలియబరచు. సాధ్యమయినంత వరకూ, నేను ఈలోగానే రావడానికి ప్రయత్నిస్తాను." "సరే!" అన్నాడు రఘు, బరువుగా.

• • •

వేణూ డాక్టర్ గిరిధర్ బంగళాలోకి ప్రవేశిస్తూంటే గుమ్మందగ్గర బంట్రోతు రామన్న ఎదురయ్యేడు.

"నమస్కారం బాబూ"

డాక్టర్‌గారు నిద్ర పోయారా?

"లేదు బాబూ. నిద్ర పట్టడానికే మాత్రలు తెప్పించు కున్నారు."

గదిలో డాక్టర్ గిరిధర్ మాత్రలు నోట్లో వేసుకుంటూ వుండగా వేణూ లోపలి కొచ్చేడు.

"గుడీవినింగ్ డాక్టర్".

"ఓ. మిష్టర్ వేణూ".

"మీరా నిద్రమందు వేసుకోకముందే ఒక మనవి."

"ఏం! నాకు నిద్రపట్టడంకూడా నీ కిష్టం లేదా?"

"పద్మ యిప్పుడే స్థితిలో వుందో తెలిస్తే, మీరు నిద్రపోలేరు."

"మిష్టర్ వేణూ! వైద్యవృత్తిలో వున్నంతకాలం రోగులూ, రోగాలూ, చావులూ మన చుట్టూ వుంటాయి. చూడు యివ్వాళే ఎమ్.—1 వార్డులో ముగ్గురు చచ్చిపోయారు. ఇంకో యిద్దరికి ప్రమాదంగా వుంది. ఇలా ఎన్నింటికని విచారించగలం?"

"ఇది వినోదానికి, వేదాంతానికి టైము కాదు డాక్టర్. పద్మకి చాలా సీరియస్‌గా వుంది."

"అవును పాపం. విన్నాను. మరి డాక్టర్లు మీరందరూ వున్నారుగా."

"పద్మను బ్రతికించ గల్గిన డాక్టరొక్కడే వున్నాడు."

"మరి తీసుకెళ్ళలేక పోయావా?"

"తీసుకెళ్ళడానికే వచ్చాను."

"ఓ!"

"త్వరగారండి డాక్టర్. పద్మ అవమానంతో కృంగిపోయి, చివరకి ఆత్మహత్యకి తెగించింది. ఈ గండం గడిచినప్పటికీ, పద్మ హృదయానికి తగిలిన గాయం మానాలంటే మీరే సహాయ పడాలి. పద్మ బతికినా, చచ్చినా మీదే బాధ్యత."

"హుం. బాధ్యత! తను చేసిన నేరానికి, వంచనకీ, అవినీతికీ, అవమానంతో బతకలేక చావదల్చుకుంది. ఇందులో నా బాధ్యత ఏమీ లేదు."

"నేను మీతో వాదించడానికి రాలేదు. ఈర్ష్యతో కళ్ళు కప్పుకుపోయిన మీకు నిజం నచ్చదు. చావు బ్రతుకులు మీ చేతులో వున్న ఒక ప్రాణాన్ని నిలబెట్టి, మీ వైద్యవృత్తి ధర్మాన్నైనా నిలబెట్టు

కుంటూరేమోనన్న ఆశతో వచ్చాను.'

"వేణూ ... హద్దుమీరి పోతున్నావు!'

"మీ అహంభావమే హద్దుమీరి పోతోంది. అనుమానంతో, తీరని అవమానంచేసి, అసూయతో బ్రతుకు బద్దలు చేసింది చాలక, చావు బ్రతుకుల్లో వున్న పద్మని రక్షించ గలిగీ కూడా, చేతులారా చంపి పగ సాధించ దల్చుకున్నారు. ఛీ. మానవ సహజమైన క్షమా, దయాంతః కరణలు మీ యీర్ష్యా పిశాచానికి బలిచ్చి ... రాక్షసుడిలా ...'

"నోర్ముయ్! అంటూ ఒళ్లు తెలియని కోపావేశంతో గిరిధర్ వేణుని ఛళ్లున లెంపకాయ కొట్టేడు. మరుక్షణంలోనే ఖిన్నుడై తలదించుకున్నాడు. వేణూ మోకాళ్ళమీద నిలబడి గిరిధర్ కాళ్ళను తన చేతులతో పెనవేసుకుని "మిమ్మల్ని తీసుకెళ్ళడానికే వచ్చేను. తీసుకువెళ్ళి తీరతాను. పద్మ బ్రతికి తీరాలి. పద్మ కాబోయ్ డాక్టర్. మీకోసం కాకపోయినా ప్రజల కోసమైనా బ్రతకాలి' అన్నాడు. గిరిధర్ వేణూ చేతుల్లోంచి తప్పుకుని "వస్తాను వేణూ, కాని ద్వేషిస్తూన్న హృదయంతో మళ్ళీ పద్మని ప్రేమించలేను" అన్నాడు.

"మీకు తెలియదు డాక్టర్, పద్మ మీకే విధంగానూ ద్రోహం చెయ్యలేదు."

"ప్రత్యక్షంగా కళ్ళముందు జరిగిన సంఘటనలు నమ్మకుండా వుండటం, నువ్వనుకున్నంత సులభం కాదు."

"జరిగిన దాన్నిగురించి వాదించి మిమ్మల్ని నమ్మించటానికి ప్రయత్నించటం లేదు. నిజాన్ని గుర్తించే అవకాశాన్ని మీరు తొందరపడి చేతులారా జారవిడుస్తున్నందుకే విచారిస్తున్నాను.'

"దయుంచి ఆ ప్రసక్తి ఇంక తేవద్దు నా బాధ నువ్వర్థం చేసుకోలేవు.'

27

వేణూ గిరిధర్ చంద్రశేఖర్రావుగారి బంగళాలో ప్రవేశించేటప్పటికి, గత మధురానుభూతులు స్మృతిపథంలోకి వచ్చి, హృదయం ఆవేశంతో స్పందించింది. ఇంత దగ్గరలో వున్నా చూస్తూండగా ఎంత దూరమైపోయిందా యిల్లు. ఒకప్పుడు నందనోద్యానవనం అనిపించింది. ఇప్పుడు తన అనుమాన పెనుభూతలకి నర్తనశాల. హాల్లోకి వచ్చేటప్పటికి లిల్లీ ఎదురైంది. పద్మ పరిస్థితి ప్రమాదకరంగా వుందనటానికి లిల్లీ మొహంలో కనబడే విచార రేఖలే నిదర్శనం. నిశ్శబ్దంగా మేడమెట్లు ఎక్కుతుంటే, ఎక్కే ఒకొక్క మెట్టూ, గిరిధర్ని హృదయభారంతో కృంగదీసింది. మెట్లెక్కేటప్పటికి గిరిధర్ హృదయం ఆవేదనతో మొద్దుబారి పోయింది. అతనొక డాక్టర్, చావు బ్రతుకుల్లో వున్న మనిషిని చూడ్డానికెడుతున్నాడు. చెయ్య కలిగిన దేమైనా వుంటే చెయ్యడం తన వృత్తి ధర్మం.

గిరిధర్ పద్మ గదిలోకి వెళ్ళగానే అశ్రుపూరిత నయనాలతో చంద్రశేఖర్రావుగారు గిరిధర్ చేతులు తన చేతుల్లోకి తీసుకున్నాడు. చేతులు తప్పించుకుని పద్మ మంచం దగ్గరకి వెళ్ళేడు, డాక్టర్ ప్రసాద్. హాస్పటల్ సూపెరింటెంట్, డాక్టర్ ఆనందరావు కూర్చుని వున్నారు. గిరిధర్ పక్కనే ఖాళీగావున్న కుర్చీలో కూర్చున్నాడు. ప్రసాద్ అప్పుడే పల్స్ చూసేడు.

"ప్రసాద్! పల్స్ ఎలా గుంది?' అడిగేడు గిరిధర్.

"స్లో."

"రెస్పిరేషన్?"

"ఫీబుల్."

"బ్లడ్ ప్రెషర్?"

"లో. యిప్పుడిప్పుడే రైజ్ అవుతోంది."

"టెంపరేచర్?"

"ఇంకా సబ్ నార్మల్."

అడక్కుండానే ప్రసాద్ అంతవరకూ యిచ్చిన యింజెక్షన్ ఖాళీ సీసాలన్నీ గిరిధర్కి చూపెట్టాడు. అన్నీ పరీక్షచేసి సంతృప్తిపడి అభినందన పూర్వకంగా ప్రసాద్ భుజం తట్టాడు. పద్మ తలగడా కింద దొరికిన వుత్తరాన్ని తండ్రి యివ్వగా, శశి గిరిధర్కి యిచ్చింది. నిశ్శబ్దంగా చదువుకున్నాడు గిరిధర్.

"ప్రియమైన నాన్నగారికి,

ఇరవై రెండేళ్ళు అల్లారుముద్దుగా పెంచేరు. కావల్సినవిద్యా, ధనం, సంస్కారం అందించి జీవితమొక మధుర మందహాసం కింద చిత్రించారు. విజ్ఞాన ప్రబుద్ధుల్లో మేటి అయిన డాక్టర్ గిరిధర్ కుమార్ని భర్తగా నిర్ణయించేరు. ఇంతకంటే ఏంకావాలి. కాని మీ పితృ వాత్సల్యం, కుమార్గారి అనురాగం చూరగొనే యోగ్యత నాకు దక్కలేదు. కొన్ని విచిత్ర సంఘటనల ఫలితంగా, డాక్టర్ కుమార్ నా శీలాన్ని శంకించారు. నా మూలాన్న వేణూ నిష్కారణంగా అవమానింపబడ్డాడు. నా సౌశీల్యాన్ని నిరూపించుకోటానికి,

రుజువులూ, సాక్ష్యాలూ, కావల్సి వచ్చిన యిటువంటి పరిస్థితిలో, మీకు మొహం చూపెట్టుకోలేక, ఈ బలవన్మరణానికి పాలుపడ్డాను.

నేను ఏ విధంగానూ ఎవరి పట్లా, ఎన్నడూ ద్రోహం చెయ్యలేదు. వేణు ఎప్పుడూ నన్ను సోదరిగానే ప్రేమించాడు. వీటికైనా రుజువులేదు కాని మీ పాద సాక్షిగా చెబుతున్నాను. మీరైనా నమ్మండి.

నేనీ గదిలో వున్నట్టు చిన్నమ్మకి తెలియదు. చిన్న[illegible]ను జీవితాంతం వరకూ ఆదరించండి, శశికి నా ఆశీస్సులు.

మీ అభాగ్య పుత్రిక,

'పద్మ'.

గిరిధర్ వుత్తరం చదివి, శశి చెయ్యి పట్టుకుని లేచి, వుత్తరాన్ని చంద్రశేఖర్రావుగారి చేతికిచ్చి తను మేడ దిగి, పద్మ స్టడీలో సోఫాలో కూర్చుని ఆలోచిస్తూ వుండగా, అంతవరకూ. కునికిపాట్లు పడుతున్న శశి, సోఫాలో గిరిధర్ పక్కనే పడుకుని నిద్రపోయింది.

● ● ●

పద్మ పరిస్థితిలో మార్పులేక పోవడం చూసి వేణు, లిల్లీని పద్మ గది బయటకి పిలిచి,

"ఈ ఘోరానికి కారణం నీకు, తెల్సనుకుంటాను" అని అడిగాడు.

"తెలియదు. అదే అయోమయంగా వుంది."

"ప్రస్తుతం తెలుసుకోటానికి ప్రయత్నించకు. తర్వాత నీకే తెలుస్తుంది. మరో సంగతి. డాక్టర్ గిరిధర్ మానసిక పరిస్థితి అంతబాగా లేదు. ఆయన్ని కొంచెం కనిపెట్టి వుండు. నేనూ, రఘూ యిప్పుడే బయలుదేరి, కలరా ఎయిడ్ కోసం మాధవపురం వెడుతున్నాం."

"అదేమిటి, అందరూ రేపు బయల్దేరదామనుకున్నాముగా?"

"అందరూ ఎవ్వరూ లేరు. మొన్న డాక్టర్ గిరిధర్‌గారి వుపన్యాసం ఫలితంగానూ, తదితర కారణాల వల్లా, అందరూ వెనక్కి తగ్గేశారు."

"మరి నేను?"

"పద్మకి నింపాదిగా వున్న తర్వాత నువ్వు బయల్దేరి వచ్చెయ్యి"

"పద్మ పరిస్థితిలా వుండగా వెళ్ళిపోతున్నావా వేణూ?"

"పద్మ బ్రతక్కపోతే నేనిక్కడ చెయ్యగలిగిందేమీలేదు. బ్రతుకుతే నేనిక్కడుండక పోవడమే మంచిది. ఇంక ప్రశ్నలు వెయ్యద్దు లిల్లీ."

(సశేషం)

కన్నెచెర

కథ ఎక్కడన్నా ప్రారంభం గావచ్చు. కాని అది పల్లెకన్నా పేటలో, పేటకన్నా పట్టణంలో ప్రారంభం కావడం మంచిదని విజ్ఞుల అభిప్రాయం. పట్టణంలోనైతే కథ రిక్షా లెక్కవచ్చు. బస్సుల్లో పరుగెత్తవచ్చు. హోటళ్ళలో దూరవచ్చు. సినిమాలు చూడవచ్చు. పల్లెలో ఈ సదుపాయాలు మృగ్యం. కానీ నగరవాసుల్లో సైతం కొందరు రిక్షా లెక్కడం లేదనీ, బస్సుల్లో పరుగెత్తడం లేదనీ, హోటళ్ళలో దూరడంలేదనీ, సినిమాలు చూడడం లేదనీ పాపం, ఈ కథకు తెలియదు. అందుకనే యిది ఒకానొక మహానగరంలోనే ప్రారంభమౌతోంది.

ఆ నగరాన్ని గురించి ప్రత్యేకంగా చెప్పుకోవలసిందేమీ లేదు. సగటు లెక్కన అయిదు నిమిషాల కొక బస్సు ఆ నగరంలోకి రాకపోకలు కొనసాగిస్తుంది. సాయంకాలమైతే రోడ్లపైన క్రిక్కిరిసిన జనాలమధ్య మిడిగాళ్ళు నలిగిపోకుండా నడవడం కష్టం. క్రొత్త సినిమా విడుదలైతే వారం పది రోజులపాటు టిక్కెట్లు దొరకవు. రాజకీయ సభలు జరిగినా, గుడిలో తిరణాలు జరిగినా హోటళ్ళ ముఖద్వారంలో "భోజనం లేదు" అన్న బోర్డు వ్రేలాడుతుంది. ఇలాంటి వివరా లెన్నయినా చెప్పవచ్చుగానీ, వీటివల్ల ఈ కథకు లాభించేదేమీ లేదు. ఎందుకంటే దురదృష్టవశాన ఈ కథ విహరించే రంగభూమి చాలాచిన్నది. ఉదహరింప బడిన నగరంలో మునిసిపాలిటీవారు శ్రద్ధా


మధురాంతకం రాజారాం

సక్తులతో పెంచి పోషిస్తున్న ఉద్యాన వనం ఒకటి వుంది. సదరు వనంలో అంతగా జనం నడయాడని మారుమూల చోటు పచ్చిక జొంపాల మధ్య, కన్నతల్లిలాంటి గానుగ చెట్టు నీడలో ఓ సిమెంటు బెంచీ వుంది. ఆ పార్కు బెంచీచుట్టూ ఈ చిన్న కథ గిరవాట్లు కొడుతుంది. (ఒకటి రెండు సార్లు దారితప్పినట్లుగా యిది నగరంలోకి గూడా షికార్లు చిత్తగిస్తే, అందుకు మన్నించ వలెనని పాఠక మహాశయులు ప్రార్థితులు.)

నిండుగా పన్నెండేళ్ళ నుంచీ ఆ బెంచీ సుందరరామయ్య గారిది! అంతే ఆయన దాన్ని దాన విక్రయాలకు యోగ్యంగా కొనుక్కున్నారని గాదు. సాయంకాలం ఆరు నుంచీ ఏడున్నరదాకా అలవాటుగా అక్కడ కూర్చుంటూ రావడంతో, ఆ బెంచీపైన ఆయనకు నైతికంగా హక్కు ఏర్పడినట్టయింది. ఈ విషయం తెలిసిన వాళ్ళెవరూ ఆ బెంచీ దరిదాపులకైనా వచ్చేవారు కారు. ఒక్కొక్కప్పుడు తెలియని వాళ్ళెవరైనా ఆ బెంచీని ఆక్రమించడంకద్దు. కాని ఒకటి రెండురోజుల్లో వాళ్ళే సుందరరామయ్య గారి నైతిక హక్కును గుర్తించి సద్దులేకుండా తప్పుకునేవారు. కానైతే నాటికీ నేటికీ ఈ నియమాన్ని అతిక్రమించిన వ్యక్తి ఒక్కడే ఒక్కడు. అతడిపేరు వెంకట్రావు.

ఏదో పనిమీద ఒకసారి సుందరరామయ్య గారు గ్రామాంతరం వెళ్ళవలసి వచ్చింది. ఒకటి రెండు వారాలపాటు ఆయన స్వస్థలానికి తిరిగి రాలేకపోయారు. ఆ లోగా ఏం జరిగిందంటే — ఈ వెంకట్రావన్న నడితరం మనిషి ఒకనాటి సాయంకాలం కాసేపు కులాసాగా కాలక్షేపం చేసి వెళ్దామన్న ఉద్దేశంతో పార్కులోకి వచ్చాడు. కదలి నడుమ నిర్జనద్వీపంలా వున్న ఖాళీ బెంచీనిచూశాడు. చల్లటిగాలి, నీటి చిమ్మలోనాని అదొక రకమైనసువాసన్ని వెరపుతున్న పచ్చిక జొంపాలు, వాటి కవతల కట్టని కోటలాగా దట్టంగా నిలబడివున్న క్రోటన్ మొక్కలు, ఆ ఏకాంత ప్రదేశాన్ని అతడు ఒక పట్టాన వదలి పెట్టలేక పోయాడు. మరునాటి సాయంకాలం గూడా అతడి కాళ్ళు అతణ్ణి అప్రయత్నంగా అక్కడికి తీసుకొచ్చేశాయి. అలా నాలుగైదు రోజులు గడిచే సరికి ప్రయాణం చేసిన కొద్దిసేపట్లో కంపార్టుమెంటులోని సుఖాసనం తనదే ననుకునే రైలు ప్రయాణికుడిలా వెంకట్రావు ఆ సిమెంటు బెంచీ యిక తనదె ననుకున్నాడు.

అంతలో సుందరరామయ్యగారు



గూడా గ్రామాంతరం నుంచీ తిరిగి వచ్చేశారు.

ఆ పార్కు బెంచీ దగ్గర ఈ అపరిచిత వ్యక్తు లిద్దరూ ఒకరి కొకరు తారస పడిన సంఘటన నాలుగేళ్ళ నాటిది. ఆ బెంచీతో సుందరరామయ్యగారికున్న అనుబంధాన్ని గురించి వెంకట్రావుకు బొత్తిగా తెలియదు. తనలాగే యింకొక వ్యక్తి అక్కడ కూర్చో దలచుకుంటే అందుకు అడ్డుతగిలే ఉద్దేశం వెంకట్రావుకు ఏ కోశానా లేదు. కానీ సుందరరామయ్యగారి సంగతలాకాదు. నోరు విడిచి చెప్పక పోయినా, ఆయన తన వైమనస్యాన్ని రకరకాలుగా ప్రకటించి చూపాడు. తన కంత చేరువగా ఒక అజ్ఞాత వ్యక్తి పొలకువను సహించడం కొద్ది రోజుల వరకూ ఆయనకు కష్ట సాధ్యంగానే వుండి పోయింది. ఆయన ఎదుటి వ్యక్తి వైపు విరోధిని చూసినట్టే చూచాడు. అతణ్ణి సరస్కారహీనుడైన మోటు మానిసిక్రిందనే తెక్కగట్టాడు. కానీ తనపట్ల సుందరరామయ్యగారిలో చెలరేగుతున్న వ్యతిరేక భావాలను గురించి పట్టించుకున్నాడుగాడు వెంకట్రావు. అతడు పొగచుట్ట కాల్చుకునేవాడు. గడ్డిపోచ నములుకునేవాడు. ఏడు కొట్టగానే లేచి తన దారిన తాను వెళ్ళిపోయేవాడు.

సఖ్యం సాప్తపదీనమంటారు. ఏడురోజులు గాదు, ఏడు నెలల

పాటు ఒకచోట కలిసి కూర్చున్నా ఆ యిద్దరూ ఒకరితో ఒకరు మాట్లాడుకోలేదంటే ఆ మాట విన డానికి విడ్డూరంగానే వుంటుంది. కానీ అది పట్టి నికరమైన నిజం మాత్రమే! అలా మరికొంత కాలం గూడా గడిచిపోయి వుండేదే! కానీ పరిణామాలను సృష్టించడం కాలానికి సహజగుణం! సుందర రామయ్యగారొకరోజు ఒంటరిగా పార్కు బెంచీపైన కూర్చున్నారు. ఆ పాటికే వెంకట్రావు అక్కడికి వచ్చి వుండవలసింది. రాలేదు. ఆలస్యంగా రావచ్చుననే భావిం చారు సుందరరామయ్యగారు. ఆ రోజె గాదు, ఆ మరునాడు గూడా వెంకట్రావు జాడ కనిపించింది గాదు. అందువల్ల హఠాత్తుగా అత డేమై వుంటాడన్న జిజ్ఞాస ఒకటి గట్టిగా పట్టుకుంది సుందరరామయ్య గారిని. మనిషేమంత ఆరోగ్య వంతుడుగా కనిపించడు. కొంపదీసి జబ్బున పడ్డాడేమో! ఈ వూహ నిజంగాకపోతే ఆఫీసులో పని హెచ్చి వుండవచ్చు. అదీ గాక పోతే బంధు కార్యార్థమై పరస్థలం వెళ్ళాడేమో! ఐనా తన కెందుకీ ఆలోచన? అతడేమై పోయినా తనకు నష్టమయ్యే దేముంది? నష్ట మయ్యే దేమీ లేకపోయినా, అత డేమైనా అయిపోవడం తన కిష్టం లేనట్టుంది. ఎందుకు? అందుకే కాబోలు మానవుణ్ణి సంఘజీవి అన్నారు పెద్దలు.

వరుసగా నాలుగు రోజులు గైర్ హాజరైన తర్వాత అయిదో నాటి సాయంకాలం పార్కులో ప్రత్యక్ష మయ్యాడు వెంకట్రావు. ఎన్నడూ లేనిది సుందరరామయ్యగా రానాడు వెంకట్రావును పలక రించారు. ఆ పలకరింపులో కూడా ఎంతోకొంత ముభావం లేకపోలేదు. "ఈ మధ్య ఎందుకో ఈ వైపువచ్చి నట్టులేదు." అన్నాడాయన. ఆ మాటతో తూము తలుపు తీసివేసి నట్టయింది. తూముగుండా చెరువు నీరు దూసుకొచ్చినట్టు వెంకట్రావు తన సొద వెళ్ళబోసుకున్నాడు. "ఏం చెప్పమంటారండీ! ఈడొచ్చిన ఆడబిడ్డను యింట్లో వుంచుకోనడం నిప్పును ఒడిలో మూట గట్టుకోన డమేనంటారు! మూడేళ్ళ నుంచీ ఒకటే ప్రయత్నం.- వివాహ ప్రయ త్నం! అనంతం పంతుల్ని ఎరుగు దురా, అతడే మా పెళ్ళిళ్ళ పేరయ్య! మూడేళ్ళలో ఏడు సంబంధాలు తీసుకొచ్చాడు. కొన్ని మాకు, కొన్ని వాళ్ళకు నచ్చక ఆ సంబం ధాలు వీగిపోయాయి. మొన్న తెచ్చింది ఎనిమిదో సంబంధం.



దూరా భారమునైనా ఎంచక రెండు వందల మైళ్ళదూరం వెళ్లొచ్చాము. తీరా వెళ్ళి మాట్లాడితే వాళ్ళరేటు యిరవైవేలని తెలిసింది. ఎక్కడి నా బ్రతుకు, ఎక్కడి యిరవైవేలు! నా జీవిత కాలంలో నేను సంపాదించిన దంతా కలిపినా యిరవైవేలుండదు."

"అయ్యో పాపం! ఆడ పిల్లలకు పెళ్ళిళ్ళు కావడమంటే అవస్థేనట! నాకు తెలియదు. కానీ ఎవరినోట విన్నా అదేమాట!"

సుందరరామయ్యగారు వ్యక్తం చేసింది సానుభూతి అవునో కాదో వెంకట్రావుకు అంతుబట్టలేదు. అతడు ప్రశ్నించాడు.

"మీకు ఆడపిల్లలు లేరటండీ?"

"అబ్బె, లేరు, లేరు." పై కప్పునుంచి పైనబడిన తేలునో, జెర్రినో విదిలించుకున్నట్టుగా అన్నారు సుందర రామయ్యగారు. "ఉండే ఆ బాధలు పడలేక ఉరి బోసుకుని చచ్చేవాడినేమో! ఎందుకంటే నాకీ సాయం చేసి పెట్టుమని ఒకర్ని ప్రాధేయపడడ మంటే నాకు ప్రాణాలు పోయినంత పని! ఈ రోజుల్లో ఆడపిల్లల్ని కన డమే పెద్ద నేరంలా వుంది. ఆ నేరానికి విధింపబడుతున్న శిక్షలు గూడా చాలా దారుణంగా వున్నాయి. కాకపోతే వేలదగ్గర

నుంచీ లక్షలవరకూ అపరాధాలా? అవి సరిగ్గా చెల్లించుకోలేకపోతే అవమానాలా? ఏమిటండీ ఈ పీడన? ఎందుకండీ ఈ యాతన? ఐనా ఏమిటండీ ఈ సమాజపు తీరు? దొంగతనం, దగా, ఖూనీల లాంటి నేరాలు చేస్తే ఆ నేరస్తుల్ని ప్రభుత్వం కారాగారంలో పడవేసి వాళ్ళ శరీరాలను మాత్రం శిక్షిస్తుంది. ఆడపిల్లల్ని గన్న పెద్ద మనిషికి ఈ సమాజంలో ఎదురౌతున్న మానసిక క్షోభతో పోల్చిచూస్తే ఆ శిక్ష ఏపాటిది? అందుకే నా మట్టుకు నాకు ఈ ఘోరకలిని సమూలంగా చీల్చి చెండాడేయాలనిపిస్తుంది. గంగాదేవి తనబిడ్డల్ని నదిలో పారవేసిందంటే అందుకిదే అర్థం కావచ్చు. వాళ్ళు బహుశా ఆడబిడ్డలై వుంటారు..."

తలపైన ఒక రాతిదిమ్మ పడినట్టుగా వెంకట్రావు స్తబ్ధుడై పోయాడు. సుందరరామయ్యగారు చెప్పినట్లుగా ఆడపిల్లల్ని కనడం గొప్ప నేరమే! అలాగైతే ఆ నేరానికి విధింపబడుతున్న శిక్షల్లో ఇలా సహృదయతకు నోచుకోని కర్కశమైన సానుభూతిని భరించడంగూడా ఒకటేమో!

కొంచెం తేరుకున్నతర్వాత అడిగాడు వెంకట్రావు - "మీకు మగపిల్లలైనా వున్నారా బాబూ?"

"లేకేం!" - టక్కుమని వచ్చింది సమాధానం. "ముగ్గురు కొడుకులు. పెద్దవాడు యం. యే వ్రాయబోతున్నాడు..."

అంతటితో సుందరరామయ్యగారూరుకుంటే బాగుండుననుకున్నారు వెంకట్రావు. కానీ కుమారుణ్ణి యం. యే. దాకా చదివించిన తండ్రి, అతణ్ణి గురించి మరికొన్ని మాటలు చెప్పకుండా వూరుకోడం ఎలా కుదురుతుంది? ఆయన కొనసాగించారు.

"మా కృష్ణమూర్తికిది యిరవయ్యో సంవత్సరం. ఎలిమెంటరీ స్కూల్లో అయిదేళ్ళు. హైస్కూల్లోనూ, కాలేజిలోనూ ఆరురెండ్ల పన్నెండేళ్ళు వెరశి పదిహేడేండ్లు పోగా ఆ లెక్కన నాలుగో యేడు పెట్టగానే వాణ్ణి బడిలో చేర్చి వుండాలన్నమాట! ఏమంటారు? ఇది నిజంగా అబ్బురంగా లేదూ?"

అసలు మగపిల్లల్ని కనడమే అబ్బురం; పైకి చెప్పలేదు. మనసులోనే అనుకున్నాడు వెంకట్రావు.

"మా వేలు విడిచిన బావమరిది ఒకతను ఢిల్లీలో పనిచేస్తున్నాడు. పరీక్ష వ్రాయడమే తరువాయి, అబ్బాయినక్కడికి పంపించేయమంటున్నాడు. అక్కడ వుద్యోగాలకేమి, కోకొల్లలు. కానీ నాకే వాణ్ణి అంతదూరం పంపడం యిష్టంలేదు. కి, బొంబాయి, బెంగుళూరు అంటూ దేశంపైన పడేగ్రహచారం వాడికేముంది? ఇంట్లో కూర్చున్నా వెదుక్కుంటూ రాదా ఉద్యోగం?"

ఉద్యోగంమాత్రమేనా, అమ్మాయి గూడా వెదుక్కుంటూ వస్తుంది. వాడికేం బాబూ అదృష్టవంతుడు. వాడి జీవితం వడ్డించిన విస్తరి. ఎటొచ్చీ చెడిపోయింది నేనూ, నా కూతురే - అంటూ ఎలుగెత్తి అరవాలనిపించింది వెంకట్రావుకు!

కానీ అలా కాకుండా మరొక విధంగా చెప్పి ముగించాడు వెంకట్రావు.

"మా వైదేహికి మాత్రమేముంది! కట్నాలకోసం వేలు లక్షలు గడించి పెట్టకపోవడం నా తప్పు. అంతేగాని మా అమ్మాయి గుణవంతురాలు. అందమంటారా, చిదిమి దీపం పెట్టుకోవచ్చు. ఎన్ని కష్టాలున్నా ఎసెసెల్సీ దాకా చదివించాను. మా అమ్మాయి గనుక నేనేం చెప్పినా అది డాబుగానే కనిపించవచ్చు. హెడ్ మిస్ట్రెస్ కాంతామతి నడిగితే ఆవిడే చెబుతుంది. మధ్యాహ్నల్లో ఆవిడ మా అమ్మాయిని ఇంటికి రానిచ్చేది కాదు. ఎండలో కందిపోతుందేమోనని తన కారియర్ భోజనంలో మా వైదేహికి కూడా వాటా యిచ్చుకునేది..."

ఇంత చెప్పిన తరువాత వెంకట్రావు తల పైకెత్తి చూచాడు. సరిగదా, సుందరరామయ్యగారు తన మాటల్ని వింటున్నట్టే లేదు! ఎంతయినా ఆడబిడ్డే గదా అన్న తృణీకారభావం ఆయన ముఖంలో స్పష్టంగా కనిపిస్తూనే వుంది.

వెంకట్రావుకు కోపం వచ్చింది. ఆ వచ్చిన కోపం మూడు పాయలుగా చీలింది. ఒకటేమో సుందరరామయ్యగారి పైకి! ఉన్నపాటున ఆయనకో అరడజన్ మంది ఆడపిల్లలు పుడితేగాని ఆ కోపం శాంతించదు. రెండో పాయ తన పైకి! రాత్రికి రాత్రే లాటరీలో ఓ లక్ష రూపాయలు చేతికొస్తేగానీ ఈ కోపం చల్లారదు. మూడో పాయ సమాజంపైకి! ఈ ఏడువుగొట్టు సమాజంలో మగవాడికో మదింపు. ఆడదానికో మదింపు. మళ్ళీ సోషలిజం కావాలనీ, రావాలనీ ఆందోళన!

ఆ రోజు రాత్రి యికమీదట పార్కుకు వెళ్ళగూడదన్న నిర్ణయానికి వచ్చాడు వెంకట్రావు. కానీ మరునాడంతా ఆలోచించి తన నిర్ణయాన్ని మార్చుకున్నాడు. పగలంతా ఆఫీసులో నిర్విరామంగా పనిచేయాలి. ఇంటికి వెళ్తే అశాంతి. మధ్యలో పార్కులో గడపుతున్న

కాలమే తన శరీరానికైనా, మనసుకైనా విశ్రాంతి. సుందరరామయ్యగారికి భయపడి తానీపాటి భాగ్యాన్ని గూడా ఎందుకు కోల్పోవాలి? ఎటొచ్చీ తాను తన దైన్య స్థితిని వెళ్ళబోసుకోకుంటే చాలు. ఈ లోకంలో ఎవడి గోడును ఎవడు వింటున్నాడు? ఆర్చేదెవరు? శరీరం తమది గాకపోతే కాశీదాకా ప్రాకమనే మనుషులు వీళ్ళు? ఎద్దు పుండు కాకికి నొప్పా? నెమలి కంట్లో నీళ్ళుకారితే వేటగాడికి నష్టమా?

పార్కులో కూర్చున్నంతసేపు వెంకట్రావు రాజకీయాలను గురించి మాట్లాడేవాడు. సాహిత్యాన్ని చెడ విమర్శించేవాడు. సంఘం పైన దుమ్మెత్తి పోసేవాడు. విద్యా విధానాన్ని ఈసడించి పారవేసేవాడు. కానీ ప్రసంగం వ్యక్తిగత విషయాల దగ్గరికి వచ్చేసరికి తనకు సంసారమంటూ ఒకటి లేనట్టు మూకీభావం వహించేవాడు. కానీ ఎల్లకాలమూ కాలం ఒక మాదిరిగా గడవదు. అందుకే యిది నా అభిప్రాయం, యిదే నా స్వభావం అంటూ తనకొక స్థిరమైన ఆకృతిని రూపించి చెప్పే మానవుడు అల్పజ్ఞుడేమోనని పిస్తుంది. ఎందుకంటే, ఓ రాతిని తీసుకెళ్ళి సముద్రపుటంచులో పడవేస్తే అలల అటు పోట్లవల్ల అది రోజుకొక రకంగా మారుతుంది. ఒకే చెట్టు ఋతుభేదాలవల్ల ఏడాదికి వెయ్యిరూపాలు ధరిస్తుంది. ఇక గాలికన్నా చంచలమూ, నీటికన్నా ప్రవాహ శీలమూ కలిగిన మానవ స్వభావం పైవాటికన్నా విభిన్నంగా ఎలా వుండగలుగుతుంది? మార్పు మానవ స్వభావం. ఈ కథలో వచ్చిన మార్పు ఎలా వచ్చింది, ఎవరిలో వచ్చింది అన్నదే ప్రస్తుతాంశం.

ఉన్నట్టుండి పార్కు బెంచీ చిన్నబోయింది. బెంచీ చిన్నబోవడమేమిటని ప్రశ్నించవచ్చు. జంటపక్షుల్లో ఒకటి కనిపించకపోతే గూడు చిన్నబోవడం లేదా? బెంచీ విషయంలోనూ అదే జరిగింది. ఈసారి కనిపించకుండా పోయిన వ్యక్తి సుందరరామయ్యగారు. ఆ కనిపించకపోవడం గూడా ఒకటి రెండు రోజులుగాదు. నిండుగా నెలరోజులు!

సుందరరామయ్యగారు ఏమైనట్టు, ఎక్కడికి వెళ్ళినట్టు, ఏం చేస్తున్నట్టు — మున్నగు ప్రశ్నలు వెంకట్రావును తీవ్రంగా ఎదుర్కొన్నాయి. వాటి కతను ఠకరకాల సమాధానాలు గూడా చెప్పుకున్నాడు. కానీ వాస్తవం తెలిసి పశ్చాత్య జీవితాన్ని పరిశీలించడానికి కేవలం ఊహాలే చాలవనీ, కొంత అనుభవం గూడా కావాలని వెంకట్రావు గ్రహించాడు.

నెలరోజుల్లో సుందరరామయ్యగారు చాలా మారిపోయారు. హఠాత్తుగా వయస్సు నాలుగేళ్ళు మీరినట్టుగా ఆయన ముఖంలో వృద్ధాప్యపు ఛాయలు కానవస్తున్నాయి. ఉన్నచోట మినుకుమినుకుమింటూ, పరిసరాలకు కాంతినివ్వని గుడ్డి దీపాల్లా ఆయన కళ్ళు సులోచనాలక్రింద జోగుతున్నాయి. ఏదో అమూల్యమైన వస్తువును ధారబోసుకుని మతి గోల్పోయినవాడిలా ఆయనలో వెర్రి వాలకం గూడా ద్యోతకమౌతోంది.—

"ఏమండీ! ఒంట్లో బాగా లేదా ఏమిటి?" వెంకట్రావు పరామర్శించాడు.

సుందరరామయ్యగారు అసలే నిప్పులం వున్నాడేమో? ఈ పరామర్శవల్ల అగ్నిపైన ఆజ్యం పడ్డట్టయింది.

"అయ్యా వెంకట్రావూ! ఢిల్లీ ఎక్కడుందో తెలుసా నీకు? నాకు తెలుసు - దేశపటాల్లో మాటి తనిఖీ తీరక డబ్బు దండుగకు ఓర్చుకుని అంతదూరం వెళ్ళొచ్చాను గనుక! నీకిదవరకే చెప్పానేమో, అక్కడ నాకొక బంధుసత్తము డున్నాడని! అతగాడు త్రవ్వి తల కెత్తేసాడనే అనుకున్నాను. అడిగినప్పుడల్లా చూద్దాం గీద్దామని తాళజెప్పి, చివరకు యిరవైరోజుల తర్వాత నిలదీసి అడిగితే 'అదేమిటోయ్ బావా! ఇక్కడున్న వాళ్ళందరూ జేబుల్లో ఉద్యోగాలను వేసుకుని తిరుగుతున్నారా, అడ్డగానే ఒకటినీ దోసిట్లో పారవేయడానికి!' అంటూ తేల్చిపారేశాడు. —'అదేం మాటయ్యా! మనవాడు చదువుకున్నదేమీ నాలీసు చదువుకాదు' అన్నాను. 'ఇది మరీ బాగుంది! ఇక్కడ అలాంటి చదువు చదువుకున్నవాళ్ళు యింటికొకరున్నారు' అన్నాడు— విన్నావా! ఇదీ కథ!"

"అదేమిటండీ సుందరామయ్యగారూ! మీ అంతటివారు మీరు ఒక సాయం చేసిపెట్టమని అడగడమే గొప్ప! అది తన చేతిలోని పనే అంటే ఆ మాత్రం చేసిపెట్టలేకపోయాడా ఆ పెద్దమనిషి!"

"ఆ మాటన్న తర్వాత అతని ముఖం చూడ్డానికే బుద్ధయింది కాదు. ఆ సాయంకాలమే బయల్దేరి తిరిగొచ్చేశాను."

"పోనీ యిక్కడెక్కడైనా ప్రయత్నించలేక పోయారా?"

"ప్రయత్నలోపమటయ్యా

వెంకట్రావ్! అబ్బే, అదేం లేదు. నీకు నోరువిడిచి చెప్పలేదంతే! అబ్బాయి కాలేజీనుంచీ వచ్చి రెండేళ్ళయిందా, ఈ రెండేళ్ళలో ప్రయత్నం చేయని రోజు లేదు. రోజుకొక అప్లికేషను. రాజుగారి వెంట అంగరక్షకుల్లాగా ప్రతి అప్లికేషనుకూ జతగా పది పన్నెండు సర్టిఫికెట్లు, నాటిమీద సంతకాల కోసం, గెజెటెడ్ ఆఫీసర్ల దగ్గరకు పరుగెత్తడాలు! వెరశీ, ఒక్క అప్లికేషను పంపుకోడమంటే ఒక చిన్న యాగం చేసినంత తతంగం! పోగా యించుమించుగా నెలకొక యింటర్వ్యూ. అది ప్రాక్పశ్చిమ సముద్రాల మధ్య, ఆసేతు హిమాచలాలమధ్య ఎక్కడైనా జరగవచ్చు. దూరమని వెనుకాడగూడదు. దొరకదని నికరంగా తెలిసేదాకా, ఉద్యోగం దొరకుతుందనే అనుకోవాలి. దూరంనుంచీ అవకాశం కొండలా కనిపిస్తుంది. దగ్గరికి వెళ్తే మంచులా విడిపోతుంది. ఇక శ్రేయోభిలాషులున్నారే, వాళ్ళదొక ఎడతెగని పోరు. "ఏమండీ! అబ్బాయి ఏంచేస్తున్నాడు? ఇంకా ఖాళీగానే వున్నాడా? అయ్యో, ఎందుకండీ? మీ వాడికే ఉద్యోగం దొరక్క పోవడమా! అంటూ పేదార్పు మాటలు! ఫలానా చోట ప్రయత్నించలేకపోయారా. ఫలానా పెద్దమనిషిని కలుసుకోలేక పోయారా అంటూ సలహాలు! అంతెందుకూ! ఎడారిలో ఎండమావులుంటాయని చదువుకోలేదటయ్యా వెంకట్రావ్! ఈ రోజుల్లో ఆ ఎండమావికి పర్యాయ పదమే ఉద్యోగం!"

"నిస్పృహ పడిపోతే ఎలాగండీ సుందరరామయ్యగారూ! ఓర్చుకోవాలి, మరి, ఓర్చుకోకుంటే ఓరుగల్లు పట్టణమవుతుందా?"

సుందర రామయ్యగారు ఏడుపు మొగం పెట్టేశారు—"సంగతి సందర్భాలు తెలిస్తే నువ్విలా కన్నుతుడుపు మాటలనేవాడివా వెంకట్రావ్! నాకీ పట్టణంలో ఉద్యోగ సద్యోగాలేమీ లేవు. కేవలం బిడ్డల చదువు కోసమని యిక్కడికి వచ్చాను. పల్లెలో అయిదెకరాల మాగాణీ మాత్రం వుంది. దాన్ని బ్యాంకులో తనఖాపెట్టి ఆ డబ్బుతో పెద్దవాణ్ణి యిందాకా చదివించాను. రెండోవాణ్ణి మూడేళ్ళప్పుడే కాలేజీలో చేర్చి వుండవలసింది. ఒక్కసారిగా ఖర్చులూ భరించడం కష్టమని, పెద్దవాడికొక ఉద్యోగం దొరికి నాలుగురాళ్ళు చేతికొచ్చేదాకా రెండోవాడి చదువు వాయిదా వేశాను. వాడు మాత్రం గోళ్ళు గిల్లుకుంటూ నాలుగు గోడల

మధ్య ఎంత కాలమని కూచుంటాడు? అదృష్టం పరీక్షించుకోదలచినానని ఓ చీటీ వ్రాసిపెట్టి యింటినుంచి వెళ్ళిపోయాడు. వాడిపైన బెంగతో మా అవిడ చిక్కి సగమై పోయింది. పట్టణంలో ఈ కాపురం వెలగబెట్టింది చాలు గాని వూరికి వెళ్ళిపోదామని చెవిలో యిల్లు గట్టుకుని సతపోరుతోంది. పెద్దవాడికేదైనా ఉద్యోగం దొరికితే నిశ్చింతగా వూరి ముఖం పట్టవచ్చునని నా ఆశ!"

గంట ఎనిమిది దాటిందేమో రేడియో గొంతుకకుగూడా మూగతనం సిద్ధించింది. పార్కులో జనసంచారం బాగా తగ్గిపోయింది. వృద్ధులిద్దరూ రోడ్డుపైకి వచ్చారు. అరమైలు దూరం నడిచారు. సందుమొగలో నిలబడి వెంకట్రావు "నేనిలా వెళ్ళాలండీ సుందర్రామయ్యగారూ! సెలవిప్పిస్తే వెళ్లొస్తాను" అన్నాడు, "అరరే, నువ్వీ సందులోనేనా వుండడం! చూచావా వెంకట్రావ్! ఇన్నాళ్ళుగా పరిచయం వున్నా నీ యిల్లెక్కడో, నీ బ్రతుకెట్లాగో తెలుసుకోకుండా వుండిపోయాను. అంటే ఏమన్నమాట? మనం మనుషులంగానే పుట్టినా మనుషులంగా బ్రతకడం లేదన్నమాట! పద పద, ఈరోజు కాసేపు నీయింట్లో కూర్చునే వెళ్తాను..."

వెంకట్రావుకు ఆశ్చర్యంకలిగింది. అతడెన్నడూ సుందర్రామయ్యను తనతో సమానుణ్ణుగా ఊహించలేదు. ఆఫీసులో పై అధికారి తనకు ఎలాంటివాడో సంఘంలో సుందరరామయ్యగారు తనకలాంటివాడని మాత్రమే భావించాడు. కలెక్టరుగారు ఒక గుమస్తా వెంట అతడి ఇంటికి బయల్దేరడం ఎంత విడ్డూరమో, సుందరరామయ్యగారు తన యింటికి రాగోరడమూ అంతే విడ్డూరం.

వెంకట్రావు కాపురముంటున్నది రెండంకణాల పెంకుటిల్లు. దాన్ని గత శతాబ్దం తాలూకు మధ్య తరగతి గృహ శిల్పానికి ఒక నమూనాగా పేర్కొనవచ్చు. ఇంటికి వేసినకలప, పైన పెంకులు, క్రింద గోడలు, యివన్నీ కాలక్రమాన తను పుట్టుకతోవచ్చినరంగును గోల్పోవడంతో అది ఒకానొక నల్లటి లోహంతో పోతపోసిన కట్టడంలా దృగ్గోచరమౌతోంది.

"సుందరరామయ్యగారూ! నేను పిలవకపోయినా మీరు మాయింటికి రావడం మా అదృష్టం. ఎలాగూ రానే వచ్చారు గనుక భోజనం చేసే వెళ్ళాలి" అన్నాడు వెంకట్రావు.

"అబ్బే, వద్దు బాబూ! భోజనానికి యింటికే వెళ్తాను. కాసిన్ని

మంచి నీళ్ళిప్పిస్తే చాలు' అన్నారు సుందరరామయ్యగారు.

"అమ్మాయ్, వైదేహీ! ఇంట్లో పాలుంటే కాస్తా వెచ్చజేసి తీసుకొస్తావటమ్మా!"

"అలాగే నాన్నా!"

సుందరరామయ్యగారికా కొత్త చోటు ఒక చిన్న నాటక రంగంలా పొడగట్టింది. తండ్రిపాత్ర రంగం పైన వుండగా, కుమార్తె పాత్ర యింకా యవనికాభ్యంతరంలో వున్నట్టు భాసించింది. ఈ నాటక రంగంపైన తన దిప్పుడు అతిధి పాత్ర. అబ్బో, ఈ విశాల పృధ్వీ వలయంపైన ఎన్ని నాటకరంగాలు! ఎన్ని పాత్రలు! ఎన్ని కథలు!

తలుపు దగ్గర గాజుల చప్పుడు వినిపించింది.

"పరవాలేదు రావమ్మా వైదేహీ! వీ రే సుందరరామయ్యగారు నా స్నేహితులు."

వైదేహీ గ్లాను చేతికిచ్చి సుందర రామయ్యగారికి నమస్కరించింది.

సుందర రామయ్యగారు ఎదుట నిల్చున్న ఆ అమ్మాయివైపు ఓ క్షణం చూచారు. రెండు క్షణాలు చూచారు. మూడు క్షణాలు చూచారు. కళ్ళు చెమ్మగిల్లడంతో తటాలున తల దించుకున్నారు. ఇంతటి అందమైన అమ్మాయా వెంకట్రావు కూతురు? ఈ తన్నుల మిన్నకా యింకా పెళ్ళి గాక పోవడం? ఈ ఒప్పుల కుప్పను ఏలుకోవడానికేనా వేల లెక్కలో కట్నాల బేరాలు?

'గుండె గొంతుకలో కొట్టు మిట్టాడడమంటే ఏమిటో ఆ క్షణాన సుందర రామయ్యగారి కర్ధమైంది. ఆయన వెంకట్రావుతో ఏదో చెప్ప దలచుకున్నారు. కానీ చెప్పలేక పోయారు. ఆ సందిగ్ధ స్థితిలోనే, బరువుగా కాళ్ళీడ్చుకుంటూ యిల్లు చేరాడు.

ఇల్లాలు విస్తరివేసి అన్నం వడ్డించింది.

"ఇదిగో రత్నం! ఓ మాటడుగుతాను నిన్ను! అబ్బాయికి ఉద్యోగం దొరుకుతుందనుకో! మనం పెళ్ళి ప్రయత్నం తలపెట్టామనుకో! ఎలాంటి కోడలు కావాలనుకుంటావు నువ్వు?"

రత్నమ్మ నివ్వెరపోయింది. ఆ యింట్లో శుభ వర్తమానాలు, పరిహాస ప్రసంగాలు, సరాగాలు వినిపించి చాలా కాలమైంది మరి!

"నా కంతటి అదృష్టం గూడానా! ముప్ఫై యేళ్లుగా ఈ కాపురంలో సెలవులేని చాకిరీ చేస్తున్నాను. కోడలొచ్చే దెప్పుడు, నేను సుఖపడే దెప్పుడు?" నిట్టూర్చింది రత్నమ్మ.



తెచ్చికోలు ఉత్సాహం చప్పబడి పోగా సుందర రామయ్య తినీతిన కుండా విస్తరి ముందునుంచి లేచేశాడు—

• • •

కందెనలేని బండి చక్రం గతుకుల బాటవెంట దొర్లినట్టుగా కాల చక్రం పరిభ్రమిస్తోంది. పార్కు బెంచీ పైన మిత్రుల సమావేశాలు మునుపటిలా అంత క్రమబద్ధంగా జరగడం లేదు. కాననంలో మాయామృగాన్ని వెన్నంటి పరుగెడుతున్నట్టుగా ఉద్యోగ ప్రయత్నాల్లో ఒకరు, వివాహ ప్రయత్నాల్లో ఒకరు, వూళ్ళపైన తిరగడం పరిపాటై పోయింది. కొద్దిరోజుల వియోగానంతరం మళ్ళీ పార్కులో కలుసుకున్నప్పుడు ఒకరికొకరు ఏ యే ప్రయత్నం ఏయేవిధంగా నిష్ఫలమై పోయిందీ చెప్పుకునేవారు, చిట్టచివర రివాజు ప్రకారం "మరేం దిగులు పడకండి సుందర రామయ్యగారు! ఇక చదవడానికేమీ మిగల నంతవరకూ కుమారుణ్ణి చదివించారు. ఏవో గ్రహాలు కలిసిరాక పోబట్టిగానీ మీ వాడికి దొరకని

"ఉద్యోగమా!" అని ఒకరు,- "బెంగ పెట్టుకోకయ్యా వెంకట్రావ్! నేను చూచానుగా! మీ అమ్మాయికేం బాబూ; ఆణిముత్యం! కాలం కలిసి రావాలంతేగానీ, పెళ్ళి దానంతటదే అయిపోదూ" అని పరస్పరం ఓదార్చుకునే వారు.

రోజులు గడచి పోతున్నాయి.

జరుగుతున్నది చలికాలం. ఓ రోజింకా భళ్ళున తెల్లవారలేదు. రాత్రంతా మంచు సోనలు కురిపించిన నిశాకాంత తెల్లవారు జామున లోకంపైకి ఈదురు గాలుల్ని ఉసి గొల్పుతోంది. ముసలి ప్రాణాలు రగ్గుక్రింద మాంసపు ముద్దల్లా ఒళ్ళు ముడుచుకునే ఆ చలికాలపు చల్లటి ఉదయాన వెంకట్రావు కాపురముంటున్న యింటి. తలుపు దబదబా మ్రోగింది.

"ఎవరు, ఎవరు?" అన్నాడు వెంకట్రావు. "నేను, నేను" అన్నారు సుందర రామయ్యగారు.


గబగబా లేచి వచ్చి తలుపు తీశాడు వెంకట్రావు. సుందర రామయ్యగారు మెల్లగా లోపలికి వచ్చి మంచంపైన కూర్చున్నారు. కూర్చున్న సుందర రామయ్యగారు ఇంటినంతా ఒకసారి కలయజూచి "ఇంట్లో ఎవరూ లేనట్టున్నారే?" అన్నారు.

"ఎవరున్నారు? నేనూ, మా ఆవిడ యిద్దరమే మిగిలాము. ఏం చేయమంటారు సుందర రామయ్య గారూ! ఈ డొచ్చిన అమ్మాయికి పెళ్ళి గాకపోవడముంది చూచారూ! అది ఒక బాధల సముదాయం. వేదనల పుట్ట. ఎలాగంటారా? సాటి బంధువుల్లో చులకన, ఇరుగు, పొరుగువాళ్ళ నిరసన. ఈమె కింకా పెళ్ళి కాలేదా? ఎప్పుడో కావలి సిందే? ఎందుకు కాలేదు? అంటూ సవాలక్ష ప్రశ్నలు. ఇంట్లో కొచ్చి అమ్మాయి ముఖం చూచి నప్పుడల్లా మన కివన్నీ జ్ఞప్తి కొస్తాయి. మనసులో దాచుకోవాలంటే దాగే దిగులా యిది! అది మా ముఖాల్లో వుండనూ వుంటుంది. అమ్మాయి ముఖంలో అద్దంలో ప్రతిబింబంలా కనిపించనూ కనిపిస్తుంది. కొంత కాలంపాటు తానైనా మారిస్తే, ఆమెకూ మాకూ కూడా కాస్త వూపిరి త్రిప్పుకునే వెసులుబాటు చిక్కుతుం దేమోనని ఆశించాను. ఆశించినందుకు తగ్గట్టుగా అమ్మాయి నొకసారి తన దగ్గరికి పంపమని మా భాస్కరం బాబు వ్రాశాడు. భాస్కరమంటే మా వదినగారి కొడుకు. వాడి కక్కచెల్లెళ్ళు లేరు. మా అమ్మాయికా అన్నదమ్ముళ్ళు

లేరు. వైదేహి అంటే వాడికి ప్రాణం. ఆ అమ్మాయినక్కడికి పంపాను.

"చెబితే నమ్ముతారో నమ్మరో గాని వెంకట్రావ్" — సుందర రామయ్య గారు ప్రారంభించారు. "నా కెదురైన బాధగూడా అదే! వీధిలో తలచూపించడానికే భయం. పరిచయమున్న ప్రతివ్యక్తి నిలవేయ గమే! ఏమండీ, సుందరరామయ్య గారూ! మీ వాడికింకా ఉద్యోగం కాలేదా? అయ్యో, యిదేం దౌర్భాగ్యమండీ! చదివించడానికి ఒకపాటు పడ్డారా? మీ శ్రమంతా యిలా అడివిగాచిన వెన్నెలై పోవాలా కర్మ?" అంటూ తాము నేర్చిన జాతీయాలు, సామెతలు అన్నీ ప్రయోగించి నా దుంప తెంచేస్తున్నారు. ఇక వీధిలో నీటి పంపు దగ్గరికి వెళ్ళివచ్చినప్పుడలా మా ఆవిడ నీటితోబాటుగా కన్నీటిని గూడా తెచ్చుకుంటుంది. ఆడవాళ్లు రోజుకొక రకమైన వార్త ప్రచారం చేస్తున్నారట! అబ్బాయిది ఉద్యోగంచేసే ముఖంలా కనిపించడంలేదని ఒకరి సాముద్రికం. అసలు ఉద్యోగం చేసే స్వభావం మా వంశంలోనే లేదని ఒకరి ఊహాగానం. ఆ మాట కొస్తే చదువుకున్న వాళ్ళకందరికీ దొరికి పోతాయా ఉద్యోగాలు అని ఒకరి వ్యాఖ్యానం. ఈ తాకిడికి తట్టుకోలేక అబ్బాయి నాలుగ్గోడల మధ్య మకాం పెట్టేశాడు. తల మాసింది. గడ్డం పెరిగింది. బట్టలు మార్చుకోవాలన్న ధ్యాసే లేదు. ఎప్పుడైనా మాట్లాడితే ఆ మాటలు గూడా అసంబద్ధంగా వున్నాయి. గాలి మార్పు జరగక పోతే చేజేతులా కీడు కొనితెచ్చుకున్నట్టే గావచ్చు. కానీ ఎక్కడికి పంపడం? ఎందుకు పంపడం? ఈ తర్జన భర్జన నెలరోజుల నుంచీ సాగుతోంది. ఇంతలో దేవుడే ఓ మార్గం చూపినట్టుగా నిన్ననే ఓ కాగితం చేతి కొచ్చింది. ఏదో ఉద్యోగానికి హైదరాబాదులో యింటర్వ్యూ. ఈ రోజే పంపాలి. చేత చిల్లిగాను లేదు. ఎంత లేదన్నా వంద రూపాయలు కావలి సొస్తాయి. పల్లెకు వెళ్ళి రావాలన్నా వ్యవధి లేకుండా వుంది..."

"అయ్యో, అదేమిటండీ సుందర రామయ్యగారూ! ఇంత మాత్రానికే యిలా నొచ్చుకోవాలా! పాడు డబ్బు! అది మనం మన అవసరాలకోసం వాడుకోడానికి గాకపోతే మరెందుకు? నా కష్టాలు నా కెన్ని వున్నా, అమ్మాయి పెళ్ళికని రెండువేల రూపాయలు బ్యాంకులో వుంచాను. పది గంటలకుగానీ బ్యాంకి తెరవరు. మీ



కెందుకు! మీరు వెళ్ళండి. అబ్బాయిని ప్రయాణానికి సిద్ధం చేయండి. పన్నెండు గంటలకల్లా డబ్బు మీ చేతిలో వుంటుంది."

సుందర రామయ్యగారికి ఎలా కృతజ్ఞత చెప్పుకోవాలో స్ఫురించిందిగాదు. ఆలోచించగా కృతజ్ఞత తను మాటల్లో వెల్లడించడం అవసరం కాదేమో ననిపించింది. ఎందుకంటే ఆ కృతజ్ఞత హృదయంలో దాచుకోదగినది. కృతజ్ఞతను వెల్లడించినంతమేరకు హృదయం ఖాళీ అయిపోయింది.

● ● ●

నెల రోజుల అనంతరం ఒకనాటి సాయంకాలం పని అంతా పూర్తయ్యాక ఆఫీసు నుంచి వెలుపలికి వచ్చాడు వెంకట్రావు. కార్యాలయం ముంగిట పూలచెట్ల మధ్య తచ్చాడుతున్న సుందరరామయ్యగారు అతనికి హఠాత్తుగా ప్రత్యక్షమయ్యారు.

"ఏమిటండీ యిలా వచ్చేశారు? ఏమిటి విశేషం?" ఆశ్చర్యంతో ప్రశ్నించాడు వెంకట్రావు.

"విశేషమేనయ్యా వెంకట్రావ్! శుభవార్తను నీకుగాక పోతే మరెవరికి చెబుతాను. తెలియగానే రెక్కలుగట్టుకొచ్చేశాను. మా అబ్బాయికి ఉద్యోగం దొరికింది—"

"అలాగా! చాలా సంతోషమండీ సుందర రామయ్యగారూ! కడుపులో పాలు పోసినట్లయింది. ఏదీ కాస్తా వివరాలు, అవీ చెబుదురుగానీ కూచోండి...."

"అసలీ ఉద్యోగమైనా ఒకపట్టాన దొరికిందా వెంకట్రావ్! ఇంటర్వ్యూ కోసం వెళ్ళాడా! దానిలో వీడు సెలక్ట్ కాలేదు. ఆ ఆశాభంగంతో మరీహతాశుడైపోయి,దిక్కుతోచకుండా వీధులవెంట తిరుగుతుండగా ఓ స్నేహితుడు కనిపించాడట! ఎన్నడో హైస్కూల్లో ఒకటి రెండేళ్ళు కలిసి చదువుకున్న స్నేహం. ఆ స్నేహితుడు కృష్ణమూర్తిని తన యింటికి తీసుకెళ్ళాడట. వీడికోసమని వారం రోజులు సెలవుపెట్టి, పనిగట్టుకుని చూడవలసిన వాళ్ళనందరినీ చూచి, చెప్పదగిన వాళ్ళందరితోనూ చెప్పి, చెప్పించి, మెప్పించి ఒప్పించి మొత్తం మీద విశ్వప్రయత్నంతో ఉద్యోగాన్ని రాబట్టేశాడట! మనుష్లుల్లో మంచితనం లుప్తమైపోయిందని అనుకునే వాళ్ళం మనం! ఆ పాపానికిపరిహారం ఎలా చెల్లించుకోగలం? మొదటి నెలజీతం తీసేదాకా ఆ స్నేహితుడు తనను నా... యింట్లోనే వుండి పొమ్మంటున్నా... డనీ, చేత డబ్బు లేకపోవడం... తనకైనా అంతగన్నా...

కనిపించడం లేదనీ అబ్బాయి జాబు వ్రాశాడు...'

'అందుకేనండీ సుందరరామయ్య గారూ! బంధువుల కంటే స్నేహితులే నయమనిపిస్తుంది. మొన్ననే భాస్కరం దగ్గర నుంచి గూడా జాబు వచ్చింది. మీ రొక మంచి కబురు తెచ్చారుగదా, దానికి బదులుగా ఒక శుభవార్త నా జేబులోనే వుంది. ఇదిగో, యిదే మా భాస్కరం వ్రాసిన ఉత్తరం. మీ అబ్బాయికి దొరికినట్టే భాస్కరానికీ ఓ స్నేహితుడు దొరికాడట! అతగాడికి వైదేహిని చూపించి 'ఒరే బాబూ! ఇది మా చెల్లెలు. మేము పెద్దగా కానుకలు, కట్నాలూ యిచ్చుకోలేము. గుణం, రూపం, చదువూ, సంస్కారమూ — యివి మాత్రం చాలు ననుకుంటే నువ్వు మా అమ్మాయిని పెళ్ళాడవచ్చు' అన్నాడట. వైదేహిని చూచినప్పటినుంచీ ఆ అబ్బాయి గూడా యిదే ఉద్దేశంలో వున్నాడట. ఐనా పెద్దవాళ్లు ఒప్పుకోవాలి గదా! వాళ్ళ నాన్నగారి నొకమాట అడిగి చెబుతానన్నాడట! ఇంచుమించుగా ఈ సంబంధం కుదిరినట్టే గనుక నా ప్రయత్నాల్లో నన్నుండమని వ్రాశాడు భాస్కరం!'

అప్పటికి బాగా చీకటిపడింది. మసక చీకటిలో సుందర రామయ్య గారి ముఖం వెలవెల పోతుండడం వెంకట్రావు గమనించలేదు.

'ఎలాగైతే నేమండీ సుందర రామయ్యగారూ! అమ్మాయికి కన్నెచెర తప్పుతోంది అంతే చాలు!'

సుందర రామయ్యగారు గూడా అదే మాట చెప్పబోయారు. కానీ మగపిల్లవాడి విషయంలో ఆ మాట చెప్పడం బాగుండదేమోనని మానేశాడు.

మిత్రు లిద్దరూ ఒకరి కొకరు చేరువగా రోడ్డు వెంట నడవసాగారు. దారి పొడుగునా సంభ్రమోత్సాహాలతో ఏదో చెప్పబోతున్నాడు వెంకట్రావు. కొండంత ఉత్సాహంతో తనను కలుసుకోడానికి వచ్చిన సుందర రామయ్యగారు కొద్ది నిమిషాల సేపట్లో పాతాళానికి క్రుంగి పోయారని వెంకట్రావుకు తెలియదు.

ఆ మాటకొస్తే సుందరరామయ్యగారికి తెలియని విషయాలు గూడా బహుళంగానే వున్నాయి.

ఒకటి. వెంకట్రావు వదినగారి కొడుకు భాస్కరం ఉద్యోగం చేస్తున్నది హైదరాబాదులో నేనని సుందరరామయ్యగారికి తెలియదు. రెండు. కృష్ణమూర్తి కి దొరికిన స్నేహితుడు ఆ భాస్కరమేనని తెలియదు. మూడు. వైదేహిలో, తనకు కోడలు కనిపించినట్టుగా కృష్ణమూర్తి కామెలో అర్ధాంగి కనిపించిందని తెలియదు.

□□□

పుస్తక సమీక్ష

"మల్లెలు"—కథామాలిక

ఇది కొత్తగా వెలువడిన కథా సంకలనం. ఇందులో అయిదుగురు రచయితల తొమ్మిది కథలున్నాయి.

ఈ రచయిత లందరు విద్యార్థులే కావడం ఒక విశేషం. వీరిలో ముగ్గురివి (ఏ ముగ్గురివి?) ప్రారంభ రచనలు కావడం మరొక విశేషం. సాధారణంగా మన రచయితలు ముందుగా పత్రికలద్వారా పాఠకులకు పరిచయం కాని కథలను గ్రంథస్థం చేయడానికి సాహసించరు. వీరు అలా కాకుండా తమ రచనలను ధైర్యంగా, నేరుగా పుస్తక రూపంలోనే ప్రచురించారు. ఇది ఇంకొక విశేషం.

మొదటి మూడు కథలు శ్రీరామకృష్ణవి. చక్కని కథాకథన శిల్పం సాధించడానికి తీవ్ర ప్రయత్నం వీరి కథలలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. 'ఆకాశం తెల్లబోయింది' అనే దానిలో కోతలు కొయ్యడం అలవాటైన ఒక పెద్దమనిషి అబద్ధాలన్నీ బయటపడడం ఇతివృత్తం. కొస మెరుపుతో కథ ముగుస్తుంది. 'నడుస్తున్న చరిత్ర' అనే కథ దేశభక్తులుగా, ప్రజాసేవకులుగా చెలామణీ అవుతున్నవారిపై సెటైర్. 'జ్ఞాతృత్వం' లో మామూలుగా యువకులకు విద్యార్థి దశలో కలిగే అవ్యక్త వేదన, ఏదో తెలియని త్రిల్ కోసం ఆరాటం వర్ణితమయ్యాయి. కథానాయకుడు సోమసుందరం చివరకు (బహుశా త్రిల్ కోసం) ఆత్మహత్య చేసుకోవడంతో కథ ముగుస్తుంది.

రెండవ రచయిత శ్రీ భాస్కర్. కథ పేరు 'అన్వేషణ'. దూరదేశంలో ఎంతో శ్రమించి కూడబెట్టిన డబ్బును కొడుకు, కోడళ్ళకు అప్పగించాలని ఒకడు బయల్దేరుతాడు. కొడుకు స్వగ్రామం విడిచిపెట్టాడని తెలిసి అతనికోసం అన్వేషిస్తుండగా డబ్బంతా దొంగలు దోచుకుంటారు. మిగిలిన ఒక్క నగను బెజవాడ కనకదుర్గకు సమ

ర్పించాలను కుంటాడు. చివరకు దుర్గ అనే పసిపాప మెళ్ళో ఆ నగ వేసి పూర్తి సంతృప్తితో వెళ్ళి పోతాడు. అతని అన్వేషణ ఆ విధంగా సఫలమవుతుంది.

మూడవ రచయిత శ్రీ రామచంద్రం వ్రాసిన "ఆశ"- అప్పులడిగే వారిని వదిలించుకోవడానికి సంబంధించిన సరదా రచన.

'చలపతి – చదరంగం' వ్రాసిన శ్రీ నళినీ రంజన్ నాల్గవ రచయిత. ఎప్పుడూ బుద్ధిపూర్వకంగా చదరంగంలో ఓడిపోయే చలపతి తను ప్రేమించిన ఒక స్త్రీ సలహాతో గెలవడం మొదలు పెడతాడు.

అయిదవ రచయిత శ్రీ దివాకర్ మూడు కథలు వ్రాశారు. డబ్బిచ్చి మార్కులు వేయించు కోవడంపై సెటైర్ "లక్ష్మి". భగ్న ప్రేమికుడు కథ "నవ్వు". అహింసా సిద్ధాంతంపై మరొక సెటైర్ "గుణం".

అన్ని కథలూ ఒకే స్థాయిలో వున్నా యనడానికి వీలులేదు. రచయితలుగా వీరింకా విద్యార్థి దశలోనే వున్నప్పటికి, కొన్ని కథలు మరీ ప్రారంభ దశను, మరికొన్ని కొంత నేర్పును సూచిస్తున్నాయి. ఉన్న వాటిలో శ్రీ భాస్కర్ కథ "అన్వేషణ" బాగున్నది. పరిచయ వాక్యాలు వ్రాసిన శ్రీ సంజీవదేవ్ ఈ సంకలనంలోని కథలను మల్లె పువ్వులతో కాక మల్లె మొగ్గలతో పోల్చారు. వారి వాక్యాలలోకెల్లా అర్థవంతమైన మాటలివి. రచయితలు కూడా తమ గురించి 'తాము నిర్మొగమాటంగా' చెప్పుకున్నారు. ఈ కథలు పత్రికలలో వచ్చే వాటి కంటె మెరుగైనవని గాని (ఒకటి రెండు కథల విషయంలో ఇది నిజం కాదు.) కథా సాహిత్యంలో నిలిచి పోతాయనిగాని తమకు భ్రమలు లేవని, అయితే ముందుముందింకా బాగా వ్రాయగలమనే ఆత్మ విశ్వాసం తమకున్నదని వీరు వ్రాసుకున్నారు. ఈ ఆత్మ విశ్వాసం ఎంతైనా మెచ్చదగింది, సమర్థించ దగింది. ఈ రచయితలకు మంచి భవిష్యత్తును ఆకాంక్షిస్తున్నాము.

[మల్లెలు : కథామాల; సంకలనం "కరుణ"; ప్రతులకు : దేశీ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, శరత్ బిల్డింగ్స్, విజయవాడ-2; వెల : రు. 2—50]

□□□

చిత్రరథుని చైత్రయాత్ర

జగ్గయ్య జ్ఞానయాత్ర

ఇంతవరకూ 1965 జగ్గయ్యకు యిచ్చినంత జయం బహుశా మరే తారకూ యిచ్చి వుండలేదు. ప్రియమైన ఈ సంవత్సరంలో ఈ 39 ఏళ్ళ వయస్కుడు ఒక 'హ్యాట్ ట్రిక్' (వరుసగా మూడు విజయాలు) సాధించారు. ఢిల్లీలో ఒక 'హ్యాటు' ("చక్రవర్తి" అవార్డు చిత్రం సహా నాయక నటనకు ప్రశంస) అందుకొన్నారు. మరొక 'హ్యాటు'తో (టోపీతో) కీలుబొమ్మల "హీరో"గా కార్క్ (ఐర్లెండు) వెళ్ళారు. అసలు "హ్యాట్ ట్రిక్" ఆంధ్ర ప్రభుత్వపు నంది అవార్డులు అందుకొన్న "చక్రవర్తి", "కీలుబొమ్మలు", "గుడిగంటలు" మూడింటిలోను ఈ దుగ్గిరాల 'అగ్గిపిడుగు' నటించి వుండడం.

జగ్గయ్య నిజంగా ఒక విధంగా "అగ్గిపిడుగే". కేవలం సినిమా నటుడే కాదు. సమగ్ర సినిమా నటుడు. భాషాభిమాని. ఒక విధంగా ఆంగ్లాంధ్ర సవ్యసాచి. బి. ఏ. లో ఈయన సబ్జెక్టు లిటరేచర్. తెలుగులో టాగోర్ కవితను అనువదించారు. హంపీపైఇంపైన గేయాలు వ్రాశారు. సినిమాపాటలూ వ్రాశారు; మాటలూ కూర్చారు. స్టేజి ఎక్కారు. స్టేజి దిగారు. దినపత్రిక జర్నలిస్టు; ఇప్పటికీ పత్రికల కాలమిస్ట్, ఏ పీఠం ఎక్కినా దిగినా వాటితో ప్రత్యక్ష సంబంధం పెట్టుకొంటూనే వున్నారు. ఆ పీఠాలతో అసలు సినీ పీఠంలోని తన ప్రజ్ఞా పాటవాలు పెంపొందించు కొనేందుకు పాటు పడుతూనే వున్నారు.

ఢిల్లీ "ఆకాశవాణి"లో జగత్తు వార్తలు చదువుతున్న జగ్గయ్యను సినిమాకు దించినవి మూడు. ఒకటి చక్కటి మాడ్యులేషన్ కల లోహ కంఠం. రెండు స్టేజి అనుభవం. మూడు గోపీచంద్.

తెలుగు చిత్ర జగత్తు నుంచి ఇప్పుడు ప్రాచ్య పాశ్చాత్య జగత్తులకు జ్ఞాన యాత్రకు, చైత్ర యాత్రకు కొంగర గారిని పంపినవి కూడా మూడే. ఒకటి 'కీలుబొమ్మలు'. రెండు 'తేనె పూసిన కత్తి' వంటి పాత్రల అభినయంలో ఆయన విశిష్టస్థానం. మూడు విదేశ 'వియ్యంకుల'తో (కళాకారులు) విజ్ఞాన నెయ్యం గరపాలనే ఆకాంక్ష.



శ్రీదేవి ప్రొడక్షన్స్ వారి
'పరమానందయ్య శిష్యులు కథ'లో
కె. ఆర్. విజయ

జగ్గయ్య చిత్ర రజతోత్సవం జరుపుకొని వుండవచ్చు. ఎక్కువగా నాగేశ్వరరావుకు, రామారావుకు తమ్మునిగా నటించి మేటి నాయకుల తమ్ముని పాత్రకు అద్వితీయుడుగా నిరూపించుకొని వుండవచ్చు. ఒకటి రెండు జానపదాలు, పౌరాణికాలు, ఒకటి రెండు తమిళ చిత్రాలు తరచి చూచి వుండవచ్చు. ఆయనకు హెచ్చుగా వచ్చినవి తెలుగు సాంఘికాలు, తమ్మునిగానే కాక శృంగార నాయకుడుగానూ నటించారు. కాని వీటిలో ఆయన రాణించింది బహు తక్కువ. 'ఈడూ-జోడూ', 'మంచి రోజులు వస్తాయి' వంటివి మూడు నాలుగు మించిలేవు. గోపీచంద్ 'ప్రియురాలు' చిత్రంతో జగ్గయ్య సినీ జీవితమే కాదు ఉజ్జ్వల భవిష్యత్తు కూడా ప్రియమైనది; భద్రమైంది. జగ్గయ్య 'క్లాసిక్' నటునకు కొటేషన్ యివ్వాలి అంటే 'పేరంటాలు', 'బంగారుపాప', 'అప్పగింతలు', 'ఇంటికి దీపం ఇల్లాలే', 'చక్రవర్తి', లకు మించి బహుశా వుండవు. ఈ భూమికలలో దౌష్ట్యం లేదు. సౌమ్యం అది.

దౌష్ట్యంలో జగ్గయ్య నటన రెండువైపులా పదునుకల్ల కత్తి. 'తేనె పూసిన కత్తి' తరహా వేషాలు. సాన



శ్రీనివాస్ మూవీస్ వారి ఈస్ట్‌మన్ కలర్ చిత్రం
"సింగపూర్ సి. ఐ. డి." లో శివాజీ గణేశన్, బి. సరోజాదేవి

పెట్టిన పదును కత్తి తరహా వేషాలు. ఈ రెండింటిలోను జగ్గయ్య స్థానం జగ్గయ్యదే. అందుకు సాక్షి 'అర్ధాంగి' 'తోడికోడళ్ళు', 'ఆత్మబలం', 'చదువుకొన్న భార్య'.

కవి కదూ అంచేత జగ్గయ్యకు స్వేచ్ఛానటన అంటే మక్కువ ఎక్కువ. ఆ స్వేచ్ఛకు పాత్ర పరిస్థితి మరింత అనుకూలిస్తే ఆయనకూ ఆయన నటనకూ పట్టపగ్గాలుండవు. ఆత్మ సంఘర్షణ కల భూమికలలో ఈ పట్టభద్రుడు నిజమైన 'పట్టభద్రుడు' డైనప్పటికి హుషారు, చలాకీ, స్వేచ్ఛాపాత్రలలో ఆయన నటన 'ఆనర్సు' స్థాయి నందుకొన్నదని చెప్పవచ్చు. 'అత్తా ఒకింటి కోడలే', 'మంచి రోజులు వస్తాయి' (ఉన్మత్తునిగా నటన), 'జల్సారాయుడు', 'ప్రేమించి చూడు' క్లైయిముకు 'క్యూ'లో నిలబడుతున్నవి.

మూడు నాలుగు రకాల పాత్రలలో మంచి స్థానం జయించిన జగ్గయ్య, ప్రాచ్య పాశ్చాత్య రాజ్య

జ్ఞాన యాత్రలో నాలుగైదు మజిలీలు వేసుకొన్నారు.

సెప్టెంబర్ ఎనిమిది ఉదయం మద్రాసు నుంచి విమానంలో "కీలు బొమ్మలు" యూనిట్‌తో (గంగాధరరావు, సి. ఎస్. రావు, ఎ. ఎస్. ఆర్. ఆంజనేయులు) బయలుదేరనప్పటికి జగ్గయ్య ప్రోగ్రాము యిది :

సెప్టెంబర్ ఎనిమిది మధ్యాహ్నానికే మాస్కో చేరడం, అక్కడ 9, 10 తేదీలలో సినిమా ప్రముఖులను కలుసుకొనడం, వారి కళా జీవితం పరిశీలించడం, నాటకాలు చూడడం, నాటకోద్యమం పరిశీలించడం; ఎన్నో విషయాలు తెలుసుకొనడం.

11 ఉదయం లండన్‌కు బయలుదేరడం. అచ్చట నుంచి ఐర్లెండ్ ప్రయాణం. డబ్లిన్, కార్క్ సందర్శన. 12–19 వరకు ఐర్లెండు ఉత్సవంలో పాల్గొని, లండన్‌కు వచ్చి, చెకొస్లొవాకియా ప్రభుత్వం ఆహ్వానంపై ప్రాగ్ వచ్చి సినిమా, స్టేజి పరిశీలనలు జరపడం.

పారిస్, బెర్లిన్, వియన్నా, రోమ్‌లలో కూడా పరిశీలనా హోమ్‌లు వెయ్యాలని జగ్గయ్య ఉత్సాహపడినారు.

"జ్యోతి" ప్రతినిధి జగ్గయ్యకు ఆలోచనకు వ్యవధి యివ్వకుండా ఉక్కిరి బిక్కిరి ప్రశ్నలువేసి రాబట్టిన సమాధానాలలో జగ్గయ్య ప్రతిబింబం చూడదగును :

ప్రశ్న : "కీలుబొమ్మలు" ఆంధ్ర జీవితానికి, ఆంధ్ర సినీకళకు గీటురాయి (సింబల్) అని మీ నమ్మకమా ?

జవాబు : చాలావరకు చాలా చిత్రాల కంటె హెచ్చుగా.

ప్ర : భారత్ ఏకైక ప్రతినిధి చిత్రంగా "కీలుబొమ్మలు" వెడుతున్నది. దానికంత అంతస్తు వుందనే మీరు విశ్వసిస్తున్నారా ?


జ : చాలావరకు. చాలా చిత్రాలలో కంటె హెచ్చుగా, భారత్ ఘనత ఆధ్యాత్మిక విలువలలో వున్నది. "కీలు బొమ్మలు" ఘనతా అందులోనే వుంది జర్నలిస్టు సోదరా!

ప్ర : మరికొన్ని దేశాలుకూడా వెడుతున్నారు. మీరు నటించిన ఇతర చిత్రాల భాగాలేమైనా తీసుకొని వెడుతున్నారా?

జ : లగేజి సమస్య నా ఉత్సాహానికి "మోయలేని లగేజి" అయిపోయింది.

ప్ర : మరి విదేశాలకు ఏమి తీసుకొని వెడుతున్నారు?

జ : జ్ఞాన తృష్ణ. ఇతర దేశాలలోని సినిమా, దానికంటె



ప్రసాద్ ప్రొడక్షన్స్ "ఇల్లాలు"లో
కొత్తనటుడు కె. వి. నాగేశ్వరరావు, గీతాంజలి

స్టేజి ఉద్యమం, పరిణామాలు తెలుసుకొనడం నా ప్రథమ లక్ష్యం.

ప్ర : అద్వితీయ నటనకు మీ ఉదాహరణ... వెంటనే చెప్పాలి.

జ : నిలేసి అడిగితే చెప్పలేను. టైము కావాలి...

ప్ర : జర్నలిస్టు సోదరా! ఈ జవాబు నాకే తలవంపులుగా వుంది!!

జ : ఇటీవలి చిత్రాలయితే తక్కున చెప్పేస్తా. "బెకెట్"లో రెండవ హెన్రీ రాజు పాత్ర ధరించిన ఓటూల్. పాత్ర నిర్మాణం, పాత్ర భాషోచ్చారణ టూల్‌ను అంతటి ఘనుణ్ణి చేసింది.

ప్ర : 'బెకెట్'లో బెకెట్ పాత్ర (రిఛార్డ్ బర్టన్) నటన కష్టంకాదా.

జ : కష్టమే అయినా టూల్‌కే

ఫన్టుమార్క్ "క్లియోపాత్రా"లో కంటె బెకెట్‌లో బర్టన్ ఉత్తమంగా నటించారు. అంతే.

ప్ర: మీకు ఎటువంటి పాత్ర అంటే విశేషాభిమానం?

జ: మానసిక సంఘర్షణకు అవకాశం వున్న ఎమోషనల్ రోల్.

ప్ర: ఎటువంటి పాత్ర అంటే అసహ్యం.

జ: ఆముదం రోల్స్ అంటే 'డ్రాబ్' రోల్స్.

ప్ర: మరి మీరు అవి కొన్ని చిత్రాలలో ధరించారే!

జ: సినిమా జీవితం అంటే అదే బ్రదర్!

ప్ర: ఏ బ్రదర్స్‌కు మీరు ఋణపడి వున్నారు: (1) ప్రేక్షకులు (2) మీ ప్రజ్ఞ (3) దర్శకుడు (4) రచయిత (5) తోటి తారలు (6) గోపీచంద్.

జ: ఫస్ట్ అండ్ ల్యాస్ట్.

చలన చిత్ర వార్తలు

"ఇల్లాలు" రంగుల శోభ

ప్రసాద్‌ప్రొడక్షన్స్ "ఇల్లాలు"లో ఔట్‌డోర్‌లో తీసిన ఘట్టాలకు సంభాషణ జోడింపు సెప్టెంబర్‌లో జరిగింది. కె. వి. నాగేశ్వరరావు అనే కొత్త నటుని పరిచయం చేస్తున్న ఈ ఉత్కంఠ ప్రేరేపక చిత్రంలో ఒక విశేషం సూటికథ తెలుపు - నలుపులోను గడచిన కథ (ఫ్లాష్ బ్యాక్స్) ఈస్ట్‌మన్ కలర్‌లోను నడుగిడడం. కె. ఎస్. ప్రసాద్ ఛాయగ్రహణం, తోటసెట్లూకన్నుల పండుగ, రచన ముళ్ళపూడి, దర్శకుడు ఏ. సంజీవరావు. విడుదల అక్టోబర్.

మరొక వర్ణ చిత్రంలో నాగేశ్వరరావు

బి. ఎస్ రంగా "వసంతసేన"ను రంగులలో తెలుగు హిందీ భాషలలో నిర్మించ నున్నారు. రెండింటిలోను నాయిక పద్మిని. తెలుగులో అక్కినేని నాగేశ్వరరావు, హిందీలో సునీల్‌దత్ నటిస్తారు.

"కథా నాయకుని కథ"

"ఆనంద గౌరి ఫిలిమ్స్ వారు "కథా నాయకుడు కథ" అనే చిత్రం తీయదలచారు. శ్రీ దేవనారాయణ రచన సాగిస్తున్నారు.

పాముగా మారిన తార

శ్రీ దేవి ప్రొడక్షన్స్ "పరమానందయ్య శిష్యుల కథ"లో ఈమధ్య వీనస్ స్టుడియోలో యక్షకన్య చిత్రలేఖ (కె. ఆర్. విజయ) పాముగా మారిపోవడం మొదలైన ఘట్టాలు చిత్రీకరించారు. జనవరికి సిద్ధం కాగల ఈ చిత్రం దర్శకుడు: సి. పుల్లయ్య. రచన: సదాశివ బ్రహ్మం.



జెమినీవారి "ఆడ బ్రతుకు"లో నృత్య భంగిమలో దేవిక

శకుంతలా దుష్యంతుల ప్రథమ సమాగమం

రాజ్యం ప్రొడక్షన్స్‌వారి "శకుంతల"లో శకుంతలా దుష్యంతుల (బి. సరోజాదేవి, ఎన్. టి. రామారావు) ప్రథమ సమాగమం చిత్రీకరణ శ్యామలా స్టుడియోస్‌లో ఇటీవల జరిగింది. ప్రియంవద, అనసూయలకు (గీతాంజలి, శారద) ఈ చిత్రంలో ప్రాధాన్యం కలదు. అక్టోబర్ ఆఖరుకు సర్వ సిద్ధం కాగల ఈ చిత్రానికి దర్శకుడు కమలాకర కామేశ్వరరావు. రచన: సముద్రాల రాఘవాచార్య, నిర్మాతలు: శ్రీధరరావు, రాజ్యం.

"ఆత్మ గౌరవం"

అన్నపూర్ణా వారి "ఆత్మ గౌరవం" షూటింగ్ శీఘ్రగతిని జరుగుతున్నది. నాగేశ్వరరావు. కాంచన ముఖ్య పాత్రలు ధరిస్తున్న ఈ చిత్రానికి కె. విశ్వనాథ్ దర్శకుడు. సంభాషణలు: భమిడిపాటి రాధాకృష్ణ. నిర్మాత: డి. మధుసూదనరావు. సెప్టెంబర్ 19 నుంచి బెంగుళూరు ప్రాంతాలలో లొకేషన్ షూటింగ్ జరిగివుంటుంది.

రంగారావు సంభాషణలలో కొత్త రంగు

పదివారాలు మద్రాసు ఫిలిం రంగాన్ని ఉద్రూత లూగించింది పారమౌంట్ వారి ఆంగ్ల చిత్రం "బెకెట్"లో రెండవ హెన్రీరాజుగా పీటర్ ఓటూల్ నటన, సంభాషణ, ఒక్క పదాన్నే విరిచి వంపులతో వత్తులతో ఆయన మాట్లాడిన తీరు ఒక గొప్ప ఫ్లాష్. ఎస్. వి. రంగారావు ఆ సంభాషణోచ్ఛారణకు ముగ్ధులైనారు. శ్రీ శంభూ ఫిలిమ్సువారి శ్రీకాకుళ "ఆంధ్ర మహా విష్ణు కథ"లో తన విశంభుని పాత్రలో ఓటూల్ ఛాయలు వినిపిస్తానుచూసుకోండి అని హెచ్చరించారు. జనవరికి సిద్ధమయ్యే ఈ చిత్రం దర్శకుడు శేఖర్. రచయిత పింగళి నాగేంద్రరావు. నిర్మాత దగ్గుపాటి లక్ష్మీనారాయణ.

హిందీలో "అత్తా ఒకింటి కోడలే"

'ఖాన్‌దాన్' నిర్మాతలు వాసూ ఫిలిమ్స్‌వారు 'అత్తా ఒకింటికోడలే'ను హిందీలో పునర్నిర్మించబోతున్నారు. దర్శకుడు: దాదామిరాసి. నిర్మాత: వాసుమీనన్.


ముఖ్యమంత్రి: మఖ్దుం

కె. ఏ. అబ్బాస్ హైదరాబాద్‌లో మొదటి హిందీ చిత్రం "ఆస్మన్ మహల్" నిర్మిస్తున్నారు. ముఖ్యమంత్రి కె. బ్రహ్మానందరెడ్డి సెప్టెంబర్ 2న ఐవాన్ ఏ ఉర్దు హాలులో కెమెరాకు స్విచ్ ఆన్ చేసి నిర్మాణానికి ప్రారంభోత్సవం జరిపారు. కమ్యూనిస్టు నాయకుడు మఖ్దుం మొహియుద్దీన్ క్లాపర్ బాయ్‌గా పనిచేశారు. సురేఖపై మొదటి "షాట్" తీశారు. అబ్బాస్ కృషికి ఆంధ్ర ప్రభుత్వపు అండదండలు వుండగలవని ముఖ్యమంత్రి అభయ మిచ్చారు.

బి. ఎన్. క్లయిమాక్సు

వాహినీ బ్యానర్‌లో బి. ఎన్. రెడ్డి దర్శకత్వం వహించనున్న సాంఘిక చిత్రానికి స్క్రిప్టు పని పూర్తి అయింది. ఒక్క పతాక సన్నివేశం తీర్చి దిద్దడానికే అనేక వారాలు పట్టింది. ఇప్పుడు రెడ్డి గారికి సంతృప్తికరంగా వున్నది. కథను వివరంగా కూర్చినది పాలగుమ్మి పద్మరాజు. ముఖ్య పాత్రధారిణి అంజలి. సంగీతం: ఎస్. రాజేశ్వరరావు. దీపావళి ప్రాంతాల షూటింగ్ ప్రారంభం కావచ్చు.

Edited and Published by V. V. Raghavaiah and Printed by him at Jyothi Press, Congress Office Road, Governorpet, Vijayawada-2.



JYOTI OCT '65 Regd No H368
విజయావారి
సి.ఐ.డి.
దర్శకుడు చాణక్య
నిర్మాతలు నాగిరెడ్డి - చక్రపాణి